

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

16

ప్రకాశం

బుధవారం 30, ఆగస్టు 2017

డీసీసీబీలో అదే వరుస

- కొనసాగుతున్న రాజీనామాల పర్వం
- మరో ముగ్గురు బ్యాంకు డైరెక్టర్‌లు రాజీనామా
- అదే బాటలో సొసైటీల అధ్యక్షులు
- మోహన్‌తో నలుగురు శాసనసభ్యులు, పలువురు నాయకుల మంతనాలు
- సమాచార సేకరణలో మంత్రి వ్యక్తిగత కార్యదర్శి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) డైరెక్టర్‌ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సహకార శాఖ కమిషనర్ (ఆర్‌సీఎస్) మురళి తీరును నిరసిస్తూ మొదలైన తిరుగుబాటు కింది స్థాయికి చేరుతోంది. బ్యాంకు చైర్మన్ మోహన్‌కు మద్దతుగా మరో ముగ్గురు డైరెక్టర్‌లతోపాటు, కొందరు సొసైటీ అధ్యక్షులు కూడా మంగళవారం రాజీనామా చేశారు. ఈ పరంపరం బుధవారం కూడా కొనసాగే అవకాశం కన్పిస్తోంది. అజ్ఞాతం వీడి మంగళవారం ఒంగోలు చేరిన మోహన్‌ను సొసైటీల అధ్యక్షులు పలువురు కలిసి మద్దతు ప్రకటించారు. అధికార పార్టీకి చెందిన నలుగురు శాసనసభ్యులు, వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు ఆయనతో మాట్లాడి సమస్యను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. నాలుగు రోజుల

మిగతా 15వ పేజీలో



మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌చంద్

వచ్చే ఏడాదికి వెలిగొండ నీరు

- డిసెంబర్ లోపు హెడ్‌రెగ్యులేటరీ పనులు
- రెండో దశలో మోపాడుకు అనుసంధానం
- కలెక్టర్ వినయ్‌చంద్ వెల్లడి
- పామూరు మండలంలో పర్యటన
- అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రి, మోపాడు రిజర్వాయర్ సందర్శన
- అభివృద్ధి పనుల పరిశీలన

15లో

మేమింతే!



ఎంవీఐ సీజ్ చేసిన ట్రాక్టర్‌లు

- ఆగని ఇసుక అక్రమ రవాణా
- అడ్డాగా చిలకలేరు, గుండ్లకమ్మ
- అనధికారికంగా పదుల సంఖ్యలో రీచ్‌లు
- అధికారిక క్వారీల్లోనూ యంత్రాలతో తవ్వకం
- మల్కాపురం వద్ద 11ట్రాక్టర్‌ల సీజ్

15లో

అద్దంకి ప్రాంతంలో ఇసుక అక్రమ క్వారీయింగ్, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిబంధనలు మార్చినా, భారీ జరిమానాలు విధిస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించినా అక్రమార్కులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. 'మేమింతే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. చిలకలేరు, గుండ్లకమ్మలను అడ్డాగా చేసుకుని అక్రమ క్వారీయింగ్ చేస్తున్నారు. రోజుకు వందలాది ట్రాక్టర్‌ల ఇసుకను కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. ఈ ప్రాంతంలో అధికారికంగా మూడు రీచ్‌లు మాత్రమే ఉండగా 20 ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. తాళ్లూరు మండలం మల్కాపురం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు దర్శి ఎంవీఐ శేషురెడ్డి మంగళవారం అక్కడి అనధికార రీచ్‌పై దాడి చేసి 11 ట్రాక్టర్‌లను సీజ్ చేయడం ఇసుక అక్రమ రవాణా జోరుకు అద్దం పడుతోంది.



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న డీఆర్వో, అధికారులు

చిన్నతనంలోనే తెలుగుపై మక్కువ కలిగించాలి

- డీఆర్వో ప్రభాకర్‌రెడ్డి పిలుపు
- ఘనంగా మాతృభాషా దినోత్సవం

16లో

ఇంటర్వ్యూ



కే రామ్మోహన్‌రావు, పబ్లిక్ హెల్త్ ఈఈ

పట్టణాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పట్టణాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉంది ?

అద్దంకి, కందుకూరు, చీరాలలో నీటి ఇబ్బందులు లేవు. రోజూ సరఫరా చేస్తున్నాం.

పశ్చిమ ప్రాంతంలో పరిస్థితి ఏమిటి ?

మార్కాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తిగా అడుగంటింది.

ప్రజల ఇబ్బందులు తొలగించడానికి ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రైవేటు బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి రోజుకు 600 ట్యాంకర్లతో నీరిస్తున్నాం.

గిద్దలూరులో పరిస్థితి ఎలా ఉంది ?

సమృద్ధి వర్షాల కారణంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. సమస్య కొంత తగ్గింది.

కనిగిరిలో నీటి సరఫరాకు ఇబ్బంది లేదా?

వర్షాల పడుతున్నందున గ్రౌండ్‌వాటర్ లభ్యమవుతోంది. 8 వార్డులకు రోజూ, 11 వార్డులకు రోజు మార్చి రోజు అందిస్తున్నాం.

చీమకుర్తి నగర పంచాయతీలో నీరు సక్రమంగా అందుతుందా ?

ఇబ్బంది లేదు. రామతీర్థంలో లేకపోయినా, వర్షపు నీరు చెరువులకు కొంతమేర చేరింది.

ఒంగోలులో సమస్య తీవ్రమైంది కదా ?

వాస్తవమే. అధిగమించడానికి కార్పొరేషన్ దృష్టి సారించింది.

గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు పైపులైను పనులు ఏ దశలో ఉన్నాయి ?

ఏడుగుండ్లపాడు నుంచి ఒంగోలుకు 70 శాతం పనులు పూర్తయ్యాయి.

గుండ్లకమ్మ నుంచి ఏడుగుండ్లపాడుకు పైపులైను పనులు మొదలయ్యాయా ?

రూ.123 కోట్లతో పైపులైను పనులకు టెండర్లు పిలిచాం. ప్రభుత్వ అనుమతిస్తే రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తాం.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించారా ?

పట్టణాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.16.70కోట్లు విడుదలయ్యాయి.

ఏ మునిసిపాలిటికి ఎంతెంత కేటాయించారు ?

ఒంగోలు రూ. 4 కోట్లు, మార్కాపురం రూ. 6.20 కోట్లు, కనిగిరి రూ. 2కోట్లు, గిద్దలూరు రూ. 4.50కోట్లు **- ఒంగోలు కార్పొరేషన్**

వినూత్న చిత్ర 'సృష్టి'కర్త విఘ్నేష్

అతని చేతిలో కుంచె మయూరమై నర్తిస్తున్నట్లు ఉంటుంది. నిమిషాల వ్యవధిలోనే అద్భుతమైన చిత్రరాజం జీవం పోసుకుంటుంది. అతని ఆలోచనలతో రంగులు కొత్త హంగులు పొందుతాయి. పదేళ్ల వయసులోనే అతడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. చిత్రకళలో వినూత్న చిత్రాలను సృష్టిస్తూ రాష్ట్ర స్థాయిలో పేరొందిన చిత్రకారులచే ఔరా అనిపించుకుంటున్నాడు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించిన విఘ్నేష్ అంజన్ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

చిన్నవయసులోనే ఎన్నో రికార్డుల సాధన

సృష్టి ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిత్రకళలో విజయపరంపర

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం






చంద్రబాబు నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విఘ్నేష్

ఒంగోలు కల్చరల్ : విఘ్నేష్‌అంజన్‌ది ఒంగోలు నగరంలోని ఇస్లాం పేట. అతి సామాన్య కుటుంబం. చిన్నతనం నుంచే చిత్రకళంటే ప్రాణం. అతనిలోని కళాతృష్ణను తల్లిదండ్రులు జైఆంధ్రా, జగదీశ్వరీలు గమనించారు. అతన్ని ఒంగోలు లోని సృష్టి ఆర్ట్స్ అకాడమీలో చేర్పించారు. చిత్రకళలో తర్ఫీదునిప్పించారు. ఆరేళ్లవయసులోనే సంతపేట సాయిబాబా మందిరంలో పూజాద్రవ్యాలైన గంధం, విభూతి, కుంకుమ, ధూప్‌స్టిక్స్, బియ్యపుపిండి ఉపయోగించి కాన్వాస్‌పై సాయి బాబా చిత్రాన్ని రూపొందించి మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. విఘ్నేష్ ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు చిత్రకళకూ ప్రాధాన్యమిస్తూ రోజూ గంటలకొద్ది సాధన చేస్తుంటాడు. అంతర్జాతీయ స్థాయిలో 73 దేశాల నుంచి వచ్చిన చిత్రకారులు పాల్గొన్న చిత్రకళ పోటీల్లో టాప్ 10లో నిలిచి అవార్డు పొందిన విఘ్నేష్ కాన్వాస్‌పై 3లక్షల 11వేల చుక్కలతో ప్రముఖ చిత్రకారుడు, దర్శకుడు బాపు బొమ్మను చిత్రించి రికార్డు నెలకొల్పాడు.









విఘ్నేష్ గీసిన చిత్రాలు

విఘ్నేష్ అంజన్ తన చిత్రకళా ప్రతిభతో ఎందరో ప్రముఖుల చేతులమీదుగా అవార్డులు, రివార్డులు అందుకుని నేటి బాలబాలికలకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాన్ని అందుకోవటమే కాకుండా రూ.50వేల నగదు ప్రోత్సహకాన్ని సైతం అందుకున్నాడు విఘ్నేష్. గూగుల్ సంస్థ నిర్వహించిన స్పేస్ పోటీల్లో ప్రశంసాపత్రాన్ని, హైదరాబాదు రసమయి సంస్థ నుంచి సినీ నటి జమున చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని, కళాతపస్వి కె.విశ్వనాథ్, శిశు, సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయ్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి తదితరుల ప్రశంసలను పొందాడు. తమ కుమారుడి విజయం వెనుక సృష్టి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తిమ్మిరి రవీంద్ర శిక్షణతో బాటు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రోత్సాహం ఎంతో ఉన్నాయని అతని తల్లిదండ్రులు చెప్పారు.



ఎమ్మెల్యే జనార్దన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విఘ్నేష్, పక్కన రవి

ఏడాదికి రూ.1200తో కార్పొరేట్ వైద్యం

'ఆరోగ్యరక్ష'తో అందరికీ భద్రత

ఇదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

డిసెంబరు 31వ తేదీ వరకు గడువు

ఎర్రగొండపాలెంరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం గట్టి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఆరోగ్య రక్ష, చంద్రన్న సంచారవైద్యం, ఎన్‌టీఆర్ వైద్యసేవ, ఉద్యోగులు, జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇలా పలు రకాల పథకాలను చేపట్టింది. తెల్ల రేషన్ కార్డులు లేని పేదల కోసం ఆరోగ్యరక్ష పథకాన్ని ప్రత్యేకంగా ప్రవేశపెట్టి అమలుచేస్తోంది. ఒక వ్యక్తి ఏడాదికి రూ. 1200 చెల్లిస్తే కార్పొరేట్ వైద్య శాలల్లో రూ. 2లక్షల విలువైన వైద్యసేవలు అందుతాయి. ఇందులో కుటుంబ సభ్యులు అందరూ చేరి ఒక్కొక్కరు ప్రీమియం కట్టి వినియో గించుకోవచ్చు. ఈ పథకం కింద వైద్య సేవల అనంతరం 138 రకాల వ్యాధులకు ఏడాది పాటు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చు.

తెల్ల రేషన్ కార్డు లేనివారందరికీ ఆరోగ్య భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నిశితపరిశీలన చేసింది. అందులో భాగంగానే ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యరక్ష పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో చేరేందుకు గతంలో ఇచ్చిన గడువునాటికి ఎక్కువ మంది నమోదు కాలేకపోయారు.ఇప్పుడిప్పుడే ఈ పథకంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఇందులో చేరేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తుండడంతో డిసెంబరు 31వరకు గడువు పొడిగించింది.



జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మొత్తం 2790 కుటుంబాల్లో 5,899 మంది ప్రీమియం చెల్లించి పథకంలో సభ్యులుగా చేరారు. ఇందులో 1728 కుటుంబాల్లోని 3732 మంది నేరుగా ప్రీమియం చెల్లించగా, 1062 కుటుంబాల్లోని 2167 మంది మీ సేవ కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్నారు. ఇంకా నమోదు కానివారు ఆయా గ్రామాల్లో ఉన్న మీసేవ కేంద్రాల్లో నగదు చెల్లించి పథకంలో నమెదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారానూ పథకంలో నమోదుకావచ్చు. ఇంకా వివరాలు తెలుసుకునేందుకు అన్ని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో ఉన్న ఎన్‌టీఆర్ ఆరోగ్యసేవ ఆరోగ్య మిత్రలను సంప్రదించవచ్చు.

అందనున్న మెరుగైన వైద్యసేవలు

అమీర్‌అలీ, ప్రభుత్వవైద్యాధికారి, త్రిపురాంతకం



ఏడాదికి కేవలం రూ.1200 చెల్లించటం ద్వారా కార్పొరేట్ వైద్యం పొందవచ్చు. ఎన్‌టీఆర్ వైద్యసేవ, ఇతర పథకాల కన్నా మెరుగైన వైద్యసేవలు దీని ద్వారా అందుతాయి. తెల్లకార్డు లేని వారందరికీ ఇది నిజంగా ఆరోగ్యరక్షే.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

సింగరాయకొండ రూరల్: మండలంలోని మూలగుంటపాడు 8వ లైన్‌లోని మంగళవారం ఉదయం సుబ్బరత్తమ్మ నుండి బంగారపు చైన్ దుండగుడు వెనుక నుంచి వచ్చి అపహరించుకుని పరుగెత్తగా ఆమె వెంటనే స్థానికులకు సమాచారం ఇవ్వగా దుండగుని పట్టుకొని ఎస్‌ఐ హాజరత్తయ్యకు అప్పగించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఎం మహేష్ ఒంగోలు పట్టణానికి చెందిన వాడిగా గుర్తించామని ఆమె మెడలో నుంచి రెండున్నర సవర చైన్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా స్థానిక పట్టుకొని మాకు అప్పగించటం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

అద్దంకి: మండలంలోని కొటికలపూడి పంచాయితీ పరిధిలో ఉన్న పార్వతిపురంలో కుక్కలు దాడి చేయటంతో బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు 5 సంవత్సరాల వయస్సు ఉన్న కంచర్ల సాయి మణికంఠ మంగళవారం ఉదయం బహిర్భూమి కి వెళ్ళగా నాలుగు కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. సుమారు 50 గాట్లు కావటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



చిన్నారి షియోని హంతకుడి అరెస్టు?

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ముప్పుతిప్పలు పెట్టించిన నిందితుడు

ఒంగోలు క్రైం : సంచలనం కలిగించిన చిన్నారి షియోనీ హత్య కేసులో నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నెలరోజులుగా ముప్పుతిప్పలు పెట్టిన నిందితుడు పేరయ్యను నేడు కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం నిందితుడి కుటుంబ నేపథ్యం అంతా నేరప్రవృత్తే. ఇంటి దొంగతనాలు అలవాటు పడిన పేరయ్య పోలీసులకు చిక్కకుండా ఆనేక జాగ్రత్తలు తీసుకుంటూ తిరిగేవాడు. 2016లో తెలంగాణాలోని ఖమ్మం జిల్లా జైలు నుంచి విడుదలైన పేరయ్య పెదఇర్ల పాడులో పండ్లతోటలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సుమారు 20కిపైగా దొంగతనాలు, కేసులలో చిరునామాగానీ, సెల్‌ఫోన్ కూడా వాడకుండా తిరిగేవాడు. చాకచక్యంగా తన బంధువులు, సహచరుల భార్యలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నాడు. వారి భర్తలను కేసులలో ఇరికిస్తానని బెదిరించేవాడు.



అసలేం జరిగింది?

నెల్లూరు జిల్లా రాపూరు మండలం దిండిపల్లి గ్రామానికి చెందిన బ్రహ్మయ్య గత నెల 20న చికిత్స నిమిత్తం షియోనిని పెద ఇర్లపాడు తీసుకెళ్ళాడు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి బ్రహ్మయ్యతో మాట కలిపాడు. వారిద్దరూ ఆక్కడే మద్యం తాగారు. మరో అరగంట తరువాత బ్రహ్మయ్యకు డబ్బులు ఇచ్చి మద్యం తెమ్మని, షియోని తన వద్ద ఉంటుందని చెప్పి పంపించాడు. బ్రహ్మయ్య వద్ద సెలఫోన్‌ను ఆవ్యక్తికి ఇచ్చి మద్యం తెచ్చేందుకు వెళ్ళాడు. తిరిగి వచ్చే సరికి చిన్నారితో సహా కనిపించకపోవడంతో బ్రహ్మయ్య పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సెల్‌ఫోన్‌టవర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. పెద్దఇర్లపాడు నుంచి బస్సులో బయలుదేరిన నిందితుడు బైపాస్‌లో పోలీసులు తనిఖీలు చేస్తున్నట్లు బస్సులో ఉండే గుర్తించాడు. దీంతో వెంటనే తనవద్ద ఉన్న సెల్‌ఫోన్ స్విచాఫ్ చేశాడు. అతడి వద్ద చిన్నారి లేకపోవడంతో పోలీసులు గుర్తించలేదు. నేరుగా ఒంగోలు బస్టాండుకు వచ్చిన పేరయ్య చీరాల వెళ్ళి అక్కడ నుంచి గుంటూరు వెళ్లాడు. దాంతో నిందితుడిని పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ కేసుపై ఎస్పీ సత్యఏసు బాబు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ దర్యాప్తు బృందానికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

కేసును ఎలా ఛేదించారు?

పేరయ్య కుటుంబ నేపథ్యంను బయటికి తీశారు. వారిలో ఎంత మంది దొంగతనాలకు పాల్పడతారు? ఎక్కడెక్కడ వారిపై కేసులున్నాయి? సమాచారం తెప్పించారు. పేరయ్య కుటుంబసభ్యులు ఫొటోలను సేకరించారు. పేరయ్య ఫొటోను షియోని తండ్రి బ్రహ్మయ్య గుర్తించాడు. ఆధారాలేవీ లేని పేరయ్యను పట్టుకోవడం కష్టమైంది. పేరయ్యతో అత్యంత సన్నిహితంగా ఉండే వారిని గుర్తించి వారి ద్వారా నిందితుడిని పట్టుకున్నారు. బుధవారం కోర్టులో హాజరుపెట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ప్రేమ విఫలమైందని ఆత్మహత్యాయత్నం

కనిగిరి టౌన్ : ప్రేమవిఫలమైందని మంగళవారం కనిగిరిలోని ఇందిరాకాలనీలో గోపి(25) ఆత్మహత్యకు యత్నించాడు. తల్లిదండ్రులు వంటపనికి వెళ్తుంటారు. గోపి డిగ్రీ పూర్తిచేసి తల్లిదండ్రులతోపాటు క్యాటరింగ్‌కు వెళ్తూంటాడు. అయితే ఈ క్రమంలో తన ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించలేదని వారులేని సమయంలో కత్తిపీటతో గొంతుకోసుకున్నాడు. స్థానికులు గమనించి స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతిపై కేసు

తాళ్లూరు: మహిళ మృతిపై మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నాగమల్లేశ్వరి కడుపునొప్పితో బాధపడుతూ చికిత్సలు చేయించుకున్నా తగ్గక పోవడంతో సోమవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకున్న విషయం విదితమే. ఒంగోలు లో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. స్థానిక ఎస్‌ఐ కేసునమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశారు. మృతురాలికి 9నెలల పాప, 3ఏళ్ల కుమారుడున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయల గోదాంలో తనిఖీ

- రూ.3 లక్షల సరుకు సీజ్ - నిర్వాహకుడిపై కేసు

కందుకూరు: లైసెన్స్ లేకుండా, తగిన భద్రతా ప్రమాణాలు పాటించ కుండా నివాస గృహాల మధ్య ఓ గృహంలో పెద్ద ఎత్తున టపాకాయలు నిల్వ ఉంచిన వ్యక్తిపై కందుకూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి సరుకుని సీజ్ చేశారు. పట్టణంలోని శివాలయం సమీపంలో పెద్దబజారులో మద్దాళి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఓ ఇంట్లో దీపావళి టపాకాయలు, పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు అందిన సమా చారంతో సీఐ కె.నరసింగరావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్‌ఐ టి.శ్రీరామ్ తన సిబ్బందితో దాడిచేయగా భారీగా నిల్వ చేసి ఉన్నట్లు గుర్తించారు. అయితే మద్దాళి లక్ష్మీనారాయణకు గోదాముకి లైసెన్సు కానీ, టపాకాయల విక్రయ లైసెన్సు కానీ లేవని, అంతేగాక చుట్టూ నివాస గృహాలు ఉండగా మధ్యలో భారీగా టపాకాయలు ఓ ఇంట్లో నిల్వ చేసి ఉండటం నేరమని పోలీసులు తెలిపారు. లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి సరుకు సీజ్ చేస్తున్నామని వారు తెలిపారు.



గోదాంలో నిల్వ ఉంచిన టపాకాయలు

కంటెయినర్ ఢీకొని యువతి మృతి

అద్దంకి: సైకిల్‌పై వెళ్తుండగా లారీ ఢీకొని ఉమామహేశ్వరి(22) మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని యన్‌టిఆర్ నగర్ 2 వ లైన్ కుందుర్తి వెంకటాచారి కుటుంబం నివాసముంటుంది. వెంకటాచారి తల్లి ఈశ్వరమ్మ దశదిన కర్మ మంగళవారం జరుగుతుండగా ఆయన కుమార్తె ఉమామహేశ్వరి తమలపాకులు అవసరం కావటంతో సైకిల్‌పై భవాని సెంటర్‌కు వెళ్లింది. తిరిగి వెళ్తుండగా స్పీడు బ్రేకర్ వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన ఆమెను 108లో ఒంగోలుకు తరలించగా అక్కడ మృతి చెందింది. ఉమామహేశ్వరి డిగ్రీ పూర్తి చేసి ఏడాదిగా ఇంటి వద్దనే ఉంటోంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.



సంఘటనా స్థలంలో యువతి

వ్యక్తిగత బాధలతో యువకుడి ఆత్మహత్య

తాళ్లూరు : మండలంలోని రామభద్రాపురానికి చెందిన వేమా సురేష్ (22) వ్యక్తిగత బాధలతో మంగళవారం తూర్పుగంగవరంలోని తనషాపులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేష్ సోమవారంరాత్రి షాపులోనే నిం ద్రించాడు. ఉదయాన్నే స్వగ్రామమైన రామభద్రాపురం గ్రామానికి వెళ్లి స్నానంచేసి షాపు వద్దకు వచ్చి షాపు తెరిచాడు. 10 గంటల సమయంలో షాపు పైభాగన గలకొక్కానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమచా రం అందుకున్న స్థానిక ఎస్‌ఐ విమహేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.



సురేష్ మృతదేహం

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

గిద్దలూరు : పట్టణంలోని శ్రీజీవనజ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షకుడు జితేందర్ మహేంద్ర వివిధ అంశాలపై నైపుణ్య శిక్షణ ఇచ్చారు. జాబ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులకు జాబ్ రిజిస్ట్రేషన్ చేయించారు. చదువుతో పాటు నైపుణ్య శిక్షణ పొందితే కోర్సు పూర్తయిన వెంటనే సులభంగా కోరుకున్న రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంగు వెంకటసుబ్బారెడ్డి, కరస్పాండెంట్ రెడ్డి వెంకటరెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ షేక్ మీరావలి, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

గిద్దలూరు : గిద్దలూరు పట్టణం, పలు ప్రాంతాల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. తెలుగు భాష వ్యాప్తికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.లక్ష్మీదేవి, విద్యా కమిటీ చైర్మన్ పగడాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యువ ప్రగతిపథం అధ్యక్షుడు సయ్యద్ ఫరూఖ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాతాళనాగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ శివపురం ఆంజనేయులు, వేమన సేవా సంస్థ అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి, గ్రంథపాలకుడు జి.రామకృష్ణారెడ్డి, యువ ప్రగతి పథం సేవా సంస్థ సభ్యులు జి.జగదీశ్వర్‌రెడ్డి, బాలవెంకటాచారి, తెలుగు ఉపాధ్యాయులు ఎ.బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ సీహెచ్ శ్రీనివాసరావు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.


గిద్దలూరులో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయినులు


కొమరోలులో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హెచ్ఎం శేషకుమార్ తదితరులు


కొమరోలులో

కొమరోలు : మాతృ భాష తెలుగు కన్నతల్లి వంటిదని తాటిచెర్లమోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషకుమార్ పేర్కొన్నారు. మంగళవారం తాటిచెర్లమోటులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

రాత్రివేళ విద్యుత్ కోతలతో గ్రామస్థుల ఇక్కట్లు

కొమరోలు : మండలంలోని దాదాపు 8 గ్రామాల్లో రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. బాదినేనిపల్లె, సూరవారిపల్లె, రామావారిపల్లె, బెడుసుపల్లె, మొట్టుపల్లె, గుంతపల్లె, బొద్దువానిపల్లె, పోసుపల్లె గ్రామాల్లో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సుమారు పదిరోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వర్షాలు పడుతుండడంతో దోమలు వ్యాపిస్తున్నాయని, కరెంటు లేకపోవడంతో నిద్రపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మెన్‌కు సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి విద్యుత్ కు అంతరాయం కలుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు


ఊరేగింపులో గణపతి విగ్రహం

కొమరోలు : వినాయక చవితి సందర్భంగా మండలంలోని తాటిచెర్లమోటు, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను ఐదవ రోజైన మంగళవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా తాటిచెర్లమోటు వినాయక మండపం వద్ద లడ్డూను 14,500 రూపాయలకు పొట్టిపల్లె గ్రామానికి చెందిన దాసరి శ్రీను వేలంపాటలో దక్కించుకున్నారు. విగ్రహాలను తాటిచెర్ల వద్ద ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు.

లడ్డు రూ. 1.10 లక్షలు

రాచర్ల : మండలంలోని అచ్చంపేట గ్రామంలో మంగళవారం గణనాథుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కులమతాలకు అతీతంగా అంతా పాల్గొని విఘ్నేశ్వరుడికి వీడ్కోలు పలికారు. సాయంత్రం జరిగిన లడ్డు వేలంపాటలో గణపతి సంఘ సభ్యులు రూ. 1.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.పెద్దిరాజు, దుగ్గా రంగస్వామిరెడ్డి, డాక్టర్ పుల్లారెడ్డి, నరాల యల్లారెడ్డి, బిజ్జం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం

అర్ధవీడు (బేస్తవారపేట) : అర్ధవీడు మండలంలోని చెర్లో దొనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి ఎంపీపీ ఎన్.రవికుమార్ యాదవ్, సర్పంచ్ జి.వెంకట సుబ్బమ్మ, హెచ్ఎం ఎం.బాలగురవయ్య, పీఈటీ మాస్టర్ పి.రామానాయక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్రీడా జ్యోతిని ఎంపీపీ రవికుమార్ యాదవ్ వెలిగించారు. అనంతరం హెచ్ఎం హెచ్ఎం బాలగురవయ్య, మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లోనూ ముందంజలో ఉండాలన్నారు. ఎంపీపీ రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఆటలు శారీరక దారుడ్యానికి, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పీఈటీ మాస్టర్ పి.రామానాయక్, ఉపాధ్యాయులు ఎం.పుల్లయ్య, ఎంవీ సత్యరమేష్, వై.లక్ష్మయ్య, ఎస్‌వీఎన్ ప్రసాద్, జీవీ విజయ్‌కుమార్, కె.వీరనారాయణ, సరోజ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎంపీపీ రవికుమార్ యాదవ్

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు : గిద్దలూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బండారు వెంకటసుబ్బమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ పి.కృష్ణమూర్తి తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు గ్రామసభ

కొమరోలు : మండల కేంద్రం కొమరోలులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.నరసయ్య తెలిపారు. పంచాయతీలోని 8 గ్రామాల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో తెలియజేవచ్చన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.

అన్నదానం

గిద్దలూరు : మండలంలోని దొడ్డంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని వైసీపీ ఇన్‌చార్జి ఐవీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ బాలంకిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పి.సుధాకర్ రెడ్డి, పి.ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఐవీరెడ్డి

ఆశా వర్కర్లకు తగిన వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆవులయ్య

గిద్దలూరు : పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం లభించడం లేదని, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న జీతాన్ని వారికి ఇవ్వాలని సిటూ నాయకుడు టి.ఆవులయ్య ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సిటూ కార్యాలయంలో ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆవులయ్య మాట్లాడుతూ కేరళలో రూ. 7,500, తెలంగాణలో రూ. 6000 వంతున వేతనాలు ఇస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా ఆ విధంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు షేక్ నూర్జహాన్, బి.రూతమ్మ మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబరు 5, 6, 7 తేదీల్లో జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మరియజ్యోతి, అంజలి, రమణమ్మ, మరియమ్మ తదితర ఆశవర్కర్ల నాయకురాళ్లు పాల్గొన్నారు.

కంభం అర్బన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి జాతీయ అవార్డు

కంభం: కంభం పంచాయతీ అర్బన్ కాలనీలోని అంగన్ వాడీ కేంద్రం 98కి స్వచ్ఛ పక్వాడా కింద జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు సీడీపీవో ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్ వాడీ కేంద్రం సేవలు లబ్ధిదారులకు అందించడం, దాతల సహకారాన్ని సమకూర్చడంతో కార్యకర్త బి. ఆదిలక్ష్మికి ఈ అవార్డు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు కార్యకర్త ఆదిలక్ష్మి ఢిల్లీ వెళ్లినట్లు చెప్పారు.

గర్భిణులకు రక్తదానం

గిద్దలూరు : లక్ష్మీబాయి అనే గర్భిణికి ట్రాక్టర్ డ్రైవర్ శ్రీను అనే దాత ద్వారా, వెంకటభవాని అనే గర్భిణికి పాలిటెక్నిక్ విద్యార్థి షేక్ అక్బర్‌అలీ అనే దాత ద్వారా మంగళవారం రక్తదానం చేయించి ఆదుకున్నట్లు యువాకేర్ సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ ఆరిఫ్‌వుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్తం అవసరమైన వారు, దాతలు 7386642536 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రుణ ఇంటర్వ్యూల్లో దరఖాస్తుదారుల అవస్థలు

కంభం : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వివిధ కార్పొరేషన్ రుణాలకు విడివిడిగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటే కంభం మండలంలో అన్ని కార్పొరేషన్ అభ్యర్థులకు ఒకేరోజు ఇంటర్వ్యూలు జరిపారు. మంగళవారం దరఖాస్తుదారులంతా ఒకేసారి రావడంతో నిలబడేందుకు కూడా చోటు లేక తీవ్ర అవస్థలు పడ్డారు. గత ఏడాది కూడా ఇలాగే అందరినీ ఒకేసారి రమ్మనడంతో తొక్కిసలాట జరిగింది.


బారులు తీరిన దరఖాస్తుదారులు

తాగునీటి సమస్యను తీర్చాలి

కంభం : తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతూ సీపీఐ నాయకులు ఎస్ఎండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో నెహ్రూనగర్ 3వ వీధికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం కందులాపురం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ వారానికి ఒకసారి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారని, అవి ఎటుకీ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కార్యదర్శి బ్రహ్మయ్య నక్కల గండి కాల్వ వద్ద వేసిన రెండుబోర్లు పూర్తిగా ఒట్టిపోయాయని, ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిచామన్నారు. కార్యక్రమంలో ఇమ్మానియేలు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు

యోగాతోనే ఆరోగ్యం

రాచర్ల : విద్యార్థి దశ నుంచే యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా శిక్షకుడు బీవీఎస్ నారాయణరెడ్డి అన్నారు. రాచర్లలోని స్పందన ఉన్నత పాఠశాలలో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే యోగాపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో స్పందన పాఠశాల డైరెక్టర్ పేర్ల పరమేశ్వర్ రెడ్డి, షేక్ ఖాశింవలి, శ్రీరంగం పాల్గొన్నారు.

యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

కొమరోలు : యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ పేర్కొన్నారు. జాతీయ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఈటీలు సుబ్రమణ్యం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు • గిద్దలూరు

కృష్ణ	- నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	- వివేకం
వెంకటేశ్వర	- అర్జున్ రెడ్డి
నటరాజ్	- జయ జానకి నాయక

సురక్షిత ప్రయాణమే ధ్యేయం

- గిద్దలూరు నుంచి ప్రధాన పట్టణాలకు అదనపు సర్వీసులు
- ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ మహేశ్వర్



మాట్లాడుతున్న ఈడీ మహేశ్వర్

గిద్దలూరు : ఉన్న వనరులతో ప్రయాణికులకు సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే ప్రధాన ధ్యేయమని నెల్లూరు జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.మహేశ్వర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, డిపోను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ప్రయాణికులను గౌరవించాలని, మర్యాదపూర్వకమైన పలుకరింపుతో వారిని ఆర్టీసీ ప్రయాణం వైపు రాబట్టుకోవాలని సూచించారు. ఆదాయం పెంపునకు ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి ముందుకు సాగాలన్నారు. అనంతరం జరిగిన విలేఖల సమావేశంలో మాట్లాడుతూ గిద్దలూరు నుంచి విజయవాడ, బెంగుళూరు పట్టణాలకు ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా అదనపు సర్వీసుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీశైలం, విశాఖపట్టణం, బళ్లారి పట్టణాలకు కొత్త సర్వీసులు, హైదరాబాద్, బెంగుళూరుకు ఏసీ బస్సుల ఏర్పాటు గురించి చాలా కాలంగా ప్రయాణికుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను విలేఖరులు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపితే మంజూరుకు పరిశీలిస్తానని ఈడీ స్థానిక డిపో మేనేజర్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు నుంచి జేపీచెరువు, ఆకవీడు, కంభం నుంచి అర్ధవీడు, పాపినేనిపల్లి రూట్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రద్దీతోపాటు టాప్ సర్వీసులు నడుస్తున్న వైనం గురించి, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాల గురించి ప్రస్తావించగా ఆయా రూట్లలో వెంటనే అదనపు సర్వీసులు నడపాలని డిపో మేనేజర్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు మీదుగా కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి విజయవాడకు రాత్రిపూట వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు హైవే రోడ్డును ఆనుకుని ఉన్న బస్టాండ్‌లోకి రాకుండా వెళతుండటంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, వారు రైళ్లను ఆశ్రయిస్తున్న విషయాన్ని వివరించగా బస్టాండ్ బయట ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి బస్సులు ఖచ్చితంగా లోపలికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మేనేజర్‌కు సూచించారు.

రైతు సంక్షేమమే ఏపీజీబీ లక్ష్యం : ఆర్డీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో కిశోర్

మార్కాపురం : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) రుణాలు అందిస్తుందని ఆర్డీవో పి.కిశోర్ పేర్కొన్నారు. స్థానిక షాదీఖానా ఆవరణలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు గృహ రుణ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ శివశంకర్ రెడ్డి అధ్యక్షత వహించగా ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ప్రైవేటు బ్యాంకులతో పోలిస్తే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ రైతులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో రైతులు ఎక్కువ శాతం వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి సహకరిస్తున్న బ్యాంకులను విస్మరించకుండా తిరిగి రుణాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆర్ఎం శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీజీబీ రీజనల్ పరిధిలో రూ. 23 వేల కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సులభ వాయిదాలు, సత్వర రుణ సదుపాయంతో తక్కువ వడ్డీకే గృహ, వ్యవసాయ రుణాలు అందిస్తుందన్నారు. వ్యవసాయదారులకు అర్థ సంవత్సరం, సంవత్సర వాయిదాల చెల్లింపు సౌకర్యంతో పాటు రూ. 7.50 లక్షల వరకు ఆదాయ నిరూపణ పత్రం లేకుండానే రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రుణాలు, 75 లక్షల వరకు గృహ నిర్మాణం, కొనుగోలుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ప్రధాన, జవహర్ నగర్ కాలనీ బ్రాంచ్ మేనేజర్లు మహేశ్వరరావు, కె.నాగలక్ష్మి కుమారి, రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో చికున్‌గున్యా పంజా

- పట్టించుకోని ఆరోగ్య శాఖ
- ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఉన్నతాధికారులు స్పందించాలని వినతి



రోగులను పరామర్శిస్తున్న వైద్యాధికారి రమణారెడ్డి

రాచర్ల : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తోంది. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించి విషజ్వరాలుగా ముదురుతున్నాయి. మండలంలోని ఆకవీడు పంచాయతీ కొత్తూరు గ్రామం ఎస్సీకాలనీలో విషజ్వరాలు పంజా విసిరాయి. ప్రతి ఇంటికి ముగ్గురు, నలుగురు జ్వరాలతో మంచాన పడ్డారు. సంవత్సరం వయసు గల పిల్లల నుంచి వృద్ధుల వరకు చికున్‌గున్యా రావడంతో చేతులు, కాళ్లు, మోకాళ్ల నొప్పులతో అల్లాడుతున్నారు. గత శుక్రవారం నుంచి మండలంలో వర్షాలు ప్రారంభం కాగా వెంటనే ఎస్సీకాలనీలో జ్వరాలు ప్రబలాయి. ఈ జ్వరాల నొప్పులకు తట్టుకోలేక కాలనీవాసులు 108 వాహనాలకు సమాచారం ఇవ్వగా ప్రాథమిక చికిత్స చేసి వెళ్లిపోయారు.

అధికారికంగా 12 మందికి ఎస్సీకాలనీలో చికున్‌గున్యా ఉన్నట్లు ఆకవీడు ప్రభుత్వ వైద్యాధికారి కె.రమణారెడ్డి గుర్తించినప్పటికీ అనధికారికంగా 50 మంది ఉన్నట్టు తెలుస్తోంది. గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో 600 రూపాయలకు ఆటోను బాడుగను మాట్లాడుకుని గిద్దలూరుకు వచ్చి, రూ. 3 వేల ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించుకున్నట్టు పెట్ల సాలమ్మ, పెట్ల కేశాలు వాపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అప్పుచేసి గిద్దలూరుకు వచ్చి అనేక మంది కార్పొరేట్ డాక్టర్లచేత వైద్యం పొందుతున్నారు. బాలింత బి.శేషమ్మ మాట్లాడుతూ తన సంవత్సరం పాపకు చికున్‌గున్యా వచ్చిందని, ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు ఆర్థిక స్తోమత లేదని వాపోయింది. ఆకవీడు ప్రభుత్వ వైద్యసిబ్బంది కేవలం ఉదయం వెళ్లి పరామర్శించి మందులు ఇస్తున్నారేతప్ప జ్వరం తగ్గడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగిన వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పురపాలక పాఠశాలకు పుట్టెడు కష్టాలు

- వర్షం వస్తే తరగతులకు ఇబ్బందులు
- గదులు లేవు, రాసేందుకు బోర్డులు ఉండవు
- ఇది.. సుందరయ్యకాలనీలోని స్కూల్ దుస్థితి



ఆరుబయట తరగతులు



పాఠాలు బోధించేందుకు ఉన్న బ్లాక్‌బోర్డు ఇదే



చెట్టుకింద పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

మార్కాపురం టౌన్ : విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఇంకా పలుచోట్ల పాఠశాలలు దయనీయ స్థితిలోనే కొనసాగుతున్నాయి. ఇందుకు ఉదహరణే పట్టణంలోని సుందరయ్యకాలనీలో పురపాలక ప్రాథమిక పాఠశాల. పుట్టెడు కష్టాల మధ్య ఇక్కడి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సమస్యలతోనే విధులను నిర్వర్తిస్తున్నారు.

అద్దె భవనంలో నడుపుతున్న ఈ పాఠశాలల్లో కనీసం తరగతులకు సరిపడా గదులు కూడా లేవు. ఒక గది, వరండాతో పాఠశాలను నిర్వహిస్తున్నారు. దాదాపు 90 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గది, వరండాలో విద్యార్థులు పట్టకపోవడంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు చెట్టుకింద పాఠాలు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు మాత్రం ఉన్న ఒక్క గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అయితే పిల్లలకు ఏదైనా అక్షరాలు రాసి చూపాలన్నా బయట గోడకు ఉన్న బ్లాక్‌బోర్డే గతి. దానిపైనే రాయాలి. విద్యాభ్యాసానికే వసతులు లేకపోతే ఇంక ఇతర వసతులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనమైనా కనీసం తరగతులకు సరిపడా గదులున్న భవనాన్ని తీసుకొని ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్నపాటి వర్షమొచ్చినా తరగతులు రద్దుచేసుకుని ఉన్న ఒక్క గదిలోనే పిల్లలందరినీ ఉంచి అవస్థలు పడాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అవసరమైన తరగతి గదులతో ఉన్న భవనంలో పాఠశాల ఏర్పాటు చేసి, వసతులు కల్పించాల్సిన అవసర ఎంతైనా ఉంది.

రేపు గిద్దరూరులో గ్రీవెన్స్

ఒంగోలు క్రైం : ప్రజల ముంగిటకు పోలీస్ అనే ప్రయత్నంలో భాగంగా గిద్దలూరులో గురువారం గీవన్స్‌సెల్ నిర్వహించనున్నట్టు ఎస్పీ సత్యఏసుబాబు తెలిపారు. గిద్దలూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని ఆ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. పశ్చిమప్రాంతంలో ఉన్న సర్కిల్ పరిధిలో దశలవారీగా గ్రీవెన్‌సెల్ ఏర్పాటు చేస్తామని, సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాశలతో వినతులిచ్చేందకు ఒంగోలు రాకుండా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇక్కట్లు

కంభం : పట్టణంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు గంటల తరబడి కోత విధిస్తుండటంతో విద్యుత్ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్న సమయంలో కనీసం 2 లేదా 3 గంటలు తీసేస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఎల్‌సీ పేరుతో కనీసం 2 గంటలకు పైగా సరఫరా నిలిపివేస్తున్నారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు, తిరిగి 6 నుంచి 8 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గు రయ్యారు.

'నవరత్నాల'తోనే ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జంకె

మార్కాపురం : వైసీపీ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతోనే ప్రజలు సంక్షేమంగా ఉంటారని ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొండేపల్లి రోడ్డులోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ సభ్యులతో నవరత్నాల సభ ఆయన ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకూ రూ. 50 వేలు, డ్వాక్రా మహిళలకు రూ. 15 వేల కోట్లతో ఆసరా, ప్రతి పేదవాడికి ఇళ్లు, ఆరోగ్య బీమా, మద్య నిషేధం తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ఈ ప్రాంత రైతుల్లో ఆనందాన్ని నింపుతామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వెన్నా హనుమారెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల వరకు కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో నిబద్ధతతో పని చేస్తూ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సమావేశాలకు జనాధరణ ఉందని, కింది స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో విజయం సాధించలేకపోతున్నామన్నారు. నంద్యాల ఎన్నికల్లో టీడీపీ విజయం ప్రలోభాలతోనే సాధ్యమైందన్నారు. అధికార పార్టీ నాయకులు ఓటర్లను భయ భ్రాంతులకు గురి చేసి సాధించిన ఫలితాలు విజయానికి నాంది కాదన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, వెంకటరెడ్డి, సాయి రా జేశ్వరరావు, రావి బాషాపతిరెడ్డి, పొదిలి, కొనకనమిట్ల, మార్కాపురం ఎంపీపీ రామ్ నారాయణరెడ్డి, మాలకొండయ్య, నరసింహులు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు నల్లబోతుల కొండయ్య, పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ నమోదు గడువు పొడిగింపు

ఒంగోలు విద్య: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలు 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డ్స్ నమోదు, నామినేషన్ గడువును సెప్టెంబర్ 15వరకు పొడిగించినట్లు డీఈవో విజయభాస్కర్ తెలిపారు. నామినేషన్ చేసేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్-డీఎస్‌టీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని డీఈవో ద్వారా ధ్రువీకరించుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలలయితే 5గురు విద్యార్థులు, 6,7 తరగతులున్న యూపీ స్కూళ్లయితే ఇద్దరు విద్యార్థులు, 6,7,8 తరగతులున్న యూపీ స్కూళ్ళ నుంచి ముగ్గురు విద్యార్థులను నామినేట్ చేయాలి. సంబంధిత ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని ఎంఎస్ వర్డు లేదా పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలని డీఈవో తెలిపారు.

బయోమెట్రిక్ పరికరాలకు కొత్త యాప్

ఒంగోలు విద్య: జిల్లాలోని ప్రభుత్వ రంగ పాఠశాలల్లో హాజరు కోసం సరఫరా చేసిన బయోమెట్రిక్ పరికరాలు, ట్యాబ్‌లకు కొత్త యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో ఒంగోలు విద్యా డివిజన్ పరిధిలో బయోమెట్రిక్ పరికరాలు సరఫరా చేయబడిన ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని డీఈవో బి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుతం పనిచేస్తున్న అన్ని బయోమెట్రిక్ పరికరాలు, ట్యాబ్‌లకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నన్స్ వారు రూపొందిన మంత్ర యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. పనిచేయని పరికరాలు, ట్యాబ్‌లను సెప్టెంబరు 4న తీసుకొస్తే వాటికి మరమ్మతులు నిర్వహిస్తామని బయోమెట్రిక్ పరికాలకు సంబంధించిన కార్వే జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్ తెలిపారు. రాజశేఖర్‌తోపాటు మరో ఐదుగురుతో కూడిన టీమ్ బయోమెట్రిక్ పరికాలు పనిచేయపోతే ఆయా పాఠశాలకు కొత్తపరికాలు, ట్యాబ్‌లు సరఫరా చేస్తారని డీఈవో కార్యాలయ ఏఎస్‌వో జె.కృష్ణకుమార్ తెలిపారు. బయోమెట్రిక్ హాజరు విషయంలో జిల్లా నోడల్ సభ్యులుగా ఈతముక్కల జడ్పీ హైస్కూలు పీఎస్ టీచర్ కె..రామును నియమించారు. పని సర్దుబాటులో ఆ పాఠశాలకు కొత్త పీఎస్ టీచర్‌ను నియమిస్తారు. బుధవారం పర్చూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో పర్చూరు డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమావేశం జరుగుతుందని డీఈవో విజయభాస్కర్ తెలిపారు.



డీఈవో పూల్ టీచర్లకు నేడు మోక్షం

ఒంగోలు విద్య: డీఈవో పూల్‌లో ఉన్న 35 మంది ఉపాధ్యాయులకు బుధవారం మోక్షం కలగనుంది. వీరు డీఈవో పూల్‌లో ఎందుకు ఉండవలసి వచ్చిందో వివరిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు డీఈవో విజయభాస్కర్ సమగ్ర నివేదిక సమర్పించారు. ఆ నివేదికను కమిషనర్ స్వయంగా పరిశీలించి వివాదంలేని స్థానాలను ఆయా ఉపాధ్యాయులకే కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఖాళీ పోస్టులు లేనిచోట ఉపాధ్యాయులు ఎవరైనా స్థానాలు కోరుకుని ఉంటే వారికి బదిలీల అనంతరం మిగిలిపోయిన ఖాళీలను కేటాయించాని కమిషనర్ సూచించారు. ఎన్‌సీసీ వివాదం ఉన్న పాఠశాలల్లో కూడా సమస్యను పరిష్కరించారు. మార్కాపురం మండలం రాయవరం స్థానం కోరుకున్న ఇంగ్లీషు ఉపాధ్యాయినికి ఆస్థానాన్ని కేటాయించాలన్నారు. మిగిలిపోయిన ఖాళీలన్నింటిని సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఖాళీలన్నింటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ డీఈవో కార్యాలయం పూర్తి చేసింది.

ఆర్‌జేడీ పరిశీలన

ఉపాధ్యాయుల బదిలీల్లో జిల్లా స్థాయిలో వచ్చిన వివాదాలను, అప్పీళ్ళను పరిష్కరించే బాధ్యత పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీపై ఉంది. దీంతో ఆర్‌జేడీ కేవీ.శ్రీనివాసులరెడ్డి మంగళవారం మధ్యాహ్నం డీఈవో కార్యాలయానికి చేరుకొని డీఈవో పూల్‌లో ఉన్న 35 మంది ఉపాధ్యాయుల వివరాలను పరిశీలించారు. వీరందరికి బుధవారం సాయంత్రానికి నియామకపు ఉత్తర్వులు సిద్ధం చేస్తామని ఆర్‌జేడీ తెలిపారు. గురువారం ఉదయానికి ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

గైర్హాజరైన వారికి సంజాయిషీ నోటీసులు

ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌కు గైర్హాజరైనవారికి సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. ఒకే పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు పూర్తయినవారు రేషనలైజేషన్‌లో తప్పనిసరిగా బదిలీ కావాలసినవారు కొందరు బదిలీ కోసం దరఖాస్తు చేసి కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. వీరందరికి కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన ఖాళీలను కేటాయించాలని కమిషనర్ స్పష్టం చేశారు. వీరందరికి నోటీసులు జారీచేసి సీసీఈ విధానం ప్రకారం చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.



118 మంది వీఆర్వోల సర్వీసు క్రమబద్ధీకరణ

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) సర్వీసును క్రమబద్ధీకరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్ళ నుంచి సర్వీసును క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ వీఆర్వోల సంఘం నాయకులు పలు పర్యాయాలు ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వినయ్‌చంద్ అందుకవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్వో డాక్టర్ ప్రభాకర్ రెడ్డిని అదేశించారు. దీంతో వీఆర్వోల సర్వీసు క్రమబద్ధీకరణకు సంబంధించిన ఫైల్‌ను కలెక్టర్‌కు పంపడంతో ఆమోద ముద్ర వేశారు. వివిధ స్థాయిల్లో పనిచేస్తూ 2008లో వీఆర్వోలుగా పదోన్నతి పొందిన 41 మంది సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. 2012, 2014 సంవత్సరాలలో డైరెక్టుగా వీఆర్వోలుగా ఎన్నికైన 77 మంది ఉద్యోగుల సర్వీసు రెగ్యులర్ కాక ఇబ్బందులు పడుతున్నారు.

ఈ నేపథ్యంలో 118 మంది వీఆర్వోల సర్వీసును క్రమబద్ధీకరణ చేస్తూ డీఆర్వో ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అదేశాలకనుగుణంగా ఈ క్రమబద్ధీకరణను పూర్తిచేసినట్లు డీఆర్వో తెలిపారు.

జిల్లాలో 10.3 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 10.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చీరాల మండలంలో 56.4 మి.మీ వర్షం కురవగా, అత్యల్పంగా కొరిశపాడు మండలంలో 1.2 మి.మీ. నమోదైంది. టంగుటూరులో 33.2, కొండపిలో 33.2, మద్దిపాడులో 33.0, కందుకూరులో 28.4, సింగరాయకొండలో 26.2, సంతనూతలపాడులో 24.4, ఒంగోలులో 22.4, జరుగుమల్లిలో 22.2, కొత్తపట్నంలో 21.6, పీసీపల్లిలో 20.6 మి.మీ. నమోదైంది. అలాగే, కొమరోలులో 19.8, లింగసముద్రంలో 19.2, చినగంజాంలో 19.0, పొన్నలూరులో 18.6, సీఎస్‌పురంలో 17.4, వలేటివారిపాలెంలో 16.2, గిద్దలూరులో 15.8, పామూరులో 14.8, చీమకుర్తిలో 14.4, ఉలవపాడులో 13.4 మి.మీ. నమోదైంది. మరో 17 మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

2న కంభంలో దివ్యాంగులకు పరికరాలు పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్: ఎంపీ ల్యాడ్స్, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఎఎల్‌ఐఎంసీవో సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న కంభం జూనియర్ కళాశాలలో దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. కంభంలో గత ఏడాది దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేసేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగా సెప్టెంబరు 2న కంభంలో జరిగే కార్యక్రమంలో దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ళు, మోటారైజ్‌డ్ సైకిళ్ళు, చెవిటి మిషన్లు, చేతికర్రలు పంపిణీ చేయనున్నట్టు వైవీ తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.





దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 3, 5




మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

జ్వరపీడీతులు అధైర్యపడొద్దు.. మెరుగైన వైద్యం అందేట్లు చూస్తా

● మంత్రి శిద్దా రాఘవరావు

ఈదర (ముండ్లమూరు): మండలంలోని ఈదర గ్రామస్తులు అధైర్యపడొద్దని, మెరుగైన వైద్యం అందేట్లు చర్యలు తీసుకుంటానని రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. మంగళవారం ఆయన గ్రామంలో జ్వరపీడితులను పరామర్శించారు. ముందుగా గ్రామంలోని ప్రతివీధిని పరిశీలించారు. వీధులన్ని అపరిశుభ్రంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు లేవని చెప్పడంతో వెంటనే డీపీఓ ప్రసాద్‌ను అడుగగా నిధులు ఉన్నాయి పారిశుధ్య పనులు చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడంతో మంత్రి మరలా పంచాయతీ కార్యదర్శిని కథలు చెప్పవద్దు మూడు రోజులు లోగా గ్రామంలో ఏ వీధిలో కూడా మురికి కనపడకూడదని ఆదేశించారు. వీధిలైట్లు కూడా ఏడాది కాలంగా వేయలేదని రాత్రులపూట అల్లాడిపోతున్నామనిగా గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అసలు పంచాయతీకి వస్తున్న నిధులు ఏమి చేస్తున్నట్లు అధికారులను ప్రశ్నించారు. వారి నుండి ఎలాంటి సమాధానం రాలేదు. వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డీపీఓ ఆదేశించారు. రేపటిలోగా 200 వీధిలైట్లు వేయడం జరుగుతుందని మంత్రికి తెలిపారు. తనకు ఈదరలో విషజ్వరాలతో ప్రజలు మంచాలు పట్టారన్న విషయం తెలిసిన వెంటనే గ్రామానికి వచ్చానని 20 రోజులుగా జ్వరాలు తో బాధపడుతుంటే డాక్టర్ వెంకట్రావు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నీ పద్ధతి బాగలేదు, నీ వల్లే ఇంతమంది రోగులు జ్వరాల బారిన పడ్డారని అన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం రోగులను పరామర్శించి అధైర్యపడవద్దు మెరుగైన వైద్యం అందించేందుకు ఇతర ప్రాంతాల నుండి వైద్యులను పిలిపించడం జరుగుతుందన్నారు. రోగులు సాధారణ స్థితికి వచ్చేంత వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగించి మంచిమందులు వాడాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుదల పడే వరకు గ్రామాన్ని సందర్శించాలని డీపీఓ ప్రసాద్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రవిని ఆదేశించారు.



మాట్లాడుతున్న మంత్రి శిద్దా రాఘవరావు

కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించిన మంత్రి శిద్దా

ఈదర గ్రామ జ్వరపీడీతులను పరామర్శించేందుకు వచ్చిన మంత్రి శిద్దా రాఘవరావు గ్రామాల్లో వీధులను పరిశీలించిన అనంతరం కలెక్టర్ వినయ్‌చంద్‌కు పరిస్థితిని ఫోన్‌లో వివరించారు. పారిశుధ్యం మెరుగుదలకు రూ.40లక్షలు మంజూరు చేయాలని సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి. రవి, ఎంపీపీ మందలపు వెంకట్రావు, మండల టీడీపీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం వెంకటరెడ్డి, డీఎల్‌పీఓ భాస్కరరెడ్డి, తహసీల్దార్ బి గంగాధరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్‌బాబు, పంచాయతీ రాజ్ ఏఈ ఎం వెంకటేశ్వర్లు, సర్పంచ్ గద్దల చిన సుబ్బయ్య, పశువైద్యాధికారి దేవారెడ్డినాయక్, ఎపీఎం జ్యోతిప్రసాద్‌బాబు, ఎపీఓ నాగేశ్వరరావు, ఈఓఆర్‌డీ బి. చూడామణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాను పూర్తి ఓడిఎఫ్‌గా ప్రకటించేందుకు కృషి చేయాలి

● డీఆర్డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.మురళి

ఒంగోలునగరం: వచ్చే ఏడాది నాటికి జిల్లాను పూర్తిస్థాయిలో ఓడిఎఫ్‌గా ప్రకటించేందుకు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఎస్ మురళి కోరారు. స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశం హాలులో మంగళవారం జరిగిన స్వచ్ఛ గ్రాహిల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది నాటికి జిల్లాను పూర్తి స్థాయిలో ఓడిఎఫ్‌గా ప్రకటించటంతో పాటు వచ్చే అక్టోబర్ 2వ తేదీన నాటికి జిల్లాలోని 600 గ్రామాలను ఓడిఎఫ్‌గా ప్రకటించాలన్నారు. ఇప్పటి వరకు నిర్మించుకున్న ప్రతి లబ్దిదారుల వివరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా నియమించి స్వచ్ఛ గ్రాహిలు గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న వారి ఇంటికి వెళ్లి జియోట్యాంగింగ్ చేయాలని ఆయన కోరారు. లబ్దిదారుని ఫోటోపాటు మరుగుదొడ్డి ఫోటోను తీసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా చేయాలని అన్నారు. జిల్లాపరిషత్ సీఈవో బి.వి.సాయికుమారి మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్మించుకోని వారిని గుర్తించి వారిని చైతన్యపరిచి వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ప్రాజెక్ట మేనేజర్ రంగారావు, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు తొమ్మిది డెంగ్యూ పాజిటివ్ కేసులు

ఒంగోలు నగరం: డెంగ్యూ జిల్లాలో తన ప్రతాపాన్ని చూపుతూనే ఉంది. ఒక్క మంగళవారం నాడే తొమ్మిది డెంగ్యూ పాజిటివ్ కేసులు జిల్లాలో నమోదు అయ్యాయి.జిల్లాలోని వివిధ పిహెచ్‌సిల పరిధిలో ఇవి నమోదు అయ్యాయి. రిమ్స్‌లోని పరీక్షా కేంద్రంలో పాజిటివ్ కేసులుగా వెల్లడి కావటంతో వైద్యఆరోగ్యశాఖకు తెలియజేశారు. జిల్లాలోని మాచవరం, చీరాల, ముటుకుల, బండ్లమూడి, తదితర పిహెచ్‌సిల పరిధిలోఈ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులతో కలుపుకుని ఈ ఏడాది డెంగ్యూ పాజిటివ్ కేసులు సంఖ్యల 171కి చేరింది.

కేంద్ర వైద్యశాఖ బృందం పరిశీలన

ఒంగోలు నగరం: జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాలో అమలు జరుగుతున్న పథకాలను మంగళవారం కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి వచ్చిన బృందం పరిశీలించింది. ఈ బృందం మరోరెండు రోజుల పాటు జిల్లాలో ఉండి పరిశీలన జరపనునంది. ఈ బృందంలో ఉన్న డాక్టర్ సూరిబాబు, డాక్టర్ శ్రీనివాస్ మంగళవారం తాళ్ళూరు, అద్దంకిపి హెచ్‌సిల పరిధిలో పర్యటించి ఆరోగ్య కార్యక్రమాల అమలునుపరిశీలించారు. ఎన్‌హెచ్‌ఎం కింద జిల్లా జరుగుతున్న జననీ సురక్ష యోజన,జననీ శిశు సురక్షయోజన, తల్లి బిడ్డా ఎక్స్‌ప్రెస్, ఎన్ టి ఆర్ బేబి కిట్‌ల పంపిణీ వంటి కార్యక్రమాలు ఏ విధంగా అమలు జరుగుతున్నాయో అనే వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ పథకాల అమలకు ఏటా కోట్లాది రూపాయలను విడుదల చేస్తుంది. బృందం వెంట జిల్లా డిఎన్‌ఓ సుబ్బలక్ష్మి తదితరులున్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

● డీసీవో కార్యాలయ అసిస్టెంట్ రిజస్ట్రార్ జి.రవిరాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌తో ఎలాంటి సంబంధం లేనితనపై బ్యాంకు ఛైర్మన్ ఈదర మోహన్‌బాబు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని డిసిఓ కార్యాలయ అసిస్టెంట్ రిజస్ట్రార్ జి.రవిరాజశేఖర్ పేర్కొన్నారు. బ్యాంకు ఛైర్మన్ తన పదవికి రాజినామా లేఖను మంత్రులకు పంపిస్తూ అందుకు కారణాలలో తాను, మార్కాపురం డిఎల్‌సిఓలు గుర్తు తెలియని వ్యక్తుల పేర్లతో ఫిర్యాదులు చేస్తే ఆర్‌సిఎస్ విచారణలు పేరుతో బ్యాంకును వేధిస్తున్నారని పేర్కొన్నారని దానిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఉద్యోగులపై తప్పుడు ప్రచారం మానుకోవాలని సహకార శాఖలో ఎస్సీ ఉద్యోగులైన మార్కాపురం కో ఆపరేటివ్ అధికారి పి. రాజశేఖర్, డిసిఓ ఆఫీసులోని ఎఆర్‌జి రవిరాజశేఖర్‌లపై పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఈదర మోహన్‌బాబు తప్పుడు ప్రచారం మానుకోవాలని నేషనల్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆ మేరకు మంగళవారం ఇక్కడ జరిగిన సమావేశంలో తీర్మానించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయశాఖలో ఇద్దరు ఏడీఏలకు పదోన్నతులు

ఒంగోలు వ్యవసాయం: వ్యవసాయశాఖలో సహాయ సంచాలకులుగా (ఏడిఏ) పనిచేస్తున్న ఇద్దరికి డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డి.డి.ఏ) లుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యవ సాయశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలోని ఏడిఏ (పిపి) జి.రత్నప్రసాద్, బయలాజికల్ కంట్రోల్ ల్యాబ్‌లో ఏడిఏగా పనిచేస్తున్న ఎం.సుబ్రమణ్యేశ్వరరావులు పదోన్నతులు తీసుకుంటున్నారు. అద్దంకి ఏడి ఏగా పనిచేస్తున్న ఇ.మాలకొండారెడ్డి పదోన్నతి వద్దని తీసుకోవడంలేదు. వీరికి ఇంకా పోస్టింగ్ ఆర్డర్ రాలేదు. ఏడిఏ పిపి రత్నప్రసాద్‌ను విజయనగరం ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ ప్రాజెక్టు డైరక్టర్‌గా, సుబ్రమణేశ్వర రావును చిత్తూరు జిల్లా ఐఫ్యాడ్ డిడిఏగా పోస్టింగ్‌లు రానున్నట్లు తెలిసింది.

పట్టాలెక్కిన కందుకూరు మునిసిపాలిటీ అభివృద్ధి పనులు

- ఎట్టకేలకు టెండర్ల ప్రక్రియ కొలిక్కి..
- పోటాపోటీగా భారీగా లెస్‌లు
- సరాసరిన 20 శాతం ప్రజాధనం ఆదా
- మున్సిపాలిటీకి సమకూరనున్న రూ.10 కోట్లు
- ఇక పనుల నాణ్యతపైన సందేహాలు

(కందుకూరు)

కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి బండి పట్టాలెక్కింది. గత ఎనిమిది నెలలుగా నెలకొన్న ప్రతిష్టంభన ఎట్టకేలకు తొలగిపోవటంతో టెండర్లు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. కందుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, 14వ ఆర్థిక సంఘం, ఎస్‌డీఎఫ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులు, మున్సిపాలిటీ సాధారణ నిధుల కింద రమారమి రూ.45 కోట్లు అభివృద్ధి పనుల కోసం సిద్ధంగా ఉన్నప్పటికీ ఎనిమిది నెలలుగా టెండర్లు నిర్వహించటంలో అడ్డంకులు నెలకొన్న విషయం తెలిసిందే. మూడు దఫాలు అధికారులు టెండర్లు పిలిచినప్పటికీ ప్రతిసారి కాంట్రాక్టర్లు కూటమి కట్టడం బహిరంగంగా వేలంపాటలు పాడుకుని పనులు దక్కించుకోవటం, పత్రికలలో కథనాలు రావటంతో రద్దు చేయటం తెలిసిందే. దీంతో అభివృద్ధి పనుల్లో ఒక్క అడుగూ ముందుకు పడకుండా వచ్చింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ల రింగ్‌లు, కూటములకు అవకాశం లేకుండా పూర్తిస్థాయి పోటీ వాతావరణంలో ఇటీవల జరిగిన టెండర్లు కొలిక్కి రావటంతో అభివృద్ధి పనులు ప్రారంభానికి మార్గం సుగమమైంది. గత 15 రోజుల్లో రమారమి రూ.23 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తికాగా మరో 20 కోట్ల పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కాంట్రాక్టర్ల రింగులు, కూటమి కట్టడాలు లేకుండా పూర్తిస్థాయి పోటీ వాతావరణంలో టెండర్లు ప్రక్రియకు





రోడ్డు నిర్మించి కూడా మార్జిన్ వేయని దృశ్యం, కందుకూరు మున్సిపల్ కార్యాలయం

'గ్రీన్' సిగ్నల్స్ రావటంతో కాంట్రాక్టర్లు పోటీలు పడి టెండర్లు వేయటంతో కొన్ని పనులకు 30 శాతంకు పైగా లెస్‌లకు కూడా టెండర్లు కోట్ అయ్యాయి. అత్యల్పంగా 10 శాతం లెస్‌కు తగ్గకుండా టెండర్లు దాఖలు కావటంతో సరాసరిన మున్సిపాలిటీకి పనుల అంచనా మొత్తంలో 20 నుంచి 22 శాతం సొమ్ము ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు. టెండ 'రింగ్' జరిగితే ఎలాగూ 5 నుంచి 10 శాతం అధిక మొత్తాలకు, హీనపక్షం లో అంచనా రేట్లకు టెండర్లు వేసుకుంటారని ప్రస్తుతం 20 శాతం లెస్‌కి టెండర్లు ఇప్పటి వరకు జరిగిన టెండర్ల ద్వారా ఆరు కోట్లకు పైగా మిగులుతుందని, మిగిలిన 20 కోట్ల నిధులకు కూడా టెండర్లు పూర్తయితే మరో ఐదారు కోటు మిగులుతాయని అంచనా వేస్తున్నారు. మిగులు నిధులతో కనీసం 10 కోట్లకు మరలా అభివృద్ధి పనులు చేసుకునే సౌలభ్యం లభిస్తున్నందున నిధుల వినియోగంలో జాప్యం జరిగినా మేలే జరుగుతోందని భావిస్తున్నారు.

మూడు విడతల్లో 73 పనులకు పూర్తయిన టెండర్లు

మున్సిపాలిటీలో ఈనెల 16 నుంచి ఇప్పటివరకు మూడు విడతల్లో రమారమి 23 కోట్ల అంచనా విలువతో రూపొందించిన 73 పనులకు టెండర్లు పూర్తయ్యాయి. తొలి విడతలో 35 పనులకు రూ.8.6 కోట్లు, రెండో విడత 31 పనులకు రూ.9.4 కోట్లతో, మూడో విడత 7 పనులకు రూ.5.5 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు పోటీలు పడి భారీగా లెస్‌లకు టెండర్లు దాఖలు చేశారు. మూడు విడతల టెండర్లను ఓపెన్ చేసిన అధికారులు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లచే అగ్రిమెంట్లు చేయించి తక్షణం ప్రారంభింపజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు మిగిలి ఉన్న రమారమి 20 కోట్ల నిధులకు కూడా అంచనాలు పూర్తి చేసి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు.

నాణ్యతపై సర్వత్రా సందేహాలు

కందుకూరు మున్సిపాలిటీలో రమారమి ఏడాది తర్వాత అభివృద్ధి పనులకి అవకాశం రావటంతో కాంట్రాక్టర్లు పోటీలు పడి పనులు దక్కించుకోవటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ పనులు నాణ్యతపై సందేహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధిక మొత్తాలకు, అంచనా రేట్లకు పనులు దక్కించుకున్న సందర్భాలలో కూడా అత్యంత నాసిరకంగా పనులు పూర్తిచేసి బిల్లులు పొందారు. అదే ఊహతో ఇంత భారీ లెస్‌లకు టెండర్లు వేశారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ అంచనాల ప్రకారం చూస్తే 20 శాతం వరకు లెస్ వేసి అత్యంత నాణ్యతగా పనిచేసినా కాంట్రాక్టరుకు లాభం ఉంటుందని, అయితే 30 శాతం వరకు కూడా లెస్‌లు వేయటం దానికి తోడు నాణ్యతగా చేయాల్సిన అవసరం లేదన్న భావన కాంట్రాక్టర్లలో వేళ్లూనుకుని ఉండటం పనుల నాణ్యతను దెబ్బతీస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎంతో కాలంగా అభివృద్ధి ఒక్క అడుగు జరగకపోగా ప్రస్తుతం ఒకేసారి రమారమి 50 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభం కానుండటం, ఆ పనులు పర్యవేక్షించేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అనుభవం ఉన్న సిబ్బంది అందుబాటులో లేకపోవటం కాంట్రాక్టర్లకు కలిసొచ్చే అంశమని అంటున్నారు. సిబ్బంది కొరతను సాకుగా చూపి అధికారులు కూడా వారికి సహకరిస్తారని దాంతో పనులు నాణ్యత లేకుండా జరుగుతాయన్న సందేహాన్ని పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పోటీలో లెస్‌లకు పనులు చేయటానికి రెండొంతులు కాంట్రాక్టర్లు వెనక్కి తగ్గటంతో కొద్దిశాతం మంది చేతుల్లోకే పనులు వెళ్లాయని ఈ పరిస్థితుల్లో నాణ్యతపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. మున్సిపాలిటీకి ప్రస్తుతం ఒక్క డీఈ, ఒక్క ఏఈ మాత్రమే ఉన్నందున ఈ పనులు పూర్తయ్యే వరకైనా తాత్కాలిక పద్ధతిపైన అయినా మరో డీఈ, ఇద్దరు జేఈలు, సాంకేతిక పరిజ్ఞానం తెలిసిన వర్క్ ఇన్‌స్పెక్టర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. కాంట్రాక్టర్లు అగ్రిమెంటు చేసుకుని పనులు ప్రారంభించేలోగా అదనపు అధికారులు, సిబ్బంది వచ్చేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంక్షేమ పథకాలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కనిగిరి నియోజకవర్గ సమీక్షలో కలెక్టర్ వినయ్‌చంద్

కనిగిరి : అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓడరేవు వినయ్‌చంద్ హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రతి సోమవారం ప్రతి జిల్లాకు అభివృద్ధి సంక్షేమాల్లో ర్యాంకింగ్ కేటాయిస్తున్నారని అన్నింటా జిల్లా ముందజలో ఉండేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. లక్ష్యాలను పూర్తిచేయని అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. కనిగిరి నియోజకవర్గ మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశం సీఎస్ పురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. వివిధ శాఖల పనుల పురోగతిపై సమీక్షించారు. నీరు - ప్రగతి పనులకు సంబంధించి నియోజకవర్గంలో 438 పనులు మంజూరు కాగా 148 పనులు మాత్రమే పూర్తిచేశారని, 290 పనులు ఎందుకు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌చంద్

పూర్తిచేయలేదని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. 120 చెడ్‌డ్యామ్‌ల పనులకు ఒక్క నిర్మాణం కూడా పూర్తికాలేదన్నారు. ఇందుకు సంబంధించి ఆరుగురు మండల ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతివారం అధికారులు శాఖలకు సంబంధించిన పనులపై సమీక్షా చేసుకోవాలన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం అమలులో తక్కువ లక్ష్యాలు సాధించిన హనుమంతునిపాడు ఎంపీడీవో, మండల ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. హౌసింగ్ ఏఈలు వారానికి 100 గృహాల వంతున పూర్తి చేయాలన్నారు. 2014కు ముందు మంజూరైన గృహాలను సెప్టెంబర్ 31లోగా పూర్తిచేయాలని, ఇందుకు అదనంగా రూ.25 వేలు అందజేస్తామన్నారు. అంగన్‌వాడీల్లో బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ప్రత్యేకంగా పోషక ఆహారాన్ని అందించాలన్నారు. సూపర్‌వైజర్లు ప్రతిరోజు ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయాలని ఎంపీడీవోలు 10 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, శ్మశానాలకు ప్రహరీ గోడల పనులు పురోగతిలేకపోవటంపై హనుమంతునిపాడు మినహా మిగిలిన ఐదు మండలాల ఏఈలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పీఆర్ ఎస్ఈని ఆదేశించారు. పీఆర్ పనితీరు అధ్వాన్నంగా ఉన్నదని గ్రామస్థాయిలో పనుల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. జిల్లాలో 120 గ్రామపంచాయతీల్లో వ్యర్థ పదార్థాలను తరలించేందుకు మూడు చక్రాల బండ్లను కేటాయిస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తను వేరే చేసేందుకు 33 యూనిట్లకు 4 యూనిట్లు పనిచేస్తున్నాయన్నారు. ఏప్రిల్ లోపు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని అన్నింటిని ఓడీఎఫ్ గ్రామాలుగా గుర్తించాలన్నారు. పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోల పని సూచికలకు సంబంధించి సెప్టెంబర్ 15న పంచాయతీరాజ్ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవిష్కరిస్తారన్నారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఈకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని చంద్రశేఖరయ్యను ఆదేశించారు. ఈ సమీక్షలో కందుకూరు ఆర్డీవో మల్లికార్జున, ఏపీఎంఐపీ పీడీ రవీంద్ర, జేడీఏ మురళీకృష్ణ, పీఆర్ ఈఈ త్రిమూర్తి నాయుడు, ఇరిగేషన్ ఈఈ రాజన్న నాయుడు, ఉద్యానవన శాఖ ఏడీ జన్నమ్మ, డ్వామా అదనపు పీడీలు రమేష్‌బాబు, భవానీ, ఆరు మండలాల తహసీల్దార్లు కిశోర్‌కుమార్, చంద్రావతి, షేక్ మౌలాసాహెబ్, మెర్సీ కుమారి, ఎంపీడీవోలు పి.కోదండరామయ్య, నాగభూషణరావు, రామ్మోహన్‌రెడ్డి, మల్లికార్జున, వ్యవసాయశాఖ ఏడీఏ చల్లా సుబ్బరాయుడు, పీఆర్, ఇరిగేషన్ డీఈలు చెంచురామయ్య, వేణుగోపాలు, ఏఈలు, సీడీపీవోలు, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వానరానికి కర్మకాండలు నిర్వహిస్తున్న పూజారులు

వానరానికి దశదిన కర్మ

- ఊరువాడా ఏకమైన వైనం
- స్మృతి వనం ఏర్పాటు
- 2,500 మందికి అన్నదానం

పెద ఉల్లగల్లు (ముండ్లమూరు) : చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు ఒక వానరం మృత్యువాత పడింది. పదిరోజుల క్రితం సంఘటన మండలంలోని పెద ఉల్లగల్లులో చోటుచేసుకుంది. అయితే గ్రామం మొత్తం పార్టీలకు అతీతంగా చనిపోయిన వానరానికి పెద్దఎత్తున అంత్యక్రియలు నిర్వహించారు. ఊరేగింపుగా వానర మృత కళేబరాన్ని శాస్త్రోక్తంగా ఖననం చేశారు. అం తటితో ఆగకుండా వానరాన్ని ఆంజనేయస్వామి ప్రతిరూపంగా భావించి గ్రామంలోని యువకులు ముందుకు వచ్చి వానరానికి దశదిన కర్మ చేయాలని నిర్ణయించారు. ఒక అప్తుడిని కోల్పోతే ఏ విధంగా స్పందిస్తారో అదే విధంగా గ్రామం మొత్తం స్పందించింది. కళేబరాన్ని ఖననం చేసిన చోటే వేలాది రూపాయలు వెచ్చించి స్మృతి చిహ్నాన్ని నిర్మించారు. 11వ రోజు శాస్త్రోక్తంగా కర్మకాండలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసం ఉండి గ్రామాల్లో వానరం(కోతి) చిత్రపటంతో రామాలయం దగ్గర నుంచి ఊరేగింపు నిర్వహించుకుంటూ బాణసంచా కాల్చుకుంటూ స్మృతి చిహ్నం వరకు పెద్దఎత్తున ఊరేగింపు జరిపారు. పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2,500 మందికి పైగా గ్రామాల్లో కులమతాలకు అతీతంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఒక పండుగ వాతావరణంలా వానరానికి దశదిన కర్మ నిర్వహించడం విశేషం. వానరానికి గ్రామానికి చెందిన వేదపండితులు నరసింహమూర్తి, రాధాకృష్ణ కర్మకాండలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సర్పంచ్ జిల్లెళ్ళమూడి పార్వతీ చౌదరి, కర్నాటి సాయికుమార్ రెడ్డి, అన్నపురెడ్డి భిక్షాలరెడ్డి, వాతల వెంకటసుబ్బారెడ్డి, లాం తెల్లయ్య, డి.ఖాశీం, వాతల శేషిరెడ్డి, ఇందూరి వెంకటేశ్వర్లు తదితరులు వానరం దశదిన కర్మకు ముందు ఉండి ఏర్పాటు చేసి కార్యక్రమం నిర్వహించారు.



ఏర్పాటు చేసిన స్మృతి వనం

దొడ్డి దారిన గ్రానైట్ రవాణా

- పట్టించుకోని అధికారులు
- సుంకం ఎగ్గొట్టేందుకే దొంగదారులు

కనిగిరి : ప్రభుత్వానికి సుంకం ఎగ్గొట్టేందుకు అధికారుల కళ్లుగప్పి గ్రానైట్ లారీలు దొంగచాటుగా తరలిస్తున్నారు. ఇందుకు కనిగిరి నుంచి హనుమంతునిపాడు మీదుగా కంభం రోడ్డు వారికి అనువుగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం గ్రానైట్ రాళ్లలో కూడిన వాహనాలు తరలిపోతున్నాయి. కనిగిరి నుంచి తాడిపత్రికి తరలిస్తున్న గ్రానైట్ లారీలకు ఈ రహదారిలో అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వానికి సుంకం ఎగోట్టేందుకు దొంగదారులు వెతుక్కుంటున్నారు. కనిగిరి పట్టణానికి సమీపంలోని శంఖవరం, చింతలపాలెం, పామూరు మండలం అయ్యవారిపల్లి ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల నుంచి ప్రతి రోజు అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రాంతానికి గ్రానైట్ రాళ్లను లారీల ద్వారా తరలిస్తుంటారు. ఈ రాళ్లను నిబంధనల ప్రకారం కనిగిరి నుంచి చినారికట్ల మీదుగా తరలించాల్సి ఉంది. అయితే ఆ రోడ్డు మార్గం లో మైనింగ్ అధికారుల తాకిడి ఎక్కువగా ఉండటంతో గ్రానైట్ వ్యాపారు లు దొంగదారులను వెతుకుతున్నారు. స్థానికంగా పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఉన్నా గ్రానైట్ వ్యాపారులు ఇస్తుండటంతో వారు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో వ్యాపారులు తమకు ఇబ్బంది లేని దారులను ఎంచుకుని తరలిస్తున్నారు. ప్రతిరోజు ఐదు లారీలతో గ్రానైట్ రాళ్లు తరలిపోతున్నాయి. ఇటీవల శంఖవరం గ్రానైట్ క్వారీలను విజిలెన్సు అధికారులు తనిఖీలు చేశారు.





వెంగపల్లి వద్ద బోల్తాపడిన గ్రానైట్ లారీ, గ్రానైట్ క్వారీని తనిఖీ చేస్తున్న అధికారులు

దొంగదారుల్లో గ్రానైట్ లారీలు

కనిగిరి నుంచి హనుమంతునిపాడు, వేములపాడు మీదుగా బేస్తవారిపేట జంక్షన్‌కు చేరుకుంటే మైనింగ్ అధికారుల నుంచి చాలా వరకు తనిఖీల నుంచి తప్పించుకోవచ్చు. దీనినే మైనింగ్ వ్యాపారులు దొంగదారిగా ఎంచుకున్నారు. రెండురోజుల క్రితం కనిగిరి - కంభం రోడ్డులోని వెంగపల్లి వద్ద కనిగిరి నుంచి తాడిపత్రికి తరలిస్తున్న గ్రానైట్ లారీ బోల్తాపడింది. భారీ గ్రానైట్ బండ అకస్మాత్తుగా దొర్లటంతో ఆ సమయంలో అటు ఎదురెదురుగా వాహనాలు రాకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. సింగిల్‌రోడ్డు మార్జిన్‌లో రిలయన్స్ కంపెనీ వారు కేబుల్స్‌ను ఏర్పాటు చేసేందుకు పొక్లెయినర్లతో గుంతలు తీయటంతో గ్రానైట్ లారీ పక్కకు వెళ్లి పడిపోయింది. అదేవిధంగా ఇటీవల మైనింగ్ దాడులు జరుగుతున్నాయని తెలిసి గ్రానైట్ లారీని మండల పరిషత్ కార్యాలయం వెనుకవైపున ఉంచేందుకు లారీ డ్రైవర్ హడాహుడిగా నడిపే ప్రయత్నంలో ఇసుకలో కూరుకుపోయింది.

ఆ లారీలో ఉన్న గ్రానైట్‌ను పక్కకు తరలించి మరలా తీసుకువెళ్లేందుకు నాలుగురోజుల సమయం పట్టింది. గ్రానైట్ లారీలు చినారికట్ల మీదుగా వెళ్తే 30 కి.మీ దూరం పెరుగుతుందని ఆ రహదారిలో గనుల శాఖ అధికారుల తనిఖీలు ఉంటాయన్న భయంతో గ్రానైట్ రవాణా దారులు దొంగదారులు వెతుక్కుని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు, మైనింగ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఇందుకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ ఎగ్గొట్టడంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుంది. అంతేకాకుండా కనిగిరి - కంభం రోడ్డు సింగిల్ రోడ్డు కావటంతో గ్రానైట్ లారీలు తిరుగుతుండటంతో రోడ్లు బద్దలవుతున్నాయి. చిన్నచిన్న చప్టాలు దెబ్బతింటున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. పట్టణంలోని కంభం బస్టాండు వద్ద చెక్‌పోస్టు ఉన్నా అక్రమ రవాణా ఏ మాత్రం ఆగడం లేదు.

పునరావాస కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి: జేసీ

అద్దంకి టౌన్ : గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామం ధేనువు కొండ పునరావాస కాలనీలో అభివృద్ధి పనులను పూర్తిచేయాలని జేసీ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో కమ్మ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులతో పునరావాస కాలనీలను పరిశీలించారు. ముందుగా వేలమూరిపాడు వద్ద పునరావాస కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు సమస్యలను తెలిపారు. ఎవరైనా చనిపోతే వేలమూరిపాడు ఎస్సీ కాలనీ మీదగా శ్మశానానికి వెళ్ళనివ్వడం లేదని ఇది మరింత సమస్యగా ఉందని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే శ్మశాన సమస్యను పరిష్కారించాలని తహసీల్దారును జేసీ



ధేనువుకొండ పునరావాస కాలనినీ పరిశీలిస్తున్న జేసీ నాగలక్ష్మి



జేసీకి సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

ఆదేశించారు. అనంతరం పునరావాస కాలనీ అయిన బలరామకృష్టాపురం కాలనీని పరిశీలించారు. కాలనీలో జరగాల్సిన పనులతో పాటు, మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను గురించి ఉప సర్పంచ్ నాగినేని రామకృష్ణ జేసీ దృష్టికి తీసుకు వచ్చారు. పెండింగ్‌లో ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను జేసీ ఆదేశించారు. తాగునీటి సమస్యలను వారం రోజులలో పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పాత గ్రామంలో సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉదయభాస్కర్‌ను ఆదేశించా రు. కాలనీలో మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇరిగేషన్ డీఈ సంగీతను, ఏఈలను ఆదేశించారు. అర్హులకు ఇళ్ల స్థలాలు, ప్యాకేజి ఇవ్వడం జరుగుతుందని, ముందుగా స్థలాలు ఇచ్చిన వారు ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కోటేశ్వరరావు, రాజేష్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, అన్నాబత్తిన సురేష్‌బాబు, శ్రీనివాసరావు, అజయ్‌బాబు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నిర్వాసితుల సమస్యలకు

పురోగతి చూపకంటే ఉపేక్షించేది లేదు

జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి

మద్దిపాడు: గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్వాసితులు సమస్యలకు పురోగతి చూపకుంటే అధికారులను ఉపేక్షించేదిలేదని నిర్వాసితులకు అండగా ఉండి సమస్యలు లేకుండా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని జాయింట్ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం గార్లపాడు ఆర్‌అండ్‌బీ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సమస్యలను ఏకరువు పెట్టారు. కాలనీలో సిమెంటు రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ కింద భూములు, ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులు పెండింగ్ సమస్యలు త్వరితగతిన పూర్తి చేయా లని ఎస్‌డీసీ ఉదయ్ భాస్కర్‌ను ఆదేశించారు. పెండింగ్ రోడ్లకు ఎస్టిమేషన్‌లు వేయాలన్నారు. అప్రోచ్ రోడ్డుకు భూమి కావాల్సి వస్తుందని రైతులను ఒప్పంచి కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఎస్‌డీసీ ఉదయ్‌భాస్కర్, ఇరిగేషన్ డీఈ రమణారెడ్డి, తహసీల్దార్ కె.ఎల్‌నరసింహారావు, ఎంపీడీవో కృష్ణ, టీడీపీ మండల ఆధ్యక్షుడు మండవ జయంత్ బాబు, జడ్‌పిటిసి మొనపాటి చిన్నవీరాంజమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ ముత్తనపల్లి రామలింగయ్య, గార్లపాడు మాజీ సర్పంచ్ రామకృష్ణ, కాలేషా, దాసరి శ్రీను, ఇరిగేషన్ జె.ఇ. జీవన్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ఢాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
వివరణ: ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: **ఎ**
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: **డి**
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: **బి**
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: **ఎ**
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: **సి**
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: **డి**
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నిషియం డి) సోడియం
సమాధానం: **ఎ**
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: **ఎ**
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: **సి**
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: **డి**
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: **సి**
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: **డి**
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: **సి**
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: **డి**
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: **బి**
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: **డి**
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: **సి**
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: **బి**
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: **బి**
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సొప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: **ఎ**
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు**: 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ ఖాళీలు: 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్
2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన నాయ్యమూర్తి
3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి
5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ
6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ
7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ
8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ
9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా
10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ
11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్
12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు
14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి
15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి
17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు
18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు
19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్



కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ
21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనపుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు
22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ
23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ
25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత
26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం
28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా
29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ
30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్ 5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4
31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ
32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ఠ సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది
33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు
34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ
35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్
36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ
37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్
38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ
39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి
40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్
41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి
42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్
43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్
44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17
45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్
46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా
47. జాకీర్ హుస్సేన్ మరణాంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా
48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు
49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

సమాధానాలు

		15) ఎ	24) ఎ	33) సి	42) బి
		16) బి	25) సి	34) ఎ	43) సి
1) సి	8) బి	17) సి	26) బి	35) డి	44) బి
2) ఎ	9) సి	18) బి	27) ఎ	36) సి	45) డి
3) ఎ	10) బి	19) సి	28) డి	37) బి	46) ఎ
4) డి	11) ఎ	20) డి	29) డి	38) ఎ	47) బి
5) ఎ	12) సి	21) ఎ	30) ఎ	39) సి	48) సి
6) సి	13) సి	22) సి	31) సి	40) డి	49) ఎ
7) బి	14) డి	23) ఎ	32) బి	41) సి	50) సి

అడ్మిషన్స్

జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.
పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పిహెచ్‌డి/ ఎమ్మెస్సీ - పిహెచ్‌డి డ్యూయెల్ డిగ్రీ
టెస్ట్ పేపర్స్ - కోడ్స్: బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)
అర్హత: గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
జామ్ 2018 జరిగే తేదీ: 2018 ఫిబ్రవరి 11
ఫలితాల విడుదల: 2018 మార్చి 20
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10
వెబ్‌సైట్: www.jam.iitb.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: 50 శాతం మార్కులతో బిఎస్సీ/ బిఫార్మసీ/ బిఎస్సీ - అగ్రి/ ఎంబిబిఎస్/ బివిఎస్సీ/బిడిఎస్/ బిహెచ్‌ఎంఎస్/ బిఎఎంఎస్/ బియుఎంఎస్/ బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసిఏ/ పిహెచ్‌డి పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16
వెబ్‌సైట్: www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం


నిమజ్జనానికి ఊరేగింపుగా తరలుతున్న గణపతి

ఎర్రగొండపాలెం : వేగినాటి కోటయ్య విధిలో ఏర్పాటు చేసిన గణపతిని మంగళవారం ఉత్సవ ఉత్సవ కమిటీద సభ్యులు భారీ ఎత్తున నిమజ్జనానికి తరలించారు. ఐదోరోజు మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదరన, ఆట, పాటతో మహా గణపతిని నిమజ్జనానికి తరలించారు. దారి పొడవునా ప్రసాదాల ను పంచిపెట్టారు.

పెద్ద దోర్నాల: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఐనముక్కల గ్రామం గణపతి దేవాలయం వద్ద మంగళవారం నిమజ్జన వేడుకలను అత్యంత భక్తితో జరుపుకున్నారు. రథంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి జై గణేష జైజై గణేష అంటూ యువకులు నృత్యాలు చేశారు. భక్తి శ్రద్ధలతో శ్రీశైలంలో కృష్ణా నదిలో నిమజ్జనం గావించేందుకు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.


త్రిపురాంతకంలో గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం రాజశేఖరరెడ్డి

గిడుగుకు ఘనంగా నివాళి

ఎర్రగొండపాలెం : తెలుగు భాషలో విద్యను అభ్యసించినవారు నేడు ఉన్నత స్థితిలో ఉన్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు పంతులుకు నివాళలర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసాచార్యులు, రంజిత్‌కుమార్, డి.నారాయణరెడ్డి, డాక్టరు దినకరన్, దాసరి మోషే, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జడ్పీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం రాజశేఖరరెడ్డి గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, సామేల్ జాన్, ప్రసాదు, సులోచన పాల్గొన్నారు.

పుల్లలచెరువు : మాతృభాషను మరిచిపోవద్దని ఎంఈవో జె.రాంసింగ్‌నాయక్ అన్నారు. పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పాముల కాలనీకి నీళ్లివ్వండి

పెద్ద దోర్నాల: గత మూడు రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని తమకు నీళ్ళు ఇవ్వాలని ఐనముక్కల పాముల కాలనీ వాసులు మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద కాలనీ వాసులు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కాలనీకి చెందిన శ్రీను, వెంకటప్ప, సుబ్బయ్య, రమణ, పద్మ, మహాలక్ష్మి తదితరులు ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవిని వివరణ కోరగా నీటిని సరఫరా చేసే ట్రాక్టర్ మరమ్మతులకు గురి కావడంతో నీటి సరఫరా జరగలేదని తక్షణమే ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

పెద్దారవీడు: తంగిరాలపల్లి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు అచ్యుత సుబ్బారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం అందజే సిన క్రీడా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ మౌలాలి, బాలాజీకుమార్, అజయ్ బాబు, నరసింహరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న టీచర్లు

త్రిపురాంతకం నుంచి ప్రారంభమైన దివ్యదర్శనం

త్రిపురాంతకం: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ, హిందు ధర్మ పరిరక్షణ ట్రస్ట్ నేతృత్వంలో సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్య దర్శన యాత్ర మంగళవారం బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయం నుంచి ప్రారంభించారు. మండలంలోని 200 మంది భక్తులు 4 బస్సులలో బయలుదేరి వెళ్లారు. యాత్రకు ముందు పట్టణంలో గోవింద నామాలతో నగర సంకీర్తన ర్యాలీ నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి రమేష్, సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరెడ్డి భక్తులకు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందు ధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా సభ్యులు ధనుంజయరావు, మండల ధర్మ ప్రచారక్ రమణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


దివ్యదర్శనం బస్సు యాత్రను ప్రారంభిస్తున్న అధికారులు

రేపు 'నవ్యాంధ్రకు నవరత్నాలు' సభ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేష్

ఎర్రగొండపాలెం : నవరత్నాలు పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎర్రగొండ పాలెంలో ఈనెల 31వ తేది సాయంత్రం 5గంటలకు నిర్వహించే నవ్యాంధ్రకు నవరత్నాలు సభను జయప్రదం చేయాలని కోరారు.

ఈ సభకు ఐదు మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, గ్రామ కమిటీ కన్వీనర్లు, బూత్ కమిటీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సమావేశంలో ఎంపీపీ చేదూరి విజయభాష్కర్, మండలపార్టీ కన్వీనర్లు డి.కిరణ్ గౌడ్, ఉడుముల శ్రీనివాసరెడ్డి, పి.చంద్రమౌళిరెడ్డి, పట్టణ నాయకులు జబిబుల్లా, చేదూరి ప్రసాదు, జవహార్ నవోదయ అడ్వయిజరీ కమిటీ డైరెక్టర్ కందూరి గురుప్రసాద్ పాల్గొన్నారు.

వేరు తెగులు పట్ల అప్రమత్తం

పుల్లలచెరువు : ప్రస్తుతం బోరు కింద సాగు చేసిన మిరప పంటలో వేరు కుళ్లు తెగులు ఎక్కువగా కనిపిస్తుందని దాని నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి జవహార్‌లాల్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని, నాయుడుపాలెం, పిడికిటివారిపల్లె, కొత్తూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరు కుళ్ళు రాకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ అనే శిలింధ్ర నాశిని మందును మొక్కనాటే ముందు నీటిలో తడిపి నాటాలని అన్నారు. పత్తిలో రసం పీల్చుకునే తెగులు కూడా కనిపిస్తోందని, దాని నివారణకు ఎసిటామిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫెట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. మండలంలోని పత్తి 1650 హెక్టార్లు సాగులో వుందని తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు 45 నుంచి 50 శాతం వరకు రాయితీపై అయిల్ ఇంజన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైనవారు వ్యవసాయ కార్యాలయం నందు సంప్రదించాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

భవన కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

త్రిపురాంతకం: భవన నిర్మాణాల్లో సంఘంలో పని చేస్తున్న కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ.3 వేల పింఛన్ ఇవ్వాలని నియోజకవర్గ కార్యదర్శి దాసరి మల్లికార్జున అన్నారు. మేడపిలో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ కార్మికులందరూ సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకున్న వారికి బీమా పథకాలు వర్తిస్తాయని అన్నారు. కార్యక్రమంలో నరసింహులు, డి.రామయ్య, కాశయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

త్రిపురాంతకం: మిట్టపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కేటీ మల్లికార్జున నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన, సిలబస్, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనం, ఎఫ్1, ఎఫ్2 పరీక్షల గ్రేడులను ఎంఈవో పరిశీలించారు. విద్యార్థులు లేఖన, పఠన సామర్థ్యాల్లో, గణితంలో వెనుకబడ్డారని రెమీడియల్ టీచింగ్ ద్వారా అభ్యసనా సామర్థ్యాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. రేడియో పాఠాలు క్రమం తప్పకుండా వినిపించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థుల వివరాలను చైల్డ్‌ఇన్ఫో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు.

పెద్ద దోర్నాల: భవిత కేంద్రాన్ని జిల్లా అధికారులు సీఎంవోఆర్ కొండారెడ్డి, ఏఎల్ఎస్‌వో ఎం.ఏసోబు మంగళవారం తనిఖీ నిర్వహించారు. కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. దివ్యాంగుల చిన్నారుల ప్రగతిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఆర్టీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని అధికారులు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం వివిధ పాఠశాలలను సీఎంవోఆర్ కొండారెడ్డి, ఏఎల్ఎస్‌వో ఎం.ఏసోబు ఎంఈవో వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవరాజుగట్టు యంపియుపి పాఠశాలలో భవిత కేంద్రం, ఐ ఆర్‌టిల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.


దోర్నాలలో పరిశీలిస్తున్న అధికారులు

ఉర్దూ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

మార్కాపురం వన్‌టౌన్ : మద్రస-ఎ-ఉమ్మెహబీబా నిస్వాన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పారిశ్రామిక వాడలోని నిర్వహిస్తున్న ఇస్లాం ధార్మిక విద్య ఉర్దూ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోవాలని సంఘ సలహాదారులు షేక్ గౌస్, సెక్రటరీ రహంతుల్లాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 20వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

- పలువురు వక్తల పిలుపు
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు రామమూర్తి పంతులకు నివాళులు

మార్కాపురం వన్‌టౌన్ : మాతృభాష తెలుగును పరిరక్షించుకోవాలని సాయిబాలాజీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య అన్నారు. స్థానిక సాయిబాలాజీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ జన్మదిన వేడుకలు ఘనంగా చేపట్టారు. తొలుత తెలుగు తల్లి, రామమూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పలువురు వక్తలు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ధ్యాన్ చంద్ సేవలు గుర్తు చేసుకున్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాజశేఖర్, ఉపాధ్యాయులు సుబ్బారావు, కె.మహేష్, గోవిందరావు, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓం సాయి వికాస్ విద్యా సంస్థలో..

మాతృబాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎ.వీరారెడ్డి మాట్లాడుతూ దేశంలోని తెలుగు భాషను భావి తరాలకు అందించాలన్నారు. కరస్పాండెంట్ పీవీ శ్రీనివాసరావు జాతీయ క్రీడా దినోత్సవం ప్రాముఖ్యత, ధ్యాన్ చంద్ జీవిత విషయాలు వివరించారు.



తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ రంగయ్య



నృత్యాలు చేస్తున్న బాలికలు

తెలుగుభాష అమృతం లాంటిది..

అమృతం లాంటిదని తెలుగు భాష అని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

జగద్గురు ఆది శంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రాహ్మణ సంఘ నాయకులు రెంట చింతల మధుసూధన శర్మ, వీఎస్ రాఘవేంద్ర, గోపాలుని హరిహరరావు, భారతుల శ్రీనివాస శాస్త్రి, ఒ.శివకుమార్ పాల్గొన్నారు.

వివేకానంద విద్యా పీఠంలో..

వివేకా నంద విద్యాపాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తోట నరసింహులు తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు వివరించారు. ప్రతి ఒక్కరూ తెలుగు భాష ఉన్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ వీలైనంత వరకు తెలుగులోనే మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు పండితులు రమేష్, శర్మ, సృజన తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మార్కాపురం టౌన్ : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటను నిలబెట్టుకోవాలని ఏపీ రజక సంఘ రాష్ట్ర కార్యదర్శి పి. తిరుపతయ్య, జిల్లా కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం పై నిర్ణయాన్ని నెట్టివేయడాన్ని తప్పుపట్టారు. ఎటువంటి ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపకుండా కప్పదాటు వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రజకులను ఎస్సీల్లో చేర్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.

వైద్యశిబిరానికి స్పందన

పొదిలి : దివగంత మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామి 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక కాటూరి పెదబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన వెన్నెముక, కీళ్ల, జనరల్, స్త్రీల వైద్యనిపుణులు ప్రకాష్ చావ్లా, నందకిషోర్, కల్పన 500 మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ముందుగా వైద్యశిబిరాన్ని మాజీ ఎంపీపీ కాటూరి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కాటూరి పెదబాబు, పొదిలి మాజీ సర్పంచ్ కాటూరి మాధురి, నిర్మమహేశ్వర దేవస్థాన ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ కార్యదర్శి కె.నరసింహం, జిల్లా మైనార్టీ నాయకులు డాక్టర్ ఇమాంసా, రసూల్, పొదిలి పట్టణ అధ్యక్షుడు షేక్ జిలానీ, నాయకులు షమీర్, ముల్లా ఖుద్దుస్, కరీముల్లా, వెంకట్రావు, పులి వెంకటేశ్వరరెడ్డి, రామిలేటి శ్రీను, ముని శ్రీను, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కాటూరి రాజు

ప్రమాణాలతో విద్యను అభ్యసించాలి

మార్కాపురం : విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పాలకవర్గ సభ్యుడు టీఎస్ఎస్ సింగ్ అన్నారు. స్థానిక జార్జి ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం మూడురోజుల పాటు నిర్వహించే ఇన్‌డక్షన్ పోగ్రాంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు కోర్సులో చేరే దశలోనే క్రమశిక్షణ, సాంకేతికత, పోటీ పరీక్షలకు అవసరమైన బోధనలు అందించే కేంద్రాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జార్జి విద్యా సంస్థల్లో అకడమిక్ ప్రారంభం నుంచే ప్రయోగాత్మక విద్యతోపాటు సామాజిక సేవా దృక్పథాన్ని అవలంబించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇన్‌డక్షన్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల మధ్య సమన్వయం, ర్యాగింగ్ నివారణ, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శరవణన్, డాక్టర్ జనార్ధన్, డాక్టర్ సోమ్‌నాథ్, డాక్టర్ పి.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీఎస్ఎస్ సింగ్

సమాజ అధ్యయనం అవసరం

మార్కాపురం వన్‌టౌన్ : యువత విద్యతో పాటు సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఒంగోలు ప్రాంగణం ఆచార్యులు డాక్టర్ బి.కృష్ణ అన్నారు. రాష్ట్ర టూరిజం శాఖ తరపున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో పశ్చిమ ప్రకాశం యువత కోసం చిత్రలేఖనం, చాయా చిత్ర, క్విజ్ పత్ర సమర్పణ పోటీలకు డాక్టర్ బి. కృష్ణ సంచాలకత్వం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ పోటీలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూధన్ నేతృత్వం వహించారు.

నిష్కంళక ప్రజానేత కాటూరి

పొదిలి : నిష్కంళక ప్రజానేతగా దివగంత మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పలువురు టీడీపీ నేతలు కీర్తించారు. కాటూరి 7వ వర్ధంతి సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు కాటూరి వెంకట నారాయణబాబు ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా కాటూరివారిపాలెం, పొదిలి చి నబస్టాండ్‌లో ఉన్న నారాయణస్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాటూరి వెంకటనారాయణబాబు మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి, నిజాయతీలతో వ్యవహరించి, నేటి తరం రాజకీయ నాయకులకు నారాయణస్వామి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పెద ఎత్తున స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.రాజు, జిల్లా టీడీపీ కార్యదర్శి కామనూరి వెంకటనరసింహం, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు డాక్టర్ ఇమాంసా, రసూల్, పట్టణ అధ్యక్షుడు షేక్ జిలానీ, పొదిలి మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఎర్రమోతు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు భూమా సుబ్బయ్య, నాయకులు ముల్లా ఆసీబ్ అహ్మద్, జిలానీ, షమీర్, యాసిన్, గౌస్‌బాషా, ముని శ్రీను, మహిళ నాయకురాలు షాహనద్, నాయకులు షకీర్, అన్నవరం వెంకటేశ్వరరెడ్డి, మల్లవరం వెంకట్రావు, ముల్లా ఖుద్దుష్, శ్రీను, గోరంట్ల రామయ్య, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



కాటూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

మేఘజ్యోతికి ట్రిపుల్ ఐటీలో సీటు



మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని స్థానిక సాయి బాలాజీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.మేఘ జ్యోతి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఆమెకు అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రంగయ్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు పొందడం, వెనుకబడిన పశ్చి మ ప్రాంతంలో ప్రతిష్ఠాత్మకమైన విద్యకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్ : బీసీలు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని బీసీ జన సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒ.కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక బీసీ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సినిమాలు

మార్కాపురం

జగదీశ్వరీ - జయజానకి నాయక
విజయా - ఫిదా
శ్రీనివాస - నేనేరాజు నేనే మంత్రి
రాధాకృష్ణ - ఆనందోబ్రహ్మ
సాయిబాలాజి - వివేకం
విశ్వేశ్వర - అర్జున్‌రెడ్డి

పొదిలి

వెంకటేశ్వర - లై
హరికృష్ణ - నేనే రాజు నేనే మంత్రి
రాఘవేంద్ర - జయ జానకి నాయక



విఘ్నేశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నిమజ్జనోత్సవం

తర్లుపాడు : మండలంలో వినాయక విగ్రహాలను 5వ రోజు మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు. తర్లుపాడులో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి, నిమజ్జనానికి తరలించారు. ఎస్సై లక్ష్మారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

తర్లుపాడు : అంకిత భావంతో పని చేస్తే ప్రజల్లో గుర్తింపు వస్తుందని హెచ్ఎం బి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నాగెళ్ళ ముడుపు ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఐవీ వీరారెడ్డి, బీవీ రామకృష్ణారెడ్డి, మార్టిన్ లూథర్, ఎస్.నాగమణి, జి.శ్రీనివాసులును మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

తర్లుపాడు: మండలంలోని రోలుగుంపాడులో తర్లుపాడు వైద్యాధికారి రాహుల్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 56 మందికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

తాతయ్య కోసం.. ఓ యాప్



ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.

క్లిక్ అండ్ ఫైండ్



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'

- కావ్య

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో


డాక్టర్: ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?

రోగి: (పర్సు తడుముకుంటూ): హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

సూక్తి


పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

రంగులు వేయండి




ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



దారి కనుక్కోండి



చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

చుక్కలు కలపండి



పదాలు గుర్తించండి

shoe
duck
doll
globe
block
green

x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▶ ....
2. LDOR ▶ ....
3. ALPM ▶ ....
4. TLAL ▶ ....

జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ....
2. అన్నతంత్యు ▶ ....
3. నీఅతివి ▶ ....
4. నంవమార్త ▶ ....

జవాబులు

చెప్పగలరా? : జాతీయం
జంతర్‌మంతర్ : 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL

వచ్చే ఏడాదికి వెలిగొండ నీరు

కలెక్టర్ వినయ్‌చంద్ వెల్లడి

పామూరు మండలంలో సుడిగాలి పర్యటన

పామూరు : వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులను వచ్చే ఏడాదికి పూర్తి చేసి నీరు ఇస్తామని కలెక్టర్ వినయ్‌చంద్ తెలిపారు. అందుకోసం ప్రణాళికాబద్ధమైన కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులో కీలకమైన హెడ్ రెగ్యులేటరీ పనులను కూడా డిసెంబర్‌లోపు ప్రారంభిస్తామన్నారు. మంగళవారం ఆయన పామూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆసుపత్రి, మోపాడు రిజర్వాయర్‌ను సందర్శించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ వెలిగొండను ప్రభుత్వం ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చి త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. అందులో భాగంగా హెడ్ రెగ్యులేటరీ పనుల కాంట్రాక్టును కూడా మరో సంస్థకు అప్పగించిందని తెలిపారు. తొలి టన్నెల్ తవ్వకానికి ఎదురవుతున్న అవరోధాలను తొలగించి వచ్చే ఏడాదికి ప్రాజెక్టు ద్వారా నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు రెండో దశలో మోపాడుకు వెలిగొండ నీరు ఇస్తామన్నారు.

తొలుత అయ్యవారిపల్లిలో నిర్మించిన సీసీ రోడ్లను, అంగన్‌వాడీ బిల్డింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. నాలుగేళ్ల నుంచి కార్యకర్త రావటం లేదని ఈ సందర్భంగా ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని సీడీపీవో ఇంద్రాకుమారిని ఆదేశించారు. విధులకు హాజరు కాని కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడి నుంచి బొట్లగూడూరు గ్రామం చేరుకున్న కలెక్టర్ అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. కోడి గుడ్ల సైజు చిన్నదిగా ఉండటాన్ని గమినించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ చిన్న గుడ్లు సరఫరా చేస్తుంటే మీరేం చేస్తున్నారని సీడీపీవోను ప్రశ్నించారు. అనంతరం బొట్లగూడూరు గ్రామంలో ఉపాధి హామీ పనుల కింద చేపట్టిన బ్లాక్ ప్లాంటేషన్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన ఆయన వైద్యులతో సమావేశమయ్యారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బొట్లగూడూరు బీసీ కాలనీ వాసులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కాలనీకి రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. మరుగుదొడ్లు, గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించి వినయ్‌చంద్ అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మెర్సీకుమారి, ఎంపీడీవో నాగభూషణరావుకు సూచించారు.

అనంతరం కలెక్టర్ మోపాడు జలాశయాన్ని సందర్శించారు. మోపాడు రిజర్వాయర్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఈఈ రాజన్ననాయుడు ఆయనకు వివరించారు. నీరు- చెట్టు కింద రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. రిజర్వాయర్ పునర్నిర్మాణానికి రూ. 45 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మోపాడు రిజర్వాయర్‌కు వెలిగొండ నీరే శరణ్యమని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వినయ్‌చంద్ స్పందిస్తూ వెలిగొండ మొదటి టన్నెల్ పనులు ముగింపు దశకు వచ్చాయని, రెండో విడత మోపాడు ప్రాజెక్టుకు వెలిగొండ నీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మోపాడులో సతీష్ అనే రైతు బిందు సేద్యం చేస్తున్న వంద ఎకరాల క్షేత్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. బిందు సేద్యం వలన తక్కువ నీటిని వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పలువురు ఎస్టీలు కలెక్టర్‌ను కలిసి తమను మత్స్యకార సొసైటీలో సభ్యులుగా చేర్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంట డ్వామా ఏపీడీ భాస్కర్, జేడీఏ మురళీకృష్ణ, అడిషనల్ ఏపీడీ భవాని, ఏడీఏ చల్లా సుబ్బరాయుడు, ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్ కోటపాటి విశాలమ్మ, నీటి సంఘం అధ్యక్షులు జక్కు శ్రీనివాసులురెడ్డి, ఏలూరి నరసింహారావు, నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎన్. హరి తదితరులు ఉన్నారు.



బొట్లగూడూరు పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినయ్‌చంద్



అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

మేమింతే.. మారమంతే!

నూతన విధానంలోనూ మారని ఇసుకాసురుల తీరు

అద్దంకి : ఇసుక విధానం మారింది. నిషా కట్టుదిట్టం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. అద్దంకి ప్రాంతంలోని చిలకలేరు, గుండ్లకమ్మ అడ్డాగా జరుగుతున్న అక్రమ క్వారీయింగ్ జోరుగా సాగుతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలి. కూలీలతో మాత్రమే లోడింగ్ చేయించాలి. ఆ ప్రకారం జిల్లాలో 11 ప్రాంతాల్లో అధికారులు ఇసుక తవ్వకానికి అనుమతించారు. కానీ ఎక్కడికక్కడ నదులు, వాగుల నుంచి ఇసుక తరలిపోతోంది. అనధికారికంగా 100 చోట్లకు పైగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. 'దొరికితే దొంగ లేదంటే దొర' అన్న చందంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. మరోవైపు అధికారిక రీచ్‌లలోను ఇసుక తవ్వకాలకు యంత్రాలను వినియోగిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ముండ్లమూరు, తాళ్లూరు, అద్దంకి మండలాల మీదుగా ప్రవహించే చిలకలేరు ఇసుకాసురులకు కల్పవృక్షంగా మారింది. చుట్టుపక్కల మండలాలకు కూడా ఇది అందుబాటులో ఉండటంతో ఇక్కడి నుంచి ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. పోలవరం, కుంకుబాడు, మల్కాపురం, రాళ్లపల్లి, మోదేపల్లి, పేరాయపాలెం తదితర ప్రాంతాల నుంచి రోజుకు 300 ట్రాక్టర్‌లకుపైగా ఇసుక తరలిపోతోంది. క్వారీయింగ్ విషయమై గ్రామాల మధ్య వివాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఇక గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ప్రభుత్వం మూడు ఇసుక రీచ్‌లను గుర్తించింది. ఆ ప్రకారం రామాయపాలెం, చక్రాయపాలెం-1, 2 రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక తీసుకెళ్లాల్సి ఉంది. కానీ అనధికారికంగా 10 చోట్ల అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారిక రీచ్‌లలోనూ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను ఉపయోగిస్తున్నారు. అద్దంకి పట్టణానికి సమీపంలో అనధికారిక రీచ్‌లు నడుస్తున్నా, యంత్రాలతో లోడింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. యంత్రాల వినియోగంతో తమ ఉపాధికి గండి పడుతున్నదని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

11 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎంవీఐ

తాళ్లూరు, అద్దంకి మండలాల్లోని రాళ్లపల్లి, మల్కాపురం మధ్య చిలకలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 11 ట్రాక్టర్‌లను దర్శి ఎంవీఐ శేషురెడ్డి మంగళవారం సీజ్ చేశారు. గ్రామ సమీపం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, ట్రాక్టర్‌లు తిరగడం వలన రోడ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ట్రాక్టర్‌లను కూడా అడ్డుకున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఎంవీఐ శేషురెడ్డికి సమాచారం ఇచ్చారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో చిలకలేరులో సుమారు 20 ట్రాక్టర్‌లకు ఇసుక లోడింగ్ జరుగుతోంది. రవాణా శాఖ అధికారుల రాకను గుర్తించిన తొమ్మిది మంది డ్రైవర్లు ట్రాక్టర్‌లతో సహా పరారయ్యారు. మిగిలిన 11 ట్రాక్టర్లను దర్శి ఎంవీఐ శేషురెడ్డి అదుపులోకి తీసుకొని అద్దంకి ఆర్టీసీ గ్యారేజీకి తరలించారు. ట్రాక్టర్ల అనుమతి పత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు తదితర పత్రాలను పరిశీలించి కేసులు నమోదు చేశారు. విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

ఒంగోలు గాంధీనగర్‌లో దోపిడీ

- **మహిళను కత్తితో బెదిరించి**
- **రూ. 10వేలు అపహరణ**

ఒంగోలు క్రైం : నగరంలోని గాంధీ నగర్‌లో మంగళవారం వేకువజామున దోపిడీ జరిగింది. ఇంట్లో ఉన్న మహిళను కత్తితో బెదిరించి ఓ అగంతకుడు రూ. 10వేలు తీసుకుని పరారయ్యాడు. గాంధీ నగర్ ఐదో లైన్‌లో నివాసం ఉండే గురవయ్య వ్యక్తిగత పనిపై మార్కాపురం వెళ్లాడు. ఆయన భార్య కర్నా ధనలక్ష్మి, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా వేకువజామున నాలుగు గంటల సమయంలో వెనుక తలుపు తీసుకుని ఓ అగంతకుడు లోపలికి ప్రవేశించాడు. ధనలక్ష్మి మెడపై కత్తి పెట్టి నిద్రలేపాడు. బీరువా తాళాలు ఇవ్వాలని హుకుం జారీ చేశాడు. తన వద్ద లేవని ఆమె సమాధానం ఇవ్వడంతో పక్కనే ఉన్న కుమారుడ్ని చంపుతానని బెదిరించాడు. దీంతో ధనలక్ష్మి బీరువా తాళాలు ఇవ్వగా దాన్ని తెరిచి అందులో ఉన్న రూ. 10వేలు తీసుకుని పరారయ్యాడు. కొద్దిసేపటి తరువాత తేరుకున్న ధనలక్ష్మి సమీపంలో ఉన్న అత్తమామల వద్దకు వెళ్లి విషయం తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న గురయ్య సమాచారం తెలుసుకుని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ గంగా వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అభివృద్ధిని చూసే నంద్యాల ప్రజల ఆదరణ : ఆమంచి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

నంద్యాల ప్రజలు అక్కడ జరిగిన, జరగబోతున్న అభివృద్ధిని చూసే టీడీపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించారని చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఆ నియోజకవర్గంలో టీడీపీ కీలకంగా భావించిన గోస్పాడు మండలంలో పార్టీ తరపున ఎన్నికల బాధ్యతను నిర్వహించిన ఆమంచి ఫలితాలపై మంగళవారం స్పందించారు. డబ్బు ప్రభావమే ప్రధానం అన్న వైసీపీ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎంతమేరకైనా నిధులు వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పామే కాని, ఎక్కడా పైసా డబ్బులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో, నంద్యాల నియోజకవర్గంలో జరిగిన, జరగబోతున్న అభివృద్ధిని తాము ప్రజలకు వివరించడంతోపాటు, ఒకవర్గం వారి నిర్బంధకాండను అడ్డుకోవడంతో మిగిలిన వర్గాల ఓటర్లు స్వేచ్ఛగా ఓట్లు వేశారన్నారు. దీని వలన ఆ మండలంలోనూ టీడీపీ ఆధిక్యం సాధించిందన్నారు.

డీసీసీబీలో అదే వరుస

(మొదటి పేజీ తరువాయి)

క్రితం మోహన్ తన రాజీనామా లేఖను సహకార శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డికి పంపగా ఆయనకు మద్దతుగా సోమవారం పది మంది బ్యాంకు డైరెక్టర్‌లు రాజీనామా చేసిన విషయం విదితమే. మంగళవారం కనిగిరి నియోజకవర్గానికి చెందిన పి. రామచంద్రరావు, సానికొమ్ము రామరాఘవరెడ్డి, గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన కె. మురహరి అనే డైరెక్టర్‌లు రాజీనామా చేశారు. దీంతో చైర్మన్‌తోపాటు పాలకమండలిలోని 21 మంది డైరెక్టర్‌లలో 14 మంది రాజీనామా చేసినట్లయింది. మరోవైపు సొసైటీల అధ్యక్షులు కూడా రాజీనామాల బాట పట్టారు. మంగళవారం కురిచేడు మండలంలోని కురిచేడు, పశ్చిమవీరాయపాలెం, ఎన్ఎస్పీ అగ్రహారం, పశ్చిమకంభంపాడు సొసైటీల అధ్యక్షులు కె. నాగిరెడ్డి, ఎం. లక్ష్మీనారాయణ, బి. వెంకటేశ్వర్లు, కె. వెంకటసుబ్బులు రాజీనామాలు ప్రకటించారు. అందుకు సంబంధించిన లేఖను మంత్రి ఆదినారాయణరెడ్డికి పంపారు. వీరికితోడు పలువురు సింగిల్ విండో అధ్యక్షులు మంగళవారం ఒంగోలు వచ్చి మోహన్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఇంకోవైపు మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బ్యాంకు అధికారులకు ఫోన్ చేసి ఈ సంక్షోభానికి కారణాలు ఏంటన్న విషయంపై సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది.

చీరాల, ఎర్రగొండపాలెం, అద్దంకి, కందుకూరు శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్, పాలపర్తి డేవిడ్‌రాజు, గొట్టిపాటి రవికుమార్, పోతుల రామారావుతోపాటు, ఇతరత్రా పలువురు అధికార, ఇతర పార్టీలకు చెందిన నాయకులు మోహన్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. రైతులకు అన్యాయం జరిగే చర్యలను కానీ, పాలకవర్గాన్ని ఇబ్బంది పెట్టే నిర్ణయాలను కానీ తాము సమర్థించమని వారు అన్నట్లు తెలిసింది. అవసరమైతే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని రాజీనామా నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరినట్లు తెలిసింది. కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కూడా మోహన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. సాయంత్రం మోహన్ పందిళ్లపల్లిలో చీరాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌ను కలిసి మాట్లాడారు. అయితే రాజీనామా విషయంలో తన నిర్ణయాన్ని స్పష్టం చేయని మోహన్ కమిషనర్ ద్వారా తాను పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టినట్లు తెలిసింది. మరికొందరు సొసైటీ అధ్యక్షులు కూడా రాజీనామా చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు ఈ విషయంపై ముందు ఎలా స్పందిస్తారనేది చూడాల్సి ఉంది. అయితే అధికార పార్టీలో కొందరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పాలకవర్గానికి వ్యతిరేకంగా పావులు కదిపే ప్రయత్నంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఫలితంగా మోహన్ రాజీనామా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

మినీ లోకం



ఇకనైనా పాఠాలు నేర్చుకోండి!!

తెలుగుభాషపై విద్యార్థుల్లో మక్కువ కలిగించాలి

డీఆర్వో డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ● ఘనంగా తెలుగుభాష దినోత్సవం



సభలో మాట్లాడుతున్న డీఆర్వో ప్రభాకరరెడ్డి

ఒంగోలు కల్చరల్ : విద్యార్థులలో చిన్నతనం నుంచే తెలుగు భాషపై మక్కువ కలిగించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ప్రకాశం జిల్లా అధికార భాషా సంఘ అధ్యక్షుడు, డీఆర్వో డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. తెలుగుభాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మంగళవారం ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్వో మాట్లాడుతూ తెలుగుభాషను పరిరక్షించే బాధ్యత తెలుగు భాషా పండితులపై ఎక్కువగా ఉందన్నారు. నేడు కవిత్వంలో అనేక కొత్త ప్రక్రియలు వచ్చాయని, వచన కవిత్వం దినదినాభివృద్ధి చెందుతూ ఎందరో కొత్త కవులు తెలుగులో వస్తున్నారంటే అందుకు నాడు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఫలితమేనని ఆయన చెప్పారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తెలుగులో సంతకం చేయటం అలవాటు చేసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తప్పనిసరిగా తెలుగులో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవో విజయభాస్కర్ మాట్లాడుతూ మాతృభాష హృదయాన్ని తాకుతుందని, పరభాష కేవలం చెవులకే పరిమితమన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీసుధ, ఉప విద్యాశాఖాధికారి సాల్మన్, తెలుగు టీచర్ మున్నంగి రాహేలు, భువనగిరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఒరవడికి శ్రీకారం

తెలుగుభాషా దినోత్సవ నిర్వహణలో డీఆర్వో ప్రభాకరరెడ్డి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో తెలుగుభాషా దినోత్సవం రోజున కొద్దిమంది స్థానిక కవులు, సాహితీవేత్తలతో సభ జరిగేది. అయితే తెలుగుభాష పాఠశాల స్థాయి నుంచే అభివృద్ధి చెందాలని భావించిన డీఆర్వో ఈ సంవత్సరం తెలుగు భాష దినోత్సవ సభను జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ఇందుకు సహకరించిన డీఈవో బి.విజయభాస్కర్ కృషిని ఉపాధ్యాయులు అభినందించారు.

రిమ్స్‌కు డైరెక్టర్ కావలెను!

● కొత్త డైరెక్టర్ పేర్లపై ఊహాగానాలు ● ప్రస్తుతం ఉన్న డైరెక్టర్‌ను తొలగించే అవకాశం

ఒంగోలు నగరం: ఒంగోలు రిమ్స్ వైద్యకళాశాలకు కొత్త డైరెక్టర్‌ను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఎవరిని నియమించాలనే అంశంపై స్పష్టత రాక పోవటంతో గత కొంత కాలంగా రిమ్స్‌కు కొత్త డైరెక్టర్ నియామకం విషయం వాయిదా పడుతూ వస్తోంది. ప్రస్తుతం రిమ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వల్లీశ్వరి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆరు నెలల క్రితమే వైద్య ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె సమర్ధవంతంగా పనిచేయటం లేదంటూ ఆయనకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆరు నెలల క్రితమే కొత్త డైరెక్టర్ నియామకం దిశగా దృష్టి సారించారు. అయితే ఎవరిని నియమించాలనే విషయంలో నేటికీ సందిగ్ధం కొనసాగుతోంది. అయితే ఇటీవల రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వల్లీశ్వరిపై ఆరోపణలు రావటం, ఆమె బాధ్యతలు చేపట్టాక రిమ్స్ నుంచి ప్రయివేట్ వైద్యశాలలకు రోగుల తరలింపు ఎక్కువవుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో డాక్టర్ వల్లీశ్వరిని రిమ్స్ డైరెక్టర్‌గా తొలగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అంతకంటే ముందుగానే రిమ్స్‌కు కొత్త డైరెక్టర్‌ను నియమించేందుకు వైద్యఆరోగ్యశాఖా మంత్రి పేషీ నుంచి చర్యలు ప్రారంభం అయ్యాయి. రిమ్స్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మురళిని నియమించేందుకు మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఆయన నియామకం దాదాపు పూర్తయ్యిందనుకున్న తరుణంలో డాక్టర్ మురళి విముఖత వ్యక్తం చేశారు. ఒంగోలు రిమ్స్ డైరెక్టర్ పోస్టులో కొనసాగటం అంటే టెన్షన్‌తో కూడుకున్న విషయం మేనంటూ ఆయన డైరెక్టర్‌గా వచ్చేందుకు ససేమిరా అనడంతో గత ఆరు నెలలుగా కొత్త డైరెక్టర్ నియామకం నిలిచిపోయింది. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్ వల్లీశ్వరినే కొనసాగిస్తూ వచ్చారు. అయితే ఈ ఆరునెలల్లో డాక్టర్ వల్లీశ్వరిపై మంత్రికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆమె పనితీరు రిమ్స్‌కు నష్టం కలిగించే విధంగా ఉందంటూ ఆయనతో పరిచయాలు ఉన్న ఇక్కడ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఒకరిద్దరు మంత్రితో పలుమార్లు చెప్పినట్లు సమాచారం. దీంతోపాటు రిమ్స్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీతారామయ్య కూడా డాక్టర్ వల్లీశ్వరిపై మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న కార్యక్రమాల గురించి తనకు ఏ మాత్రం తెలియజేయటం లేదని, ఆమె వైఖరి ఏక పక్షంగా ఉందంటూ పేర్కొన్నారు. ఆమెపై అవినీతి ఆరోపణలు రావటం, తనకు దగ్గరగా పరిచయం ఉన్న వైద్యులే ఫిర్యాదు చేయటంతో కొత్త వారిని డైరెక్టర్‌గా నియమించేందుకు మంత్రి పేషీ నుంచి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. డాక్టర్ వల్లీశ్వరి తొలగింపు ఖాయమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ పదవికి పలువురి పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉత్తమ పోలీస్‌గా
చీరాల వన్‌టౌన్ రైటర్ విద్యాసాగర్

చీరాలటౌన్ : జిల్లాలో ఈ వారం ఉత్తమ పోలీసుగా చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.విద్యాసాగర్ ఎంపికయ్యారు. జిల్లాలో పోలీసుల పనితీరును మెరుగుపరిచే ఉద్దేశంతో బెస్ట్‌పోలీస్ ఆఫ్ ది వీక్ కార్యక్రమాన్ని ఎస్పీ సత్యఏసుబాబు ప్రారంభించిన సంగతి తెలిసిందే. గత నెలలో చీరాల ముంతావారిసెంటర్‌లో ఇద్దరు వ్యక్తులు శ్యామ్ అనే వ్యక్తిని కత్తులతో పొడిచి హతమార్చాలని ప్రయత్నించారు. ఈ సంఘటనలో చురుగ్గా స్పందించి క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తరలించి అతని ప్రాణాలు కాపాడటానికి రైటర్ సాగర్ సహకరించారు. దీన్ని గుర్తించిన జిల్లా పోలీస్‌యంత్రాంగం ఆయనను ఈ వారం ఉత్తమ పోలీసుగా ఎంపిక చేసింది. మంగళవారం ఒంగోలులో ఎస్పీ సత్యఏసుబాబు నుంచి ప్రశంసాపత్రం స్వీకరించారు.



ఎస్పీ సత్యఏసుబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రైటర్ విద్యాసాగర్

క్రీడాస్ఫూర్తి కలిగి ఉండటమే నిజమైన గెలుపు

● డీఈవో విజయభాస్కర్ ● ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం ● బాలబాలికలకు ఆటల పోటీలు



మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈవో విజయభాస్కర్



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారుణులు

ఒంగోలు కార్పొరేషన్ : ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవడమే నిజమైన గెలుపు అని డీఈవో విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూలు ఆవరణంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి బాల,బాలికలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పోటీలను ప్రారంభించిన డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గెలుపే లక్ష్యంగా క్రీడల్లో ముందుకు సాగాలని, అయితే ఓటమి చెందిన తర్వాత నిరాశ కలిగి ఉండకూడదని ఆయన సూచించారు. క్రీడల్లో పాల్గొనడమే నిజమైన గెలుపుగా భావించాలన్నారు. విద్యార్థులు జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. క్రీడాభివృద్ధి శాఖాధికారి ఆర్‌కే. యతిరాజ్ అధ్యక్షతన క్రీడాకారులు డీర్ఆర్ఎం స్కూలు వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రా భాస్కర్‌రావు, పీఈటీలు సోమినేని సురేష్, రామకృష్ణ, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, హాకీ పోటీలను నిర్వహించారు. కాగా కబడ్డీ బాలుర విభాగంలో ఉప్పుగుండూరు జట్టు ప్రథమ స్థానంలో, చిన్నగంజాం జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. అదేవిధంగా బాలికల విభాగంలో ఇంకొల్లు, పర్చూరు జట్లు మొదటి, రెండవ స్థానం సాధించాయి. బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో ఒంగోలు జట్టు విజయాన్ని కైవసం చేసుకోగా, కందుకూరు జట్టు రెండోస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో ఒంగోలు, చీరాల జట్లు తొలిరెండు స్థానాలను సాధించాయి.

సురక్షిత ప్రయాణమే ధ్యేయం

- గిద్దలూరు నుంచి ప్రధాన పట్టణాలకు అదనపు సర్వీసులు
- ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ మహేశ్వర్



మాట్లాడుతున్న ఈడీ మహేశ్వర్

గిద్దలూరు : ఉన్న వనరులతో ప్రయాణికులకు సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే ప్రధాన ధ్యేయమని నెల్లూరు జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.మహేశ్వర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, డిపోను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ప్రయాణికులను గౌరవించాలని, మర్యాదపూర్వకమైన పలుకరింపుతో వారిని ఆర్టీసీ ప్రయాణం వైపు రాబట్టుకోవాలని సూచించారు. ఆదాయం పెంపునకు ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి ముందుకు సాగాలన్నారు. అనంతరం జరిగిన విలేఖల సమావేశంలో మాట్లాడుతూ గిద్దలూరు నుంచి విజయవాడ, బెంగుళూరు పట్టణాలకు ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా అదనపు సర్వీసుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీశైలం, విశాఖపట్టణం, బళ్లారి పట్టణాలకు కొత్త సర్వీసులు, హైదరాబాద్, బెంగుళూరుకు ఏసీ బస్సుల ఏర్పాటు గురించి చాలా కాలంగా ప్రయాణికుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను విలేఖరులు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపితే మంజూరుకు పరిశీలిస్తానని ఈడీ స్థానిక డిపో మేనేజర్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు నుంచి జేపీచెరువు, ఆకవీడు, కంభం నుంచి అర్థవీడు, పాపినేనిపల్లి రూట్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రద్దీతోపాటు టాప్ సర్వీసులు నడుస్తున్న వైనం గురించి, ఆంధ్రజ్యోతిలో ప్రచురిథమైన కథనాల గురించి ప్రస్తావించగా ఆయా రూట్లలో వెంటనే అదనపు సర్వీసులు నడపాలని డిపో మేనేజర్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు మీదుగా కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి విజయవాడకు రాత్రిపూట వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు హైవే రోడ్డును ఆనుకుని ఉన్న బస్టాండ్‌లోకి రాకుండా వెళతుండటంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, వారు రైళ్లను ఆశ్రయిస్తున్న విషయాన్ని వివరించగా బస్టాండ్ బయట ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి బస్సులు ఖచ్చితంగా లోపలికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మేనేజర్‌కు సూచించారు.

రైతు సంక్షేమమే ఏపీజీబీ లక్ష్యం : ఆర్డీవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో కిశోర్

మార్కాపురం : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) రుణాలు అందిస్తుందని ఆర్డీవో పి.కిశోర్ పేర్కొన్నారు. స్థానిక షాదీఖానా ఆవరణలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు గృహ రుణ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ శివశంకర్ రెడ్డి అధ్యక్షత వహించగా ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ప్రైవేటు బ్యాంకులతో పోలిస్తే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ రైతులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో రైతులు ఎక్కువ శాతం వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి సహకరిస్తున్న బ్యాంకులను విస్మరించకుండా తిరిగి రుణాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆర్ఎం శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీజీబీ రీజనల్ పరిధిలో రూ. 23 వేల కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సులభ వాయిదాలు, సత్వర రుణ సదుపాయంతో తక్కువ వడ్డీకే గృహ, వ్యవసాయ రుణాలు అందిస్తుందన్నారు. వ్యవసాయదారులకు అర్థ సంవత్సరం, సంవత్సర వాయిదాల చెల్లింపు సౌకర్యంతో పాటు రూ. 7.50 లక్షల వరకు ఆదాయ నిరూపణ పత్రం లేకుండానే రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రుణాలు, 75 లక్షల వరకు గృహ నిర్మాణం, కొనుగోలుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ప్రధాన, జవహర్ నగర్ కాలనీ బ్రాంచ్ మేనేజర్లు మహేశ్వరరావు, కె.నాగలక్ష్మి కుమారి, రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో చికున్‌గున్యా పంజా

- పట్టించుకోని ఆరోగ్య శాఖ
- ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఉన్నతాధికారులు స్పందించాలని వినతి



రోగులను పరామర్శిస్తున్న వైద్యాధికారి రమణారెడ్డి

రాచర్ల : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తోంది. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించి విషజ్వరాలుగా ముదురుతున్నాయి. మండలంలోని ఆకవీడు పంచాయతీ కొత్తూరు గ్రామం ఎస్సీకాలనీలో విషజ్వరాలు పంజా విసిరాయి. ప్రతి ఇంటికి ముగ్గురు, నలుగురు జ్వరాలతో మంచాన పడ్డారు. సంవత్సరం వయసు గల పిల్లల నుంచి వృద్ధుల వరకు చికున్‌గున్యా రావడంతో చేతులు, కాళ్లు, మోకాళ్ల నొప్పులతో అల్లాడుతున్నారు. గత శుక్రవారం నుంచి మండలంలో వర్షాలు ప్రారంభం కాగా వెంటనే ఎస్సీకాలనీలో జ్వరాలు ప్రబలాయి. ఈ జ్వరాల నొప్పులకు తట్టుకోలేక కాలనీవాసులు 108 వాహనాలకు సమాచారం ఇవ్వగా ప్రాథమిక చికిత్స చేసి వెళ్లిపోయారు.

అధికారికంగా 12 మందికి ఎస్సీకాలనీలో చికున్‌గున్యా ఉన్నట్లు ఆకవీడు ప్రభుత్వ వైద్యాధికారి కె.రమణారెడ్డి గుర్తించినప్పటికీ అనధికారికంగా 50 మంది ఉన్నట్టు తెలుస్తోంది. గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో 600 రూపాయలకు ఆటోను బాడుగను మాట్లాడుకుని గిద్దలూరుకు వచ్చి, రూ. 3 వేల ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించుకున్నట్టు పెట్ల సాలమ్మ, పెట్ల కేశాలు వాపోతున్నారు.

పురపాలక పాఠశాలకు పుట్టెడు కష్టాలు

- వర్షం వస్తే తరగతులకు ఇబ్బందులు
- గదులు లేవు, రాసేందుకు బోర్డులు ఉండవు
- ఇది.. సుందరయ్యకాలనీలోని స్కూల్ దుస్థితి



ఆరుబయట తరగతులు



పాఠాలు బోధించేందుకు ఉన్న బ్లాక్‌బోర్డు ఇదే



చెట్టుకింద పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

మార్కాపురం టౌన్ : విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఇంకా పలుచోట్ల పాఠశాలలు దయనీయ స్థితిలోనే కొనసాగుతున్నాయి. ఇందుకు ఉదహరణే పట్టణంలోని సుందరయ్యకాలనీలో పురపాలక ప్రాథమిక పాఠశాల. పుట్టెడు కష్టాల మధ్య ఇక్కడి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సమస్యలతోనే విధులను నిర్వర్తిస్తున్నారు.

అద్దె భవనంలో నడుపుతున్న ఈ పాఠశాలల్లో కనీసం తరగతులకు సరిపడా గదులు కూడా లేవు. ఒక గది, వరండాతో పాఠశాలను నిర్వహిస్తున్నారు. దాదాపు 90 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గది, వరండాలో విద్యార్థులు పట్టకపోవడంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు చెట్టుకింద పాఠాలు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు మాత్రం ఉన్న ఒక్క గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అయితే పిల్లలకు ఏదైనా అ క్షరాలు రాసి చూపాలన్నా బయట గోడకు ఉ న్న బ్లాక్‌బోర్డే గతి. దానిపైనే రాయాలి. విద్యాభ్యాసానికే వసతులు లేకపోతే ఇంక ఇతర వ స తులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనమైనా కనీసం తరగతులకు సరిపడా గదులున్న భవనాన్ని తీసుకొని ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్నపాటి వర్షమొచ్చినా తరగతులు రద్దుచేసుకుని ఉన్న ఒక్క గదిలోనే పిల్లలందరినీ ఉంచి అవస్థలు పడాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అవసరమైన తరగతి గదులతో ఉన్న భవనంలో పాఠశాల ఏర్పాటు చేసి, వసతులు కల్పించాల్సిన అవసర ఎంతైనా ఉంది.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు హెచ్చరిక

సంతనూతలపాడు : అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు చర్యలు తప్పవని అధికారులను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలో చీమకుర్తి, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీ చేపట్టిన పనులు, సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గానికి ఈ ఏడాది 1100 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటి వరకూ 120 నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. మిగిలిన వాటిని వచ్చే నెల 1లోపు ప్రారంభించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. నియోజకర్గ అభివృద్ధిపై ఇక వారంవారం సమీక్షిస్తానని చెప్పారు. సమగ్ర సమాచారంతో అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

రేపు గిద్దరూరులో పోలీసు గ్రీవెన్స్

ఒంగోలు క్రైం : ప్రజల ముంగిటకు పోలీస్ అనే ప్రయత్నంలో భాగంగా గిద్దలూరులో గురువారం గీవన్స్‌సెల్ నిర్వహించనున్నట్టు ఎస్పీ సత్యఏసుబాబు తెలిపారు. గిద్దలూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని ఆ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. పశ్చిమప్రాంతంలో ఉన్న సర్కిల్ పరిధిలో దశలవారీగా గ్రీవెన్‌సెల్ ఏర్పాటు చేస్తామని, సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాశలతో వినతులిచ్చేందకు ఒంగోలు రాకుండా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు.

తూతూ మంత్రంగా తెలుగుభాష దినోత్సవం

- -సాహితీవేత్తలను విస్మరించిన యంత్రాంగం
- -ఎర్రన, జాషువాలకు దండలే కరువు

ఒంగోలు కల్చరల్ : భాషకు సారథులు, వారథులు సాహితీవేత్తలు. అటువంటి సాహితీవేత్తలకు జిల్లాలో కరువేలేదు. ముఖ్యంగా మహాభారతంలో అరణ్యపర్వాన్ని, హరివంశం, నృసింహపురాణం, తెలుగులో శ్రీమద్రామాయణం వంటి ఎన్నో విలువైన గ్రంథాలను రచించి కవిత్రయంలో ఒకనిగా పేరుగాంచిన ఎర్రాప్రగడ ప్రకాశం జిల్లాకు చెందిన గొప్ప కవి. అదేవిధంగా దళిత జాతిలో జన్మించినప్పటికీ, అగ్రకుల సాహితీవేత్తలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఫిరదౌసి, గబ్బిళం వంటి అనేకానేక రచనలతో మహాకవిగా పేరుగాంచి జిల్లాలో ఎందరో కవులకు గురుతుల్యునిగా నిలిచారు గుర్రం జాషువా. వీరికి ఒంగోలులో విగ్రహాలు ఉన్నాయి. అదీ జిల్లా పరిపాలనా భవనమైన ప్రకాశం భవన్‌లో జాషువా విగ్రహం ఉండగా, ఎదురుగా ఎర్రనామాత్యుని విగ్రహం ఉంది. తెలుగుభాష దినోత్సవం రోజున అధికారులెవరికీ వీరు కన్పించకపోవటం శోచనీయం. ఆగష్టు 29ని తెలుగు భాష దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ జిల్లా యంత్రాంగం కేవలం ఉపాధ్యాయులతో సదస్సు నిర్వహించి మ.మ. అనిపించింది. కనీసం జాషువా, ఎర్రనామాత్యుని విగ్రహానికి తెలుగుభాష దినోత్సవం రోజున దండవేసే అధికారి కూడా కరువైనారు. దీనినిబట్టి జిల్లా సాంస్కృతిక శాఖ పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్రంలోని వివిధ సాహితీవేత్తలను ఘనంగా సన్మానించింది. అందులో మనజిల్లాకు చెందిన శశిభూషణ్ కూడా ఉన్నారు. అయితే జిల్లా యంత్రాంగం మాత్రం ఆ పని చేయలేకపోవటం పట్ల జిల్లా సాహిత్య సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

వేటపాలెం: వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు మాట్లాడుతూ చదువులతోపాటు క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ ఛాంపియన్ బి.శ్రీనివాసరెడ్డిని కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగవీరభద్రాచారి, పీడీ జెడ్.నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ డి.నాగమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో కేంద్ర బృందం పరిశీలన



మాట్లాడుతున్న అధ్యాపకులు

అద్దంకి రూరల్: అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో వసతులు, రోగులకు అందుతున్న సౌకర్యాలపై కేంద్ర బృందం మంగళవారం సాయంత్రం పరిశీలన చేసింది. ఈ సందర్భంగా గర్భవతులు, బాలింతలకు కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యశాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులు, వైద్యుల వివరాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యశాలల పనితీరుపై పరిశీలన చేసిన అనంతరం నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. పరిశీలిన చేసిన వారిలో బృందం సభ్యులు డాక్టర్ సీహెచ్.సూరిబాబు, డాక్టర్ కేవీ.సుబ్బలక్ష్మి, డాక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన గరటయ్య

సంతమాగులూరు: పాతమాగులూరు మాజీ సర్పంచ్ మన్నేటి కోటిరెడ్డి ఇటీవల అనా రోగ్యానికి గురైన నేపథ్యంలో మంగళవారం అద్దంకి నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ బాచిన చెంచు గరటయ్య పరామర్శించారు. అనంతరం పుట్టావారిపాలెం కెఎంసీ అతిథిగృహంలో బూత్ లెవల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ నంద్యాలలో ఓటమి చెందినంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు వెదజల్లి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని గెలవటం జరిగిందని ఆరోపించారు. మరి కొద్దిరోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ యర్రం రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీలు శ్రీరాములు, కుంచాల వెంకటేశ్వర్లు, మోదేపల్లి శ్రీను, విజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏల్చూరులో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఏల్చూరు(సంతమాగులూరు): సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని సజ్జాపురం రోడ్డులో గల మాలకొండ వద్ద సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పేకాట శిబిరంపై పోలీలు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 42,080 రూపాయల నగదును స్వాదీనం చేసుకున్నట్టు మేదరమెట్ల ఎస్ఐ పాండురంగారావు తెలిపారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం ఇవ్వడంతో ఈ దాడులు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


చీరాలటౌన్ : ప్రమాదవశాత్తూ రైలు కిందపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన పేరాల కారంచేడురైల్వేగేటు వద్ద సోమవారం రాత్రి జరిగింది. చీరాల రైల్వే పోలీసుల వివరాల ప్రకారం పేరాల మసీదుసెంటర్ సమీపంలో పేరాల గోపాలరావు(64)అనే వ్యక్తి నివసిస్తుంటాడు. ప్రతి రోజు రాత్రి భోజనానంతరం రైల్వేగేటు వద్ద గల బొమ్మల సెంటర్ వద్ద కూర్చోవటం ఇతనికి అలవాటు. సోమవారం కూడా యధావిధిగా అక్కడకు వచ్చాడు. ఈ సమయంలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వేహెడ్‌కానిస్టేబుల్ అవ్వారుశ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు

అద్దంకి: అద్దంకి పట్టణం సత్యన్నారాయణ కళామందిర్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మంగళవారం గరికతో ప్రత్యేక అలంకరణ చచేసి పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు.

బల్లికురవ: బల్లికురవ మండలంలోని కొత్తూరు, కూకట్లపల్లి, కొండాయపాలెం, కొప్పెరపాడు గ్రామాల్లో మంగళవారం గణేష్ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణనాథులను ట్రాక్టర్లపై ఎక్కించి మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనాలు చేశారు.

సంతమాగులూరు: సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం, పుట్టావారిపాలెం, కుందుర్రు, వెల్లలచెరువు, గురిజేపల్లి గ్రామాల్లో వినాయక నిమజ్జన ఊరేగింపు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అడవిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జరిగిన లడ్డూ వేలం పాటలో గొట్టిపాటి యూత్ రూ.35 వేలకు దక్కించుకున్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అనూక్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



అద్దంకిలో గణేషుడికి గరికతో చేసిన అలంకరణ



అడవిపాలెంలో లడ్డూను వేలంలో దక్కించుకున్న గొట్టిపాటి యూత్

మాతృభాష తల్లితో సమానం

చీరాలఅర్బన్ : మాతృభాష తల్లితో సమానమని, తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఎందరో మహానుభావులను స్ఫూర్తిగా తీసుకుని తెలుగుభాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మాతృభాషాదినోత్సవం సందర్భంగా తెలుగు భాషోధ్యమ సమాఖ్య ఆధ్వర్యంలో చీరాలలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ పి.శ్రీనివాసరావు మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభాషలందు తెలుగులెస్స అంటూ సంస్కృతీ సంప్రదాయాలలో ప్రత్యేకస్థానం పొందిన తెలుగుభాష నేలపై జన్మించటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య తనిఖీ అధికారి రాంభూపాల్‌రెడ్డి, తెలుగుబాషోధ్యమ సమాఖ్య కార్యదర్శి అన్నంరాజు సుబ్బారావు, వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య, రామమనోహర్ లోహియా తదితరులు పాల్గొన్నారు.

చీరాల : పరభాష వ్యామోహంలో పడి తెలుగుభాషను విస్మరించరాదని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగడ వేణుగోపాల్ అన్నారు. చీరాలలోని ఆ కళాశాల ఆడిటోరియంలో గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి సందర్భంగా తెలుగుభాషాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జాగర్లమూడి రేవతి అధ్యక్షతన జరిగిన సభలో వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్యామలాదేవి, ఈ జాగర్లమూడి అనూరాధ, జోతీశ్వరనాయుడు, సీనియర్స్‌సిటిజన్స్ ప్రతినిధులు చుక్కపల్లి రామకోటయ్య, లయన్ కాకరపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వైఏ ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం తెలుగుభాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ సీ.హెచ్.రమణమ్మ గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయక్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



చీరాలలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వేణుగోపాల్

ఆదరణకు నోచుకోని వృద్ధులకు చేయూత

● సీనియర్‌సివిల్‌జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి

చీరాలఅర్బన్ : ఆదరణకు నోచుకోక వృద్ధాశ్రమాల్లో చేరిన వృద్ధులకు మండల న్యాయసేవాధికారసంస్థ చేయూతనందిస్తోందని మండల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, సీనియర్‌సివిల్‌జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి అన్నారు. చీరాల పట్టణం సురేష్‌మహల్ సమీపంలోని శ్రీ భవానీ మహిళామండలి, రామకృష్ణాపురం పంచాయతీ పరిధిలోని ఏబీసీ ఫ్యాషన్స్ ఆవరణలోని శ్రీమహాలక్ష్మి మహిళామండలిల వృద్ధాశ్రమాలను మంగళవారం సాయంత్రం సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయా న్యాయవిజ్ఞానసదస్సులలో సీనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ బిడ్డల నుంచి భరణం పొందే హక్కు ఉందని, సీనియర్ సిటిజన్స్ యాక్టు ప్రకారం అనాదరణకు గురైన వృద్ధులకు వారి బిడ్డల నుంచి భరణం లేదా ఆస్థి వ్యవహారాలు తదితర హక్కులు పొందవచ్చన్నారు. మండల న్యాయసేవాధికారసంస్థ ద్వారా ఉచిత న్యాయసహాయం అందించటంతో పాటు పెన్షన్లు రాని వారికి పెన్షన్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆయా కార్యక్రమాలలో వన్‌టౌన్ సీఐ సూర్యనారాయణ, మహిళామండలి నిర్వాహకురాలు డాక్టర్ సజ్జా లీలావతి, భానుప్రసాద్, పద్మలత, న్యాయవాదులు ఎ.విశ్వేశ్వరరావు, ఆర్.సుబ్బారెడ్డి, బీవీఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఈసీ అధ్యాపకుడికి అరుదైన గౌరవం

చీరాల : చీరాల ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ పి.బాలనాగుకు అరుదైన గౌరవం దక్కింది. హన్మకొండ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫెరెన్స్ ఆన్ లేటెస్ట్ రీసెర్చ్ ఇన్ ఇంజనీరింగ్ సైన్స్‌లో డీసెంట్రలైజ్డ్ కోఆర్డినేటెడ్ కంట్రోల్ ఆఫ్ మల్టియసెంట్ సిస్టం ఫర్ అటానమీ మైక్రో గ్రిడ్ ఆపరేషన్ అనే అంశంలో సీఈసీ ప్రొఫెసర్ బాలనాగు పేపర్ ప్రజెంట్ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు ఈ పేపర్ ప్రెజెంటేషన్‌లో పాల్గొన్నారు. అందులో చీరాల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పి.బాలనాగుకు బెస్ట్ పేపర్ ప్రెజెంటేషన్ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలల సంయుక్త కార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టరు సయ్యద్ కమాలుద్దీన్‌లు బాలనాగును అభినందించారు. తమ కళాశాలలలోని విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు నిరంతరం నూతన విధానాలను అవలంభిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నామని అశోక్‌కుమార్ చెప్పారు.



బాలనాగును అభినందిస్తున్న తేళ్ల అశోక్‌కుమార్

యూటీఎఫ్ బైక్ ర్యాలీ

చీరాలటౌన్ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం చీరాల పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో కొత్తగా చేరిన ఉపాధ్యాయులను అభినందించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ఎమ్మెల్సీ ద్వారా అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతున్నామని చెప్పారు. సెప్టెంబర్ 1న విజయవాడలో జరగనున్న మిలియన్‌మార్చ్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ ర్యాలీలో ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామరాజు, బి.బిక్షాలుబాబు, గవినినాగేశ్వరరావు, జి.సూరిబాబు, షేక్ జానీభాషా, సుభానీ, ఖాసిం, కుర్రా శ్రీను, పిచ్చయ్య, రాజేష్, రవి, సీ.వీ.రావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఐదుగురిపై కేసు నమోదు

సంతమాగులూరు: మక్కెనవారిపాలెంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో పోలీసుల అనుమతి లేకుండా డాన్సర్లచే అశ్లీలంగా నృత్యాలు చేయించినందుకు ఆ గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ అనూక్ తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామంలో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపులో ఆరుగురు మహిళా డాన్సర్లతో నృత్యాలు చేయించినందుకు ఉత్సవకమిటీ సభ్యులు ఐదుగురిపై, నృత్యాలు చేసిన డాన్సర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మంగళవారం పేర్కొన్నారు.

అశ్లీల ప్రదర్శనలు నిర్వహిస్తే చర్యలు : ఏఎస్‌ఐ

బల్లికురవ: గణేష్ నిమజ్జనాల వేడుకల్లో నిబంధనలకు విరుద్ధంగా డ్యాన్సర్లచే అశ్లీల నృత్యాలు చేస్తే చర్యలు తప్పవని ఏఎస్‌ఐ లక్ష్మణరావు మంగళవారం హెచ్చరించారు. గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసిన నిర్వాహక కమిటి నిమజ్జనాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, అలా కాంకుడా పాటకచేరి, రికార్డు డ్యాన్సులు పెట్టిస్తే సంబంధిత నిర్వాహక కమిటీపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

చిన్నారుల సంరక్షణకు చర్యలు : సీడీపీవో

బల్లికురవ: చిన్నారుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం కె.రాజుపాలెం గ్రామంలో సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృత హస్తం పథకం లబ్ధిదారులకు అందేలా పనిచేయాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం పంచాలని చెప్పారు. సమావేశంలో సూపర్‌వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా జింక్ సరఫరా : ఏవో

పంగులూరు: గత మూడు సంవత్సరాలుగా మట్టి నమూనాలు అందించి భూసార పరీక్షలు చేయించుకున్న రైతాంగానికి జింక్, జిప్సమ్, బోరాన్ ఉచితంగా అందజేస్తున్నట్లు ఏవో నిర్మలాదేవి మంగళవారం తెలిపారు. అర్హులైన రైతులు తమ వద్ద నుంచి వీటిని పొందవచ్చన్నారు. దీంతో పాటు 50 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎకరాకు 8 కిలోల వంతున 5 ఎకరాల వరకు ఇస్తామని చెప్పారు.

మినుము పరిహారం అందజేత

2016 ఖరీఫ్‌లో మినుము పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఏవో నిర్మలాదేవి తెలిపారు. 1973 మంది రైతులకు రూ. 1,25,600 నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లించిందని ఆమె చెప్పారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె

అద్దంకి టౌన్: విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్లడానికి వెనుకాడబోమని డివిజన్ కార్యదర్శి కె.రత్నరాజు అన్నారు. మీ టర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అద్దంకిలో డీఈవో సత్యనారాయణరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015-16 సంవత్సరానికి రావాల్సిన అరియర్స్ ఇవ్వాలని, 2016 జూన్, జులై బకాయిలు ఏప్రిల్ పెండింగ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళినట్లు చెప్పారు. ఆయా సమస్యలు ఈ నెల 31వ తేదీలోపు పరిష్కరించకుంటే సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.సుధాకర్, పి.సాయికృష్ణ, జి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించండి

● **జేసీ నాగలక్ష్మి**

మేదరమెట్ల: మేదరమెట్ల పునరావాసకాలనీలో ఉన్న చెంచు కుటుంబాలకు తాగునీరు, విద్యుత్, విద్యా వంటి మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని జేసీ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం పునరావాసకాలనీలలో వసతులను పరిశీలించారు. మేదరమెట్ల వచ్చిన జేసి నాగలక్ష్మికి చెంచులు తమ సమస్యలను మొర పెట్టుకున్నారు. ధేనువకొండ పునరావాస కాలనీలో నివాసముంటున్న చెంచు కుటుంబాలు తమకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేవన్నారు. కాలనీలలో పాఠశాల నిర్మించినా ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో తమ పిల్లల చాలా దూరం వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఎల్‌క్ట్రికల్ ఎస్‌ఈలతో జేసీ నాగలక్ష్మి ఫోన్‌లో మాట్లాడి ట్యాంకర్లతో సాగునీరు సరఫరా చేయాలని, వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కాలనీలో అంతర్గత సీసీరోడ్లు వేసి చిల్లచెట్లను తొలగించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉదయభాస్కర్‌ను ఆదేశించారు.



చెంచులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి

సింథైట్ ఫ్యాక్టరీ వల్ల ఇబ్బంది పడుతున్నాం

సింథైట్ మిరపకాయల ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని చెంచు కుటుంబాలతో పాటు మేదరమెట్లకు చెందిన పలువురు మహిళలు జేసీ నాగలక్ష్మికి తమ సమస్యను వివరించారు. ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యం వల్ల ఒళ్లంతా మంటలు, దురదలు, ఊపిరాడని పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. వెంటనే కాలుష్య నియంత్రణ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని హెచ్చరించాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

అద్దంకి: తెలుగు భాష ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని నర్సరావుపేటకు చెందిన శ్రీనాథసాహితి పరిషత్ అధ్యక్షుడు స్వర్ణ పాండురంగారెడ్డి పేర్కొన్నారు. తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా మంగళవారం అద్దంకి కమతేశ్వరాలయం వద్ద ఉన్న తొలి తెలుగు పద్యశాసనం ప్రతికృతి, ఎర్రన విగ్రహాలకు ఆయన పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి అధికార భాషా సంఘం ద్వారా ప్రభుత్వం అన్ని విధాల చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల్లో పదో తరగతి వరకు నిర్బంధ తెలుగు బోధన సాగాలని, ప్రతి జిల్లాలో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు స్వర్ణ చిన్న రామిరెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, కాసుల నాటి నాగరాజశర్మ, డాక్టర కేవీ.కోటయ్య, కామేశ్వరరావు, రత్నాకరం రాము, ఈపూరి వెంకటరెడ్డి, స్వర్ణ రామిరెడ్డి, పెనుగొండ గోపీలతో పాటు అద్దంకి చెందిన పలు సాహితి సంస్థల ప్రతినిధులు జ్యోతి చంద్రమౌళి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అనీల్‌కుమార్ సూరి, నరేంద్ర, నర్రా శ్రీలక్ష్మి, మన్నం త్రిమూర్తులు, బాషా తదితరులు పాల్గొన్నారు.



తొలి తెలుగు పద్యశాసనం ప్రతికృతి వద్ద, ఎర్రన విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సాహిత్యవేత్తలు

పంగులూరు: మాతృభాషా ప్రాధాన్యతను గుర్తించాలని పంగులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఝాన్సీలక్ష్మి కోరారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతుల సందర్భంగా మంగళవారం భాషా, క్రీడా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.పద్మిని, వాసుబాబు పాల్గొన్నారు.

శింగరకొండ(అద్దంకి రూరల్): శింగరకొండ వద్దగల కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.వరప్రసాదరావు, అధ్యాపకులు హరిబాబు, ఏసుపాదం, చంద్రశేఖర్, కె.ప్రభుదాసు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ నమోదు కాక వసతిగృహాల విద్యార్థుల ఇక్కట్లు

అద్దంకిటౌన్: ప్రభుత్వం బోగస్ హాజరను అరికంట్టేందుకు ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానంతో హాస్టల్ విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. సంబంధిత వసతి గృహాల్లో బయోమె ట్రిక్ వేలిముద్రలు పడక అవస్థ పడుతున్నారు. దీంతో విద్యార్థులు ఆధార్‌సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. మంగళవారం సాయంత్రం అద్దంకిలోని బీసీ బాలికల వసతి గృహంలో ఉన్న సుమారు 40 మంది విద్యార్థినులు వేలిముద్రలు, ఐరీష్ నమోదు కాకపోతుండటంతో ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో గల ఆధార్ కేంద్రానికి వచ్చి మరలా ఐరీష్, వేలిముద్రలను నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ డి.పద్మావతి మాట్లాడుతూ బయోమెట్రిక్‌లో పలువురు విద్యార్థినుల వేలిముద్రలు, ఐరీష్ నమోదు కాకపోవడంతో మరలా ఆధార్ సెంటర్‌లో నమోదు చేయిస్తున్నట్లు చెప్పారు.



ఆధార్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న విద్యార్థినులు

లబ్ధిదారుల ఎంపిక బాధ్యత బ్యాంకులకు అప్పగించండి

సంతమాగులూరు: వివిద కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను బ్యాంకులకు పంపించాలని టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను బ్యాంకులకు పంపి నిజమైన అర్హుల ఎంపిక బ్యాంకులకు అప్పగించాలని వారు కోరారు. రుణాల ఎంపికలో ఏకపక్షంగా జరుగుతున్నాయని, రుణాల కమిటీని ఎందుకు మార్చాల్సి వచ్చిందని ఎంపీడీవో హేమాద్రినాయుడుని వారు ప్రశ్నించారు.

నేడు కలెక్టర్ పర్యటన

అద్దంకి రూరల్: అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలెం, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో బుధవారం కలెక్టర్ వినయ్‌చంద్ పర్యటించనున్నట్లు ఉద్యానశాఖ అధికారి నవీన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొత్తరెడ్డిపాలెంలో నూతనంగా సాగు చేస్తున్న పసుపు, కరివేపాకు చిన్నకొత్తపల్లిలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రైతులు సాగు చేస్తున్న లిల్లీ పూల తోటలను కలెక్టర్ సందర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని ఉద్యానవన పంటలను కలెక్టర్ వినయ్‌చంద్ బుధవారం పరిశీలిస్తారని ఉద్యానశాఖ ఎంపీఈవో బిబిజాన్ మంగళవారం తెలిపారు. ఉదయం యర్రబాలెం పొలాలు, అనంతరం మేదరమెట్లలో షేడ్ నెట్‌లను పరిశీలిస్తారన్నారు.

నేత్రదానం చేయాలి

అద్దంకి టౌన్: నేత్రదానం చేయడం ద్వారా వ్యక్తి చనిపోయినా మరో ఇద్దరికి చూపు నిచ్చిన వారు అవుతారని, ప్రతి ఒక్కరు నేత్రదానం చేయాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగభూషణం అన్నారు. నేత్రదానం పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ఆప్తాల్మిక్ అధికారి జె.ఉమ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కరి సుబ్బారావు, కె.అనంత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌లో పంటల నమోదు చేసుకోవాలి : ఏవో

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకోవాలని ఏవో బి.ప్రసాదరావు తెలిపారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొరిశపాడులో ప్రత్తి పంటలను పరిశీలించారు. 2017-18 సంవత్సరానికి అద్దంకి మార్కెట్ యార్డులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నందున మండలంలో పత్తి సాగు చేసిన రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం శేషారావు, ఎంపీఈవో శ్రీలేఖ, మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ పుల్లారావు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే

అద్దంకి టౌన్: వృద్ధుల జీవతానుభవాలు చిన్నారులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ ఎల్‌ఎం.కృష్ణ అన్నారు. మంగళవారం అద్దంకి రవీంద్రభారతి స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డే జరిపారు ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్ - జయ జానికీ నాయక
శ్రీరామ - అర్జున్‌రెడ్డి
వీఎన్‌ఎస్- వివేకం
మినీవిఎన్‌ఎస్ - నేనేరాజు-నేనేమంత్రి

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - లై

నేటి నుంచి సెయింట్‌ఆన్స్‌లో వర్క్‌షాప్

చీరాల : చీరాలలోని సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధ, గురువారాలలో రెండురోజుల పాటు ఆల్ట్రాసోనిక్ రోబోటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవికుమార్‌లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐఐటీ కరగ్‌పూర్‌వారి సహకారంతో కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ వర్క్‌షాప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని విభాగాధిపతి వి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

- కాలువలను తలపిస్తున్న రోడ్లు
- ఏకమైన వర్షపునీరు..మురుగు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు


చీరాలలో వర్షం నీటితో డ్రైనేజీ పొంగిన రోడ్డు


భవానీపురంలో కాలువగా మారిన రోడ్డు


పిట్టువారిపాలెం రోడ్డుపై నిలిచిన నీరు

చీరాలఅర్బన్/చీరాలరూరల్ : చీరాలలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ప్రధానంగా దండుబాటకు ఇరువైపులా లోతట్టుప్రాంతాలు పలుచోట్ల జలమయం కాగా మరికొన్ని చోట్ల రోడ్లపై, ఇళ్ల మధ్య నీరు నిలిచిపోవటంతో అగచాట్లు తప్పలేదు. జాలమ్మగుడి ఎదురు వాటర్‌ట్యాంక్ పక్క రోడ్డులో డ్రైనేజీ పొంగి పొర్లి వర్షపు నీటితో కలిసి రోడ్డుపై నిలిచింది. విఠల్‌నగర్, వైకుంఠపురం పరిధిలోని లోతట్టుప్రాంతాలలో ఇళ్ళ మధ్య, బలహీనవర్గాలకాలనీ సమీపంలో మోకాళ్ల లోతు నీరు నిలిచింది. దండుబాట అవతల ఉన్న కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని భవానీపురంలో ఇళ్ల మధ్య వర్షపునీరు నిలిచి రాకపోకలకు ప్రజలు అవస్థలు పడ్డారు. అంటురోగాలు వ్యాప్తి చెందుతాయేమోనని ఆయా ప్రాంతాలవాసులు భయాందోళన చెందుతున్నారు. చీరాల మండలం పిట్టువారిపాలెం నడిరోడ్డుపై నిలిచిన వర్షపు నీటితో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. గుంతలో తుఫానుషెల్టర్ శిథిలాలను వేయటంతో నీటిలోపల రాళ్లు తగిలి వాహనచోదకులు కిందపడిపోతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వేటపాలెం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్యాంసన్ సూచించారు. మంగళవారం చల్లారెడ్డిపాలెం పంచాయతీ జగన్నాథపురం కాలనీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని, వేడి పదార్ధాలను తినాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. వైద్యసిబ్బంది అబ్రహం పాల్గొన్నారు.

'సంబరాలలో నేను లేను'

చీరాల : నంద్యాల ఉప ఎన్నిక ఫలితాల నేపథ్యంలో అక్కడ జరిగిన టీడీపీ సంబరాలలో తాను లేనని స్థానిక నాయకుడు మిరియాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

సీఈసీలో విద్యార్థులకు పోటీలు

చీరాల : చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం వచ్చే నెల 15వ తేదీన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఎస్సే రైటింగ్, టెక్నికల్ క్విజ్, పీపీటీ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో తదితర విభాగాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఇంజనీరింగ్‌డే సందర్భంగా బహుమతులు కళాశాల సంయుక్తకార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్ అందజేస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్‌కమాలుద్దీన్ తెలిపారు.

బీమా పథకం చెక్కు అందజేత

వేటపాలెం: పేద ప్రజలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కర్పూరపు రమాదేవి సూచించారు. మంగళవారం సర్వోదయకాలనీలో ఈ పథకం కింద లబ్ధిదారుని కుటుంబసభ్యులకు రూ.5 వేలు నగదు చెక్కును సర్పంచ్ అందజేశారు. కాలనీకి చెందిన కత్తి బంగారమ్మ గుండెపోటుతో మంగళవారం మృతి చెందడంతో తక్షణ సహాయం కింద కుటుంబసభ్యులకు నగదు అందించారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమికి సారం

చీరాల: రైతులు తమ భూములలో ముందస్తుగా పచ్చిరొట్ట పైర్లనుసాగు చేసి భూమిలో కలియదున్నటం ద్వారా కర్బన శాతం పెరుగుతుందని ఏడీఏ కె.రాజకుమారి సూచించారు. మండలంలోని పెర్లవారిపాలెం, కీర్తివారిపాలెంలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం జీలుగపైరు సాగు చేసిన పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజకుమారి పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఫాతిమా, విస్తరణాధికారి ప్రసన్నకుమారి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్యాడర్‌కు ఎమ్మెల్యే ఆమంచి విందు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆమంచి

చీరాల : చీరాల నియోజకవర్గం నుంచి నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొని టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయానికి కృషి చేసిన క్యాడర్‌కు సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ రామాపురం సీబ్రీజ్ రిసార్ట్‌లో విందు ఇచ్చారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండా నమూనాతో చేసిన కేక్‌ను కట్ చేశారు. క్యాడర్‌కు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే పనిలో అంకితభావం ఉంటే ఎప్పుడు సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. అందుకు నంద్యాల ఎన్నికల ఫలితం నిదర్శనమని ఆయన చెప్పారు. తనతో పాటు సుమారు నెలరోజుల పాటు అక్కడే ఉండి ప్రచారంలో పాల్గొన్న టీమ్‌తో త్వరలో గోవా టూర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నమ్మిన సిద్ధాంతం ప్రకారం పనిచేయటం, నమ్మిన వారి కోసం పనిచేయటంలో ఆనందం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వెళ్లి వచ్చిన ప్రతి ఒక్కరితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సర్పంచ్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

వీధి దీపాలు వెలగకపోవటంపై ఆందోళన

చీరాల: తిమ్మసముద్రంలో వీధి దీపాలు తరచూ వెలగటం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారం క్రితం కొత్త దీపాలు వేసినా అవి కూడా మాడి పోయాయి. దీంతో విసుగుచెందిన స్థానిక మహిళలు మంగళవారం సర్పంచ్ కరణం రమేష్‌బాబు ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. రాత్రివేళల్లో విద్యుత్ దీపాలు లేకుండా వీధుల్లో నడవాలంటే కష్టంగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

చీరాల : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం చీరాల పట్టణంలోని అనేక పందిర్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి వాడరేవు సముద్రతీరానికి తరలించారు. వీరరాఘవపేటలోని జైగణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరి వద్ద, పేరాల ముత్యాలపేట బాలవినాయక ఉత్సవ కమిటీ, ర్యాపిడ్ యూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిళ్ల అన్నసంతర్పణ జరిగింది. వీరరాఘవపేటలోని లడ్డూను గోలి నాగేశ్వరరావు రూ.14వేలకు పాడుకున్నారు. ముత్యాలపేటలో లడ్డూను అనిశెట్టి రాంబాబు రూ.22వేలకు పాడుకున్నారు. అనంతరం గణనాథుల ప్రతిమలను ఊరేగింపుగా వాడరేవుకు తరలించారు. కాగా చవితి వేడుకలలో భాగంగా స్థానిక ఫైర్‌స్టేషన్ పక్కను ఏర్పాటు చేసిన శివపార్వతీ సమేత విఘ్నేశ్వరుడికి మంగళవారం తమలపాకులతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆయా ప్రాంతాలలో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వాడరేవు తీరంలో భక్తుల సందడి నెలకొంది. అవాంఛనీయసంఘటనలు జరుగకుండా రూరల్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో తీరప్రాంతంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.


గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలపేట వినాయకుడు


బహుమతులు అందజేస్తున్న అశోక్‌కుమార్

ఘనంగా అల్టస్ స్కూల్‌లో స్పోర్ట్స్‌డే

చీరాల: చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని అల్టస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులను స్కూల్ సంయుక్త కార్యదర్శి తేళ్ల అశోక్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుశీలాకురియాకోస్, డైరెక్టర్ ఎం.ఓ.కురియాకోస్, స్పోర్ట్స్ టీచర్ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతికి పోలీసుల నివాళి

చీరాలటౌన్: చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోంగార్డుగా పనిచేస్తున్న నాగేశ్వరరావు మృతికి పోలీసులు నివాళులర్పించారు. వన్‌టౌన్ సీఐ వి.సూర్యనారాయణ, ఇతర సహచరులు మృతుడి ఇంటికి వెళ్లి అతని కుటుంబసభ్యులను పరామర్శించారు.

చీరాలలో సినిమాలు

థియేటర్	సినిమా
మోహన్	జయ జానకి నాయకా
సంగం	అర్జున్‌రెడ్డి
సాయిప్యాలెస్	వివేకం
శాంతి	నేనే రాజు-నేనే మంత్రి


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, పద్యం, పాటలు పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం పి.జాకబ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలన్నారు. గ్రంథపాలకుడు పి.జానకిరామారావు, నాగేశ్వరరావు, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

దర్శి : బట్టువారిపల్లి, చలివేంద్ర, బండి వెలిగండ్లలో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంచి నీటి ఆర్వోప్లాంట్ల నిర్మాణానికి సంస్థ ప్రతినిధి జీపీఐఈఎస్ఆర్ వైశాలి, సంస్థ డైరెక్టర్ కెఎస్ఆర్ మూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చేందుకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఒక్కొక్క ప్లాంట్‌ను రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని గ్రామాల్లో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ వాకా నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనపై అత్యధికుల మొగ్గు

దర్శి : టీడీపీ పాలనపై 80శాతం మంది ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు చంద్రబాబు పాలన పట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని రుజువు చేశాయన్నారు. ఎన్నికల ప్రచార సభలో జగన్ వాడిన భాషను ప్రజలు అసహించుకున్నారని చెప్పారు. ఆయన తీరు మార్చుకోకపోతే భవిష్యత్‌లో ఆ పార్టీకి పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి ఉండదన్నారు. నంద్యాలలో టీడీపీ అభ్యర్థి 27వేల పైచిలుకు పైగా మెజార్టీతో ఘనవిజయం సాధించడంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం అభినందనలు తెలిపారని చెప్పారు. కాకినాడలో కూడా ఇదే ఫలితాలు సాధిస్తామని ఆయన దీమా వ్యక్తం చేశారు. నంద్యాల, కాకినాడలో 20 రోజులపాటు ఎన్నికల ప్రచారం చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. దర్శి ఎర్రచెరువును మంచినీటి చెరువుగా మార్చేందుకు రూ.60లక్షల విడుదల చేసినట్టు చెప్పారు. దొనకొండలో త్వరలో హెలికాప్టర్ల విడిభాగాలు తయారు చేసే ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు పరిశ్రమ నెలకొల్పడం జరుగుతుందన్నారు. దర్శిలో అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం నిర్మాణం పనులను త్వరలో చేపడతామన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

దర్శి : దర్శి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు.మునగా కోటిరత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మునగా నరసింహారావు, సభ్యులు ఈ సందర్భంగా పాఠశాల తెలుగు పండిట్ లక్ష్మీరాజ్యం, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష వ్యాప్తి చేసేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మునగా నాగేశ్వరరావు, మునగా ఆంజనేయులు, సంఘ సేవకుడు జీవీ రత్నం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా ఉపాధ్యాయరాలిని సన్మానిస్తున్న కోటిరత్నం ఫౌండేషన్ ప్రతినిధులు

దర్శి సినిమాలు

వెంకటేశ్వర	:	ఆనందో బ్రహ్మ
శ్రీనివాస	:	అర్జున్‌రెడ్డి
శివశంకర్	:	జయ జానికి నాయక
భాస్కర్	:	నేనే రాజు నేనే మంత్రి

అభివృద్ధి పనులు వేగవంతం

దర్శి నియోజకవర్గం సమీక్షా సమావేశంలో మంత్రి శిద్దా రాఘవరావు

దర్శి : అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతంగా అమలు చేయాలని రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు తీరును, సంక్షేమ పథకాల అమలను ఆయన సమీక్షించారు. సకాలంలో కాలంలో పనులు పూర్తి చేయని అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి హాజరు కాని ఇరిగేషన్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 61.6 కిలో మీటర్ల సీసీ రోడ్లు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 20 కిలోమీటర్లు పూర్తి అయ్యిందని పంచాయతీరాజ్ డీఈ అప్పారావు తెలిపారు. అంగన్‌వాడీ భవనాలు 18 నిర్మాణం పూర్తి అయ్యాయని వివరించారు. 48 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నియోజకవర్గంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు డిసెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని మంత్రి శిద్దా రాఘవరావు ఆదేశించారు. పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే సహించబోమన్నారు. చంద్రన్న బీమా పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. అక్టోబర్ 10 లోపు కార్పొరేషన్ల ద్వారా వివిధ యూనిట్లు ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి. రవి, ఎఎంసీ ఛైర్మన్ సూరె చినసుబ్బారావు, దర్శి ఎంపీపీ పూసల సంజీవయ్య, దర్శి, ముండ్లమూరు జెడ్పీటీసీలు జి స్టీవెన్, కె. నాగరాజు, దర్శి సర్పంచ్ జీసీ గురవయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు ఎంపీడీవోలు ఆంజనేయశాస్త్రి, రాజేంద్ర, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, తాళ్ళూరు, ముండ్లమూరు, దొనకొండ, కురిచేడు తహసీల్దార్లు కెవీ కృష్ణారావు, బి. గంగాధరరావు, కె.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, దర్శి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వల్లీకుమార్ పాల్గొన్నారు.



మంత్రి శిద్దాను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పేదల సేవే పరమావధి

ముండ్లమూరు : పేదల సేవే పరమావధిగా భావించి టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని, దర్శి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దినట్టు రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు చెప్పారు.ఈదరలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రి శిద్దాను కోరారు. దీనికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం ఎంతో పాటు పడుతుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ మందలపు వెంకట్రావు, మండల టీడీపీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సుంకర రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ నూకతోటి కోటయ్య, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లాం వీరాంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ తూమాటి వీరాంజనేయులు, సర్పంచులు జక్రయ్య, సుబ్బయ్య, ఏడుకొండలు, నిడమానూరి శ్రీనివాసరావు, జిల్లెళ్ళమూడి పార్వతీచౌదరి, ఎంపీటీసీ సభ్యులు జంపాని శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బండి నాగిరెడ్డి ఉన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. ఉదయం నుండి ఆకాశం మేఘావృత్తమై సాయంత్రానికి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వేముల, ఉల్లగల్లు, పసుపుగల్లు, కమ్మవారిపాలెం, బొప్పూడివారి పాలెం, ఈదర, భీమవరం, మారెళ్ల, నాయుడు పాలెం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పులిపాడు, ముండ్లమూరు, వేంపాడు, పోలవరం, శంకరాపురంలో మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో పెసర పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పాఠశాలల తనిఖీ

ముండ్లమూరు : నందమూరినగర్, పలుకురాళ్ళ తండా, కెల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ఇండ్లా శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థవంతంగా విద్యా బోధన చేయాలని సలహా ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించేలా కుకింగ్ ఏజెన్సీలు వ్యవహరించాలని సూచించారు.ఆయన వెంట హెచ్ఎండీవీ రమణారెడ్డి, పూర్ణచంద్రనాయక్ ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ముండ్లమూరు : కంభంపాడు పంచాయతీ పరిధిలోని భట్లపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామానికి చెందిన గుర్రం గౌతమ్, తేలుకుంట్ల కృష్ణ మధ్య జరిగిన ఘర్షణలో గుర్రం గౌతమ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో గౌతమ్ అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేశారు. గ్రామంలో వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఘర్షణ జరిగినట్టు సమాచారం.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న మహిళా సమాతా సొసైటీ సభ్యులు

కురిచేడు : బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ఏపీ మహిళా సమతా సొసైటీ సభ్యులు సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, వైఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వారు ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. పాఠశాలలో లింగ భేదం పనికి రాదన్నారు. బాల బాలికల మధ్య వ్యత్యాసాలను తగ్గించాలని కోరారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో లింగ వివక్ష నిరోధక కమిటీలకు వేశారు. ఈ సమావేశంలో ఏపీ మహిళా సమతా సొసైటీ సభ్యులు విజయ నిర్మల, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

చంద్రన్న బీమా సొమ్ము అందజేత

కురిచేడు : బ్రెయిన్ ట్యూమర్‌తో గంధం సుబ్బారావు అనే వ్యక్తి మృతి చెందడంతో ఆయన భార్య వరమ్మకు మంగళవారం రు.5 వేల రూపాయలను సర్పంచ్ రావి సుబ్బాయమ్మ మంగళవారం అందజేశారు. చంద్రన్న బీమా సభ్యత్వం ఆయనకు ఉండడంతో ఈ సహాయం లభించింది. మరో రు25 వేలు త్వరలో వరమ్మ బ్యాంకు ఖాతలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో బీమా మిత్ర ప్రసూన పాల్గొన్నారు.



చంద్రన్న బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్ రావి సుబ్బాయమ్మ



సందువారిపాలెంలో గణేషుని విగ్రహాన్ని సందర్శించిన మంత్రి శిద్దా రాఘవరావు

గణేష్ విగ్రహానికి పూజలు

దర్శి : దర్శిలో నెలకొల్పిన గణేష్ విగ్రహాలను రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు దర్శించుకొని పూజలు చేశారు. సందువారిపాలెం, రామాలయం, బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహాల వద్దకు వెళ్ళి పూజలు చేశారు. వినాయకస్వామి ప్రజలకు అన్నివిధాల మేలు చేకూర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సూరె చినసుబ్బారావు, ఎంపీపీ పూసల సంజీవయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జి స్టీవెన్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, దర్శి సర్పంచ్ జీసీ గురవయ్య, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

మంత్రి శిద్దాకు సన్మానం

నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొని ఘన విజయానికి విశేష కృషి చేసిన మంత్రి శిద్దా రాఘవరావును దర్శి టీడీపీ నాయకులు మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు.అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి శిద్దా ను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎఎంసీ ఛైర్మన్ సూరె చిన సుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు నారపుశెట్టి పిచ్చయ్య సన్మానించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

దొనకొండ : మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిధులు దుర్వినియోగంపై జిల్లా ట్రెజరీ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం విచారణ చేశారు. దర్శి ట్రెజరీలో నిధులు స్వాహా అనే శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. 2012 నుంచి 2015 వరకు ఇద్దరు విద్యా శాఖాధికారుల ఆధ్వర్యంలో భోజన పథకం నిధులు లక్షల్లో స్వాహా జరిగినట్లు సమాచారం. ఒంగోలు అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు పి.లక్ష్మీనారాయణ, షేక్ హసీనాబేగం మండల విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. దీనిపై నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

● ముండ్లమూరు ఏవో జెడ్. శ్రీధర్

ముండ్లమూరు : రైతులు పత్తి పైరుకు విచ్చలవిడిగా పురుగుమందులు వాడడం వల్ల దిగుబడి తగ్గడమే కాకుండా రైతుకు అధిక నష్టం ఏర్పడుతుందని జెడ్ శ్రీధర్ అన్నారు. పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన పత్తిపంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతులు ప్రధానంగా పత్తిపంటలో గులాబి రంగు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసినట్లయితే రైతుకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కిషోర్ పాల్గొన్నారు.

దొనకొండ : రసాయనిక ఎరువులను అధికంగా వాడకూడదని ఏవో ఎశైలజారాణి సూచించారు. యర్రబాలెం, నరసింహనాయునిపల్లెలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పురుగుల మందులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రసీదులు పొందాలని సలహా ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై అందజేసే వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈవో శివసుధాకర్ పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శైలజారాణి



మిలీనియం మార్చ్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఒకటిన మిలీనియం మార్చ్

దర్శి : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన విజయవాడలో నిర్వహించనున్న మిలీనియం మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై చౌడిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో మిలీనియం మార్చ్‌ వాల్‌పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడంతో ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ దర్శి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. గోవిందయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమనపల్లిలో రెవెన్యూ సదస్సు

దొనకొండ : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు సూచించారు. భూమనపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు,వీఆర్వో వై హుస్సేన్ పాల్గొన్నారు.

ఆనంద ఆశ్రమానికి వస్తువుల వితరణ

దొనకొండ : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వెలసిన ఆనంద ఆశ్రమానికి దాతలు మంగళవారం వివిధ వస్తువులను అందజేశారు. ఆరవల్లిపాడుకు చెందిన మక్కెళ్ల వెంకటేశ్వర్లు తన తండ్రి జ్ఞాపకార్థం 60 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, 3 సిమెంట్ బల్లలను బహూకరించారు. దాత వెంకటేశ్వర్లును ఆదర్శంగా తీసుకోవాలని ఆశ్రమ ధర్మకర్త భైరవానందస్వామి విజ్ఞప్తి చేశారు.

అన్నదమ్ముల ఘర్షణ

దొనకొండ : అన్నతమ్ముళ్ళ మధ్య ఘర్షణ జరగడంతో అన్నకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పుచ్చకాయలపల్లెలో మంగళవారం జరిగింది. ఎస్ఐ కె.అజయ్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పుచ్చకాయల రాజారావుకు చెందిన మోటార్ సైకిల్‌ను తమ్ముడు వెంకటేశ్వర్లు చందవరం గ్రామానికి తీసుకెళ్లాడు. ఎదురుపడిన రాజారావు మోటార్‌సైకిల్ ఇవ్వమని అడగడంతో మనస్థాపానికి గురైన తమ్ముడు గ్రామంకు చేరుకున్న తరువాత అన్న రాజారావుపై దాడిచేశాడు. అన్న ఇంట్లోని వస్తువులు ధ్వంసంచేశాడు. రాజారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈదరకు మద్దతుగా నాలుగు సొసైటీల అధ్యక్షుల రాజీనామా

కురిచేడు : డీసీసీబీ చైర్మన్ ఈదర మోహన్ రాజీనామాకు మద్దతుగా కురిచేడు, దొనకొండ మండలాల్లో నాలుగు సొసైటీల అధ్యక్షుళ్ళ మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు. కమిషనర్ వేధింపులు తాళలేక రాజీనామా చేసిన ఈదర మోహన్ తమ నేత అని వారు పేర్కొన్నారు. ఆయనకు కష్టం వస్తే తమకు వచ్చినట్టే భావించి రాజీనామా చేశామన్నారు. రాజీనామా చేసిన వారిలో కురిచేడు, పడమరవీరాయపాలెం, నమశ్శివాయపురం సొసైటీల అధ్యక్షులు కమతం నాగిరెడ్డి, మక్కెన లక్ష్మీనారాయణ, బొల్లేపల్లి వెంకటేశ్వర్లు, దొనకొండ మండలం పడమర కంభంపాడు సొసైటీ అధ్యక్షుడు కన్నెదార వెంకట సుబ్బయ్య ఉన్నారు. రాజీనామా విషయాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు దామెచర్ల జనార్దన్, అటవీ శాఖా మంత్రి శిద్దా రాఘవరావు దృష్టికి తెలియజేసినట్టు వారు తెలిపారు. రాజీనామా లేఖల కాపీలను సైతం వారికి పంపినట్లు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

కురిచేడు : ఓ ప్రేమ జంట పెండ్లి చేసుకుని రక్షణ కోసం కురిచేడు పోలీసులను ఆశ్రయించింది. కురిచేడుకు చెందిన శ్రీరామ రత్తయ్య, త్రిపురాంతకం డీవీయన్ కాలనీకి చెందిన మేండ్రగుత్తి నాగరమణ బావా మరదళ్ళు. వీరిద్దరూ సోమవారం ఉదయం సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. అయితే అమ్మాయి తల్లిండ్రుల నుంచి ముప్పు ఉందన్న ఉద్దేశంతో వారిద్దరూ కురిచేడు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కిశోర్‌బాబు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏమైనా ఇబ్బందులు వస్తే తనను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.



పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

అనంతవరంలో భూముల పరిశీలన

దొనకొండ : ఎస్సీలకు భూమి కొనుగోలు పథకాన్ని అమలు చేయడానికి తహసీల్దార్ వెంకటేశ్వర్లు మంగళవారం భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతవరం గ్రామానికి చెందిన ఎండ్లూరి నాగమణి, ఎండ్లూరి అనితజ్యోతి, ఎండ్లూరి సోనీలు భూమి కొనుగోలు పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ఆదేశాల మేరకు తహసీల్దార్ గ్రామంలోని 77/1,2 లోని 7.73 ఎకరాల పట్టా భూమిని అందుకు సంబంధించిన పూర్తి రికార్డు పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ రాజేష్, సర్వేయర్ సీహెచ్ వెంకటరావు పాల్గొన్నారు.

తాళ్లూరు పీహెచ్‌సీ తనిఖీ

తాళ్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ బృందం మంగళవారం సందర్శించింది. కేంద్ర వైద్యశాఖ ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాల అమలు తీరుపై ఆరా తీసింది. కుటుంబ సంక్షేమ ఆపరేషన్ల తీరును పరిశీలించింది. కు.ని ఆపరేషన్లు చేయించిన వారికి ప్రోత్సాహక నగదు సరిగా అందుతుందా? లేదా అని బృంద సభ్యులు పరిశీలించారు. స్థానిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు. వైద్యశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుబ్బలక్ష్మి, బృందం సభ్యులు సురేష్‌బాబు ఉన్నారు.

సందడిగా నిమజ్జనోత్సవం

తాళ్లూరు : వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తూర్పుగంగవరంలో రెండు, వెలుగువారిపాలెం,మన్నేపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో గణనాథులను ప్రత్యేకవాహనాల్లో కొలువుదీర్చి ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వి.మహేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మృతి

దొనకొండ : మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు బండారు వెంకటరమణ(60) చందవరంలోని స్వగృహంలో మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ నాగులపాటి గాలెమ్మ,శివకోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, పత్తి వెంకటేశ్వర్లు యగ్గిని యల్లారెడ్డి, బత్తుల బ్రహ్మయ్య రమణ కుటుంబాన్ని పరామర్శించారు.



పెద ఉల్లగల్లులో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా నిమజ్జనోత్సవాలు

ముండ్లమూరు : పెద ఉల్లగల్లు బీసీ కాలనీ, తమ్మలూరు, అగ్రహారం, ఈదర, వేముల, కెల్లంపల్లి, భట్లపల్లి, నూజిళ్ళపల్లి, సుంకరవారిపాలెం, మారెళ్ళలో మంగళవారం వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వినాయక విగ్రహాలను గ్రామ పురవీధుల్లో భక్తులు ఊరేగించారు. ఈ సందర్భంగా యువకులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గుండ్లకమ్మ, చిలకలేరు వాగు సమీపంలో చెరువులో విగ్రహాలను ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాళ్లూరు ఎస్ఐ వి మహేష్, ఏఎస్ఐలు డి ఎలీషా, జాన్‌పీటర్, హెడ్ కానిస్టేబుల్ లంకా రాములు బందోబస్తు నిర్వహించారు.

ఈదరలో వైద్య పరీక్షలు

ముండ్లమూరు : ఈదర గ్రామంలో 235 మందికి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విషజ్వరాలు సోకడంతో గ్రామస్థులు మంచం పట్టిన సంగతి తెలిసినదే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి. వెంకట్రావు తెలిపారు. వారిలో 15 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మిగత వారికి కీళ్ళనొప్పులు ఉన్నట్టు తెలిపారు. జ్వరాలు తగ్గే వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి బ్రహ్మానందం, వైద్యాధికారి నాగరాజు, హెల్త్ హెడ్‌కేటర్ హుస్సేన్‌బీ పాల్గొన్నారు.

ప్రగతి పనులే గెలిపించాయి

దొనకొండ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే నంద్యాలలో టీడీపీ విజయానికి సోపానాలుగా నిలిచాయని మండల టీడీపీ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన సందర్భంగా యర్రబాలెం ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల బ్రహ్మయ్య, మరి కొందరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సంబరాలు

నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భారీ మెజార్టీ సాధించడంతో నరసింహనాయునిపల్లె గ్రామ టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ కొత్తం కోటిరెడ్డి కుమారుడు కొత్తం రమనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లోని కోటిరెడ్డి కాంప్లెక్స్‌లో భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మకాయల సుబ్బారెడ్డి, శృంగారపు రామసుబ్బారెడ్డి, నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
4
కందుకూరు
ప్రకాశం ● బుధవారం 30 ఆగస్టు 2017
కందుకూరు | లింగసముద్రం | గుడ్లూరు | ఉలవపాడు | వలేటివారిపాలెం

పొగాకు రైతులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు

వలేటివారిపాలెం: పొగాకు రైతులకు సకాలంలో డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాలకొండ దేవస్థానం ఛైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి తెలిపారు. ఈ నెల 4వ తేదీన పొగాకు అమ్మిన రైతులకు ఇప్పటికీ డబ్బులు రాలేదన్నారు. వాస్తవానికి పొగాకు అమ్మిన 15 రోజులు అంటే ఈ నెల 19వ తేదీన బ్యాంకుల్లో డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకు రైతులకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. సంబంధిత అధికారులు సకాలంలో పొగాకు రైతులకు డబ్బులు ఇవ్వాలని ఆయన కోరుతున్నారు.

చీమలపెంటలో తాగునీటికి ఇక్కట్లు

పథకాలు రెండైనా ప్రయోజనం శూన్యం

మరమ్మతులకు గురైన మంచినీటి పథకం

మూడేళ్ళ నుంచి సరఫరా కాని నీరు

లింగసముద్రం: మండలంలోని చీమలపెంటలో గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం నుంచి, స్థానిక మన్నేరులోని మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇటు తాగునీటికి అటు వాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మంచి నీరును అందించేందుకు రెండు పథకాలు ఉన్నప్పటికి అవి ప్రయోజనం లేకుండా పోయాయని గ్రామస్థులు ఆందో ళన చెందుతున్నారు. గ్రామానికి తాగునీరందించే మన్నేరులోని మంచినీటి పథకం 5రోజుల క్రితం మరమ్మత్తులకు గురైంది. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం ద్వారా తాగునీరందించే మంచినీటి ట్యాంకు నుండి గడిచిన రెండు మూడు సంవత్సరాల నుంచి నీటి సరఫరా నిలిపి వేశారని వారు చెప్పారు. మంచినీటి ట్యాంకు సమీపంలో ఉన్న వాల్వ్ నుంచి ట్యాంకులోకి నీరు ఎక్కించే పైపును డమ్మి చేసి నీటి సరఫరాను నిలిపివేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్థులు మంచినీటికి నానా అగచాట్లు పడుతున్నారు. మంచినీటి ట్యాంకు నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు


నిరుపయోగంగా గ్రామంలో మంచినీటి ట్యాంకు

నిర్వాహకులకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం గ్రామంలో రెండు బోర్లే గ్రామస్థులకు ఆధారమయ్యాయని వారు వాపోతున్నారు. ఈ బోర్ల నుంచి కూడా చాలా సేపటికిగాను నీరు బిందె నిండా రావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రెండు పథకాల నుంచి మంచినీటి సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


వాల్వ్ నుంచి ట్యాంకుకు నీటి సరఫరా చేసే పైపును తొలగించిన దృశ్యం


అలంకారంగా మంచినీటి పంప్‌హౌస్


రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా అధికారులు

ఉపాధిహామీ రికార్డులను తనిఖీ చేసిన డ్వామా అధికారులు

లింగసముద్రం: 2015-16 నుంచి 2017-18 ఆర్థిక సంవత్సరాలలో మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల రికార్డులను డ్వామా అధికారులు తనిఖీ చేశారు. మంగళవారం డ్వామా అధికారులు ఏపీడీ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ కామేశ్వరరావులు లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కందుకూరు ఏపిడి మస్తాన్‌రావు, స్థానిక ఏపిఓ నాగరాజుల సమక్షంలో ఈ రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏపిడి మస్తాన్‌రావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలకు సంబంధించి ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల రికార్డులను త్వరలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారులు తనిఖీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ మూడు సంవత్సరాలలో ఖర్చు చేసిన నిధులకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలన కోసం ప్రస్తుతం తనిఖీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

గృహనిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

వలేటివారిపాలెం: గతంలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రీ ఎన్టీఆర్ గృహలకు ప్రభుత్వం అదనంగా 25వేల రూపాయలు ఇవ్వనున్నట్లు గృహ నిర్మాణశాఖ డీఈ జయరావు తెలిపారు. వలేటివారిపాలెం గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 5 మండలాల్లో బేస్‌మెట్ స్థాయిలో 353 గృహాలు, లింటల్ మరియు స్లాబు స్థాయిలో 294 గృహాలు అసంపూర్తిగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఆ గృహాలకు అప్పటి యూనిట్ విలువ కంటే అదనంగా 25వేలు ప్రభుత్వం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు నూకవరం ఎస్సీ కాలనీలో గ్రామసభ

వలేటివారిపాలెం: మండలంలోని నూకవరం ఎస్సీ కాలనీలో ఈ నెల 31వ తేదీ గురువారం సమస్యలపై గ్రామసభ జరుగనున్నట్లు తహసీల్దార్ ఎస్‌వి సుబ్బారావు తెలిపారు. ఆ సభలో సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు ఆయన చెప్పారు. ఆ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

సీఎం చేస్తున్న అభివృద్ధే నంద్యాలలో గెలిపించింది

● **మాజీ ఎమ్మెల్యే దివి శివరాం**

లింగసముద్రం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షించి నంద్యాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డికి ప్రజలు పట్టం కట్టారని కందుకూరు మాజీ శాసనసభ్యులు డా.దివి శివరాం చెప్పారు. లింగసముద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఆయన గ్రామ టిడిపి నాయకులు అడపా రాజారావు మృతి చెందడంతో ఆయన భార్య గీతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మం జూరైన 15వేల రూపాయల విలువైన చెక్కును అం దజేశారు. ఈ సందర్భంగా ఈ డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గీతకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో గెలుపు చంద్రబాబుదేనని చెప్పారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి సంక్షేమానికి ప్రజలు ఆకర్షితులై బ్రహ్మానందరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. 2019 ఎన్నికల్లోనూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని శివరాం భీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, కొండా బాలచెన్నయ్య, సయ్యద్ నాయబ్‌ర సూల్, మాజీ ఎంపీపీ బాలకోటయ్య, మాలకొండ ట్రస్టు బోర్డు దేవకి సుబ్రమణ్యం, టిడిపి నాయకులు నీలం బ్రహ్మారెడ్డి, తాళ్లూరి మునలయ్య, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, అడపా క్రిష్ణ,పంగా రమణారెడ్డి, మాజీ ఎంపిటీసి బింకం శేషయ్య, జి బాలనారాయణ, ఉప్పుటూరి రమణయ్య, గంగాడి మోహన్‌రావు, కూరపాటి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరాం

వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఎంపీఈఓలే కీలకం : ఏడీఏ నాగరాజు

కందుకూరు: వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆధునిక సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడటంతో పాటు వ్యవసాయంలో రైతులకు మెళకువలు నేర్పించటంలోను ఎంపిఇఓలదే కీలకపాత్ర అని కందుకూరు ఎడిఏ నాగరాజు పేర్కొన్నారు. కందుకూరు, కనిగిరి, సింగరాయకొండ సబ్ డివిజన్‌లలోని ఎంపిఇఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక డ్వామా కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. ఎడిఏ నాగరాజు మాట్లాడుతూ రైతులతో నేరుగా సత్సంబంధాలు కలిగి ఉండటంతో పాటు ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేయటానికి ఆసక్తి చూపే రైతులను ప్రోత్సహించటం ద్వారా వారి ప్రేరణతో మరికొందరు ఆ బాటలో పయనించేలా చూడాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల కలిగే ఉపయోగాలు, అధునాతన యంత్ర పరికరాల వినియోగంతో పాటు భూసార పరీక్షలు ఆధారంగా ఎరువుల వినియోగం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఒంగోలు భూసార పరీక్ష కేంద్రం ఎడిఏ నిర్మలాకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది వివిధ మండలాలకు కేటాయించిన మట్టి నమూనాలను సేకరించేటప్పుడు ఎంపిఇఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భవిష్యత్తులో సూక్ష్మ పోషకాలను భూసార పరీక్షల ఆధారంగా సరఫరా చేయనున్నందున ఎంపిఇఓలు రైతులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు భూసార పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. పొన్నలూరు, కందుకూరు, ఉలవపాడు ఎఓలు జి. కిషోర్‌బాబు, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న హెచ్‌ఎం బాలాజీ

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

లింగసముద్రం: మండలంలోని విఆర్‌కోట జడ్పీ హైస్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మంగళవారం హైస్కూల్ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తన్నీరు బాలాజీ మాట్లాడుతూ తేనెలతేటల మాటల తెలుగుభాష ఎంతో మధురమైనదని ఆయన అన్నారు. గిడుగు రామమూర్తి జన్మదినం సందర్భంగా తెలుగుభాషా దినోత్సవంను నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ప్రముఖ కవి, విమర్శకులు గుడ్లూరు వెంకన్న మాట్లాడుతూ తెలుగుభాష ఔన్యత్యాన్ని విద్యార్థులు కాపాడాలని ఎన్నీ భాషలు నెర్చుకున్నా మాతృభాషను మరువరాదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యపఠన పోటీలు జరిపి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, సుధాకర్, వంకాయలపాటి మాల్యాద్రి, ప్రభుకుమార్, రామ్మూర్తి, శ్యాంసుధాకర్, జనార్ధన్, నరసింహరావు, బషీర, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జన

లింగసముద్రం: వినాయ కచవితి పండుగ సందర్భంగా మండలంలో 5వ రోజున వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వ హించారు. మంగళవారం లింగసముద్రం, వెంగళాపురం, రా ళ్లపాడు తదితర గ్రామాలలో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను నిర్వాహకులు ట్రాక్టర్లపై ఉంచి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు ని ర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. అనంతరం విగ్రహాలను రాళ్ళపాడు ప్రాజెక్టు కొత్తస్పిల్‌వేలోని గైడ్‌బండ్‌లో నిమజ్జనం చేశారు.


విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

● సినిమాలు

కందుకూరు

రాజ్ - ఫిదా
యువరాజ్ - ఆనందోబ్రహ్మ
ప్రశాంతి - వీఐపీ-2
కోటేశ్వర - నేనే రాజు నేనే మంత్రి
రాఘవ స్క్రీన్-1 - వివేకం
రాఘవ స్క్రీన్-2 - అర్జున్‌రెడ్డి, జయ జానకి నాయక

ఆర్చరీ పోటీల్లో నేషనల్ మెడల్ అందజేత

లింగసముద్రం: వాకమళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన గొర్రెపాటి మణిదీప్‌రెడ్డి ఆర్చరీ పోటీల్లో అం డర్-14 విభాగంలో నేషనల్ మెడల్ సాధించాడు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయక్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని మణిదీప్ రెడ్డికి కడప స్పోర్ట్సు స్కూలు అధికారులు ఈ పతకాన్ని అందజేశారని మణిదీప్‌రెడ్డి తండ్రి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.


మెడల్ అందుకుంటున్న మణిదీప్

సమస్యల ఏకరువు - పరిష్కారానికి అధికారులకు ఆదేశం

● జి.మేకపాడు, మాచవరంలలో ఎమ్మెల్యే పోతుల పర్యటన

కందుకూరు: మండలంలోని జి. మేకపాడు, మాచవరం గ్రామాలలో ఎమ్మెల్యే పోతుల రామారావు మంగళవారం పర్యటించారు. గ్రామస్తులతో సమా వేశాలు ఏర్పాటు చేసి వారి నుండి సమస్యలు తెలుసుకోగా రెండు గ్రామాలలోను ప్రజలు పెద్ద ఎత్తున సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అత్యవసర సమస్యల పరిష్కారానికి తక్షణం అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఎమ్మెల్యే ఫించన్లు, నివాస స్థలాల పట్టాలు లాంటి సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జి. మేకపాడులో ప్రధానంగా తాగునీటి సమస్యపై గ్రామప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కనిగిరి సమీపంలోని పునుగోడు ట్యాంకు నుంచి మా గ్రామానికి తాగునీరు సరఫరా జరిగేదని, ఇటీవల నూతన డీఈ బాధ్యతలు చేపట్టాక ఆ నీటిని నిలిపివేశారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తేగా తక్షణం నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఇఇని ఎమ్మెల్యే కోరారు. గ్రామంలో ఎక్కువశాతం మంది రైతులకు అసైన్ మెంటు భూములు ఉన్నాయని, మరికొంతమంది పట్టాలు లేకున్నా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నందున సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇప్పించటంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొందరి భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాగా కొందరివి కాలేదని చెప్పగా సమస్యపై ఆర్డీఓతో చర్చించారు. అక్కడి భూములపై విచారణ జరుగుతోందని, విచారణ అనంతరం అర్హులందరికీ న్యాయం చేస్తామని ఆయన వివరించారు. ఎమ్మెల్యే పోతుల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అధికంగా ఉండటంతో పాటు విస్తారంగా మెట్ట భూములు ఉన్నందున పంట సంజీవని కుంటలు ప్రతి రైతు రెండు మూడు తవ్వించుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయని రైతులకు సూచించారు. ఇటువంటి అవకాశం మరలా రాదని, ప్రభుత్వ ప్రాధాన్యాలు, కార్యక్రమాలు మారిపోతుంటాయని వివరించిన ఎమ్మెల్యే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంట సంజీవని కుంటలు తవ్విం చుకోవాలన్నారు. అనంతరం మాచవరంలో ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు గ్రామంలో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని, పారిశుధ్యం నిర్వహణ సరిలేదని ఫిర్యాదు చేశారు. వృద్ధాప్య పింఛన్లు, నివాస స్థలాల పట్టాల కోసం అధికసంఖ్యలో అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండునెలల్లో ఫించన్లు రానున్నం దున అర్హులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. మాజీఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఎంపీపీ సలహాదారు గుళ్లా శ్రీనివాసరావు, నార్నె రోశయ్య, సుబ్బారెడ్డి, రమణయ్య, జయచంద్రారెడ్డి, శ్రీను, ఎంపిడిఓ జి.హనుమంతరావు, ఇన్‌ఛార్జ్ తహసిల్ధార్ వీరారెడ్డి, ఎంఇఓ రాంబాబు, ఎఓ అబ్దుల్ రహీం, హెచ్ఓ శ్రీనివాసరావు, ఎఇఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


జి.మేకపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోతుల రామారావు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పీరారెడ్డి

ఎన్టీఆర్ వైద్యసేవపై అవగాహనా కార్యక్రమం

కందుకూరు: స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ, ఆరోగ్య రక్ష, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంలపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎన్టీఆర్ వైద్యసేవ డివిజనల్ కో ఆర్డినేటర్ కందుల పీరారెడ్డి మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఎన్టీఆర్ వైద్యసేవకు అర్హులేనని తెలిపారు. తెల్లరేషన్ కార్డులేనివారు ఏడాదికి రూ. 1200 చొప్పున మీ సేవ కేంద్రాలలో ఆరోగ్య రక్ష కార్డు పొంది 1044 రకాల వ్యాధులకు సంబంధించి కుటుంబంలోని ప్రతివ్యక్తి 2 లక్షల వరకు వైద్యసేవలు పొందవచ్చునని వివరించారు. ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కూడా వరమని తెలిపారు. ఈ సౌకర్యాలను అన్నివర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


చంద్రన్న బీమా చెక్కు అందజేస్తున్న దృశ్యం

చంద్ర్రన్న బీమా ఆర్థిక సహాయం అందజేత

కందుకూరు: మండలంలోని పందలపాడు గ్రామంలో వివాహిత పిల్లిపోగు సుజాత అకస్మాత్తుగా మృతిచెందటంతో చంద్రన్న బీమా పథకం కింద మట్టి ఖర్చుల కోసం 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలి భర్త పిల్లిపోగు జీవరత్నంకు మంగళవారం ఈ మొత్తాన్ని గోచిపాతల మోషే చేతుల మీదుగా అందజేశారు. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు వర్ల కోటేశ్వరి, బీమా మిత్ర స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయక నిమజ్జనోత్సవం

కందుకూరు: వినాయక నిమజ్జనోత్సవాలు మంగళవారం వేడుకగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు అధికసంఖ్యలో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. కందుకూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోని విగ్రహాలను ప్రత్యేక వాహనాలలో పాకల సముద్ర తీరానికి నిమజ్జనానికి తీసుకెళ్లారు. యువకులు ఉత్సాహంగా గులాంలు చల్లుకుంటూ గణేష్ మహరాజ్‌కి జై అంటూ తరలివెళ్లగా మహిళలు సైతం పెద్ద సంఖ్యలో గులాంలు చల్లుకుంటూ ఉత్సాహంగా గణనాథుని వెంట సముద్రస్నానాలకు తరలివెళ్లారు. గణేషుని నిమజ్జనోత్సవంలో పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు.


నిమజ్జనోత్సవానికి తరలివెళ్తున్న గణనాథుడు

బాధ్యతారహితంగా పనిచేస్తే కఠిన చర్యలు

● ఆర్డిఓ మల్లికార్జునరావు

వలేటివారిపాలెం: బాధ్యతారహితంగా పనిచేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని కందుకూరు నియోజకవర్గ స్పెషలాఫీసర్, ఆర్డిఓ మల్లిఖార్జునరావు తెలిపారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాత్రి 8 గంటల సమ యంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశానికి నియోజకవర్గంలోని 5 మండలాలలోని అన్నీ శాఖల మండల స్థాయి అధి కారులందరూ హాజరయ్యారు. ఆ సమావేశంలో స్పెషలాఫీసరు మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆయా శాఖాధికారులందరూ తమ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులందరూ సహకరించాలన్నారు. బాధ్యతా యుతంగా పనిచేయని అధికారులందరికి కలెక్టర్ మెమోలు జారీ చేస్తున్నారని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను వేగవంతం చేయకుండా కుంటిసాకులు చెప్పవద్దని చెప్పారు. ప్రతి మంగళవారం జరిగే నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరైతే ఎంపిడిఓలే బాధ్యత వహించాలని చెప్పారు. నియోజకవర్గంలో జరిగే సమావేశానికి ఈసారి కలెక్టర్ హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు. పలు మండలాల్లో శ్మశానాలు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు, ఆటస్థలాలు, డంపింగ్ యార్డులు, గృహనిర్మాణాలు, సిమెంటు రోడ్లు తదితర అభివృద్ధి పనులు ప్రారంభిం చకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నియో జకవర్గంలోని 5 మండలాల్లో ప్రభుత్వ పథకాల ప్రోగ్రేస్‌ను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో 85 కిలోమీటర్లకు సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైతే 5 కిలోమీటర్లు కూడా పనులు చేయకపోవడంతో అధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ విజయ్‌శేఖర్, తహసీల్దార్ సుబ్బారావు, గృహనిర్మాణశాఖ డిఈ జయరావు, నియోజకవ ర్గంలోని 5 మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్‌లు, మండల స్థాయి అధికారులందరూ హాజరయ్యారు.


మాట్లాడుతున్న స్పెషలాఫీసర్, ఆర్డీవో మల్లికార్జునరావు


టీఆర్ఆర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కందుకూరు: తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు విద్యా సంస్థలలో గిడగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల తెలుగు భాషపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.విజయశ్రీ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాచవరం ఎస్‌టి కాలనీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు శతక పద్య కంఠస్థ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వలేటివారిపాలెం: మండలంలోని నందలపూరు హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా మాతృభాష దినోత్సవాలు, జాతీయక్రీడా దినో త్సవాలు జరిగాయి. గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ సేవలను కొనియాడారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

సంతాన సాఫల్యతకు ఉచితవైద్యశిబిరం

కందుకూరు: సంతానం లేని దంపతులకు మణిపాల్ ఫర్టిలిటీ సంతాన సాఫల్య హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 31న కందుకూరులో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ పిఆర్ఓ జివి సూర్యప్రకాష్ మంగళవారం తెలిపారు. స్థానిక పామూరు బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మీతేజ డాక్టర్స్ కన్సల్టెన్సీ నందు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరం నందు వైద్యపరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్, అడ్వాన్స్‌డ్ సెమన్ అనాలసిస్ ఉచితంగా చేయబడునని తెలిపారు. ఈ అవకాశాన్ని కందుకూరు ప్రాంత దంపతులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9000612330 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పాఠశాలల్లో ఘనంగా క్రీడా దినోత్సవం

కందుకూరు : పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే క్రీడాదినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక సంస్కృతి పాఠశాలలో కరస్పాండెంట్ కాటూరి కిరణ్ ఆధ్వర్యంలో క్రీడాదినోత్సవ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పట్టణంలోని కోవూరు రోడ్డు, పామూరు రోడ్డు, కోటారెడ్డినగర్‌లలోని శ్రీచైతన్య పాఠశాలల బ్రాంచిలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మోడరన్ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ నల్లూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్‌కి నివాళులర్పించి క్రీడాపోటీలు నిర్వహించారు. రవీంద్రభారతి పాఠశాలలోను, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలోను జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిడి మండవ ఆంజనేయులు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టిఆర్ఆర్‌లో క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుండటంతో పాటు అన్నిరకాల క్రీడా సామాగ్రి, సదుపాయాలు ఉన్నందున విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దలను గౌరవించడం సంప్రదాయం

సింగరాయకొండ : పెద్దలను గౌరవించడం మన సంప్రదాయమని రవీంద్రభారతి ఒలింపియాడ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎంవీ అర్జునరావు తెలిపారు. రవీంద్రభారతి ఒలింపియాడ్ స్కూల్‌లో మంగళవారం గ్రాండ్ పేరెండ్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తాత, అమ్మమ్మ, నాన్నమ్మల బంధాలను తెలియజేశారు. వారిపట్ల చిన్నారులు ప్రేమగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం పట్టదా?

వసతి గృహాల సంక్షేమాధికారుల సమీక్షలో స్వామి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

కొండపి: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల అధికారులై ఉండి విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం దారుణమని ఎమ్మెల్యే డా.డోలాశ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమీక్షా సమావేశం హాలులో కందుకూరు సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.కృపారావు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారుల పరిపాలన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జరుగుమల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో సోమవారం వార్డెన్ మెనూను ఎందుకు అనుసరించలేదో? తెలపాలన్నారు. సోమవారం కోడిగుడ్లు ఎందు కిచ్చారని వార్డెన్‌ను అడి గారు. కోడి గుడ్లు ఆదివారం రానందున సో మవారం ఇచ్చామని ఆమె తెలిపారు. దీంతో ఎమ్మెల్యే మిగతా హా స్టల్స్‌కు వస్తే మీకెం దుకు రాలేదు? రాకపోతేపై అధికారులకు విషయాన్ని తెలిపారా? అని ప్రశ్నించారు. ఒక రోజు ముందుగానే మెనూ ప్రకారం కావల్సిన సరుకులు ఉన్నాయా? లే దా? చూసుకోవద్దా? అని నిలదీశారు. పోనీ సోమవారం అయినా కోడిగుడ్డు బిర్యానీ ఇ వ్వాలి కదా? కోడిగుడ్డును రెండుగా చేసి సాంబారులో, క్యాబేజీ కూరలో కలిపి ఇస్తారా? ఇలానా మెనూ పాటించేది అని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. మీలో హాస్టల్స్‌లో ఉండి చదువుకున్నవారు ఎందరని ఎమ్మెల్యే అనగా సగానికి పైగా వార్డెన్‌లు చేతులెత్తారు. మరి గతంలో హాస్టల్స్‌లో ఉండే ఇబ్బందులు మీకు తెలుసు కదా? ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నా హాస్టల్స్‌ను ఎందుకు సక్రమంగా ఎందుకు నడపలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో 9 హాస్టల్స్ ఉన్నాయి. విద్యార్థులు లేకపోతే హాస్టల్స్‌ను ప్రభుత్వం రద్దు చేస్తుంది. మర్రిపూడిలో హాస్టల్‌ను పోగొట్టుకున్నాం. శింగరాయకొండ, కొండపిలలో డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, బీఈడీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలున్నా విద్యార్థులు ఎందుకు నమోదు కావడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. హాస్టళ్లను తీసుకొస్తుంటే సక్రమంగా నిర్వహించకపోతే ఉపేక్షించనన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని, హెచ్చరించారు. హాస్టళ్లలో ఖాళీలు ఎందుకు భర్తీ కావడం లేదో అవలోకనం చేసుకోవాలని సూ చించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ రామయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాలను ప్రభుత్వ ఉద్ధేశ్యాలకు అను గుణంగా నడపాలని సూచించారు. ఎంపీపీ దేపూరి రత్తమ్మ మాట్లాడుతూ విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి వసతి గృహాలను నడపాలని, మన బిడ్డ వేరే ప్రాంతంలో చదువుతుంటే, మనం వారి వసతులపై ఆరా తీస్తాం కదా? అలాగే ఎవరైనా తమ బిడ్డల సంక్షేమం గూర్చి తెలుసుకుంటారని హాస్టల్స్‌లో విద్యార్థుల సంక్షేమం గుర్తెరిగి వార్డెన్‌లు నిర్వహించాలన్నారు.

సమావేశంలో ఎంపీడీవో ఎ. ప్రభాకరరావు, ఎంఈవో కె. సురేఖ, నియోజకవర్గంలోని హాస్టల్స్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

పెరిదేపి (కొండపి): మండలంలోని పెరిదేపి గ్రామంలో పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రైతులకు వ్యవసాయాధికారులు శిక్షణనిచ్చారు. ఈ సీజన్‌లో ఎంపికైన పెరిదేపిలో వ్యవసాయం చేసే రైతులకు ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఇద్దరు సీఆర్పీలను ప్రభుత్వం నియమించిందని ఏవో వి.రాము అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ పెంచుకుని పంటలు పండించాలని సూచించారు. సీఆర్పీ ఆర్ ప్రతాప్ మాట్లాడుతూ ఘన జీవామృతం తయారీ, వివిధ దశలలో పురుగులు పంటనాశన తెగుళ్లను నివారించే బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం మొదలైన వాటి తయారీ విధానాలను వివరించారు. వీటి వల్ల ఉత్పాదక వ్యయం తగ్గి, ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ ఉంటుందని వివరించారు. రైతు శిక్షణ కేంద్రం ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆర్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సూక్ష్మ పోషకాలైన జిప్సం, జింక్, బోరాన్ వాడుకోవాలని సూచించారు. అనంతరం రైతులు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యం వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెరిదేపి గ్రామ సర్పంచ్ చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఏఈవో టి. వెంకటేశ్వర్లు, ఎంపీఈవో కె. శ్రీకాంత్, సీఆర్పీ ఎన్. నరేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తెల్లకార్డుదారులందరికీ ఎన్టీఆర్ వైద్యం



అవగాహన కల్పిస్తున్న టీం లీడర్ పీరారెడ్డి

సింగరాయకొండ : తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ వైద్య సేవకు అర్హులని కందుకూరు డివిజన్ టీం లీడర్ కందుల పీరా రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్టీ ఆర్ వైద్యసేవపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్యం, ఆరోగ్య రక్ష, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం సేవ లపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. తెల్లకార్డు లేని వారు ఏడాదికి రూ.1200 మీసేవ ద్వారా చె ల్లించి ఆరోగ్యరక్ష కింద కార్పొరేట్ ఆసుపత్రు ల్లో రూ.2లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానప్రసూన, భోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ సెంటర్ల తనిఖీ



లోటస్ స్టడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సింగరాయకొండ రూరల్: పట్టణంలోని ఏపీవోఎస్ఎస్ స్టడీ సెంటర్స్‌ను మంగళవారం రాష్ట్ర కోఆర్డినేటర్ శైలజారాణి, జిల్లా కో ఆర్డినేటర్ బండి గోవిందయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృతా డిగ్రీ కళాశాల, పీఎన్‌సీఏ డిగ్రీ కళాశాల, లోటస్ హైస్కూల్‌లో తనిఖీలు నిర్వహిం చామని ఏసీవోఎస్ఎస్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఎక్కువ మంది విద్యార్థులను పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసేలా తీర్చి దిద్దాలన్నారు. 14 సంవత్సరాలు నిండిన వారు ఎలాంటి విద్యాఅర్హతలు లేకుండా ఓపెన్ స్టడీలో చదువుకోవచ్చని తెలిపారు. ఈ స్టడీ సెంటర్లకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. ఆయా సెంటర్‌లలో హాజరు పట్టి కలను, ప్రవేశ పట్టికలను తనిఖీ చేసి వాటి నిర్వహణ సక్రమంగానే ఉందని సంతృప్తి వ్యక్తం చేశామన్నారు. ముందు ముందు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రవేశ పరీక్షలు నిర్వహించుకో వాలని, దళారులను నమ్మి ఎక్కువగా నగదు చెల్లించవద్దని, పది, ఇంటర్ నేరుగా ఏపీవోఎస్ఎస్ స్టడీ సెంటర్స్‌కే కట్టాలని వారు తెలి పారు. వారితోఎటుఉ పీఎన్‌సీఏ కళాశాల ప్రిన్సిపాల్ డి నాగేశ్వరరావు, లోటస్ హైస్కూ ల్ ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాసులు, అమృత కాలేజీ ప్రిన్సిపాల్ మాధవ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఈ

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన

వెన్నూరు (కొండపి): వెన్నూరులోని ఎస్సీ కాలనీలో 20 లక్షల రూపాయల అంచనాతో నిర్మిస్తున్న రక్షిత నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను మంగళవారం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులు పరిశీలించారు. ప్రస్తుతం వెన్నూరులోని చెరువులో నిర్మించిన బావి నుంచి రక్షిత నీటిని కాలనీకి నేరుగా పైపుల ద్వారా ఇస్తున్నామని, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యాక, ట్యాంకు నుంచి ఇంటింటికి పైపులైను వేసి నీటిని సరఫరా చేస్తామని డీఈ తెలిపారు. ఆయన వెంట ఏఈ పి.కిషోర్ పాల్గొన్నారు.

పరిశీలించిన ఎమ్మెల్యే స్వామి

ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈతో వివిధ గ్రామాల్లో తాగు నీటి పథకాల పనితీరు, సమస్యలు గురించి డీఈతో చర్చించారు.

విద్యార్థి గణన సర్వే తనిఖీ



సర్వేను పరిశీలిస్తున్న సత్యసాగర్

టంగుటూరు: విద్యాశాఖలోని సీఆర్‌పీలు నిర్వహిస్తున్న విద్యార్థి గణన సర్వేను ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి వి.సత్యసాగర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న విద్యార్థి గణన సర్వేను పరిశీలించేందుకు సత్యసాగర్ మంగళవారం టంగుటూరు వ చ్చారు. టంగుటూరు స్కూల్‌కాంప్లెక్స్ సీఆర్‌పీ కసుకుర్తి జ్యోషిశ్రీ స్థానిక బ్రాహ్మణ బజారులో చేస్తున్న విద్యార్థి గణన సర్వేను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. గణన సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. సర్వే రికార్డు చూసి వివరాలు అడిగారు. ఈసందర్భంగా సీఆర్‌పీకి పలు సూచనలు చేశారు. గణన సర్వే రిపోర్టు వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ధృవీకరించి, ఆరిపోర్టును విజయవాడలోని డివిజినల్ ప్రాజెక్టు కార్యాలయానికి పంపించాలన్నారు. అలాగే అదే రిపోర్టును కంప్యూటరీకరించి నిర్దేసించిన ఫార్మెట్‌లో ఎస్ఎస్ఏ కార్యాలయానికి కూడా పంపించమన్నారు. ఈనెల 30 లోగా విద్యార్థి గణన పూర్తి చేయాలని, సర్వే సవివరంగా ఉండాలన్నారు. రవాణా వసతి లేని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలు ఎస్ఎస్ఏ కార్యాలయానికి ఇవ్వాలని, వీరికి రవాణా భత్యం చెల్లించడం జరుగుతుందన్నారు. మండలంలో 6స్కూల్ కాంప్లెక్స్‌లకు సంబందించిన 6గురు సీఆర్‌పీలు ఉన్నారు. వీరందరినీ నిర్ణీత కాలంలో విద్యార్థి గణన సర్వే పూర్తి చేసి సంబంధిత కార్యాలయాలకు పంపించాలని ఆయన ఆదేశించారు.

చంద్రన్న బీమా తక్షణ సాయం అందజేత

కారుమంచి(టంగుటూరు) : కారుమంచికి చెందిన ఆటో డ్రైవర్ చల్లా తిరుమలరావు రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందారు. చంద్రన బీమా యోజన పథకంలో ఆయన సభ్యుడిగా చేరారు. దీంతో తక్షణ సాయంగా రూ.5వేలు తిరుమ లరావు కుమారుడు ఆకాష్‌కు మంగళవారం వెలుగు ఎపీఎం తూమాటి రాజారావు అందించారు. తిరుమలరావు రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పోస్టుమార్టం రిపోర్టు రాగానే రిపోర్టు పరిశీలించి త్వరలోనే బీమా నగదు మొత్తం రూ.5లక్షలు చెల్లిస్తామని ఏపీఎం అన్నారు.

కార్యక్రమంలో బీమామిత్ర బిళ్లా పల్లవి, టీడీపీ నాయకుడు మేడికొండ రవీంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

సింగరాయకొండ: రెండు ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన పట్టణ ప్రధాన రహదారిపై ప్రశాంతి థియేటర్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొన డంతో మూలగుంటపాడు ఎస్సీ కాలనీకి చెం దిన వినోద్ ముఖానికి తీవ్ర గాయాల య్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని కందుకూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

అక్కడి ప్రాథమిక చికిత్సను అందించిన డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విష మించడంతో గుంటూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.



సముద్రంలో నిమజ్జనం అవుతున్న గణపతులు

నిమజ్జనానికి తరలిని గణనాథులు

సింగరాయకొండ రూరల్: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం 5వ రోజున ఘనంగా నిమజ్జనాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణపతి ప్రతిమలను ట్రాక్టర్లపై ఉంచి ఆయా గ్రామాలలో డప్పులు, మేళతాళాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఆసమయంలో మహిళలు వినాయక ప్రతిమలకు వారుపోసి, టెంకాయ, కర్పూరం సమర్పించి దేవుని ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గణనాథులను పాకల తీరానికి నిమజ్జనం చేసేందుకు భక్తులు భారీ ఎత్తున బయలుదేరారు. ఎస్‌ఐ హజరత్తయ్య ఎప్పటికప్పుడు సముద్రతీరం వెంబడి తన సిబ్బందితో పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా మెరైన్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది తదితర శాఖలను ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందుకుంటున్నారు.

సింగరాయకొండ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం పలు మండపాల్లో పూజలు నిర్వహించారు. కందుకూరు రోడ్డు సమీపంలోఓని శ్రీ తిరుపతమ్మ గోపయ్య దేవస్థానంలో గంజి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గురుజాడ వీధిలోని గణపతిని ఘనంగా నిమజ్జనం చేశారు. అంతకుముందు నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు పోటీ పడ్డారు.

ధ్యాన్‌చంద్‌కు నివాళి

పొన్నలూరు: చదువుతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని ప్రధానోపాధ్యాయుడు టి.రాధాకృష్ణమూర్తి అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చిన్నారికి ఆర్థిక సాయం అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే స్వామి

కొండపి: కొండపిలోని ఆదిఆంధ్రవాడ (మాదిగపల్లె)కు చెందిన కాములూరి బాబు (2) సంవత్సరాల చిన్నారి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చెన్నైలో వైద్యం చేయించుకున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన చిన్నారి కుటుంబ సభ్యులు దాదాపు లక్ష రూపాయలు వైద్యానికి ఖర్చు చేశారు. చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 48, 760 రూపాయలు మంజూరు చేయించారు. చెక్‌ను మంగళవారం కొండపిలో ఎమ్మెల్యే డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి బాలుడి తండ్రి కాములూరి గోవర్ధన్‌కు అందజేశారు.

కార్యక్రమంలో కొండపి ఏఎంసీ చైర్మన్ గొ రైపాటి రామయ్యా చౌదరి, మం డల జన్మభూమికమిటీ సభ్యు డు బొడ్డపాటి యల్లమంద నా యుడు, టీడీపీ నాయకులు గోనుగుంట వెంకటేశ్వర్లు, బూదవాటి సోమయ్య, న న్నూరి సుబ్బరామయ్య, దేపూరి సుబ్బా రావు, ఎస్సీ, ఎస్టీసెల్ జిల్లా మెంబర్ యన మద్ది వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కార్య దర్శి వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



పొన్నలూరులో గిడుగుకు ఉపాధ్యాయుల నివాళి

సింగరాయకొండ రూరల్: పీఎన్‌సీఏ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆచార్య గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీఎన్‌సీఏ విద్యాసంస్థల అధినేత గీతారాణి తెలుగు భాషకు గిడుగు రామమూర్తి చేసిన సేవలను కొనియాడారు. తెలుగుభాష అభివృద్ధి అనే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. భారత ఓలింపియన్ ధ్యాన్‌చంద్ జ్ఞాపకార్థం జరుపుకొనే క్రీడా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. భారత క్రీడల అభివృద్ధి గురించి విద్యార్థులకు ఆయన క్రీడలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.రమణయ్య, అధ్యాపక సిబ్బంది రామాంజనేయులు, ఎస్తేర్‌రాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థులను బహూకరిస్తున్న ఉపాధ్యాయులు

జరుగుమల్లి: తెలుగు భాషా దినోత్సవం, క్రీడాదినోత్సవం సందర్భంగా పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మంగళవారం చిరికూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు భాషలోనే చదువు చెప్పాలన్నారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, లక్ష్మీనారాయణరెడ్డి, మధుసూదనరావు, విజయభాస్కర్, గీతా, మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొన్నలూరు: విప్పగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయుడు ఎం.శివరామకృష్ణ మాట్లా డుతూ గిడుగు తెలుగు భాషా అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. తన రచనలు, పద్యాల ద్వారా తెలుగు భాషా గొప్పతనాన్ని చాటారన్నారు. అనంతరం తెలుగు పద్యాలు పలు రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై అవగాహన

పొన్నలూరు: గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా భాగంగా మంగళవారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, జానపద గేయాలు, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు ధనమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల గోల్డెన్‌జూబ్లీ కార్యక్రమం లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. గ్రంథాలయాల ఆవశ్యకతను అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాటా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం చేస్తున్న హెచ్‌ఎం తిరుపతి స్వామి

జాళ్లపాలెం (కొండపి): మండలంలోని జాళ్లపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులను గ్రామస్తులు, స్కూల్ హెచ్‌ఎం పల్లె తిరుపతి స్వామి మంగళవారంనాడు సన్మానించారు. బదిలీ అయిన బి. శేషారావు, ఎన్ శ్రీనివాసులు, టి. క్రిష్ణ, బి. వెంకటేశ్వరరావు, బి. సునీత, ఎస్. కె. రాజాక్ లను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

పారిశుధ్యం అందరి బాధ్యత



సమస్యలను తెలుసుకుంటున్న సర్పంచ్ నాగమణి

సింగరాయకొండ : పట్టణ పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ డా. కుంభా నాగమణి పేర్కొన్నారు. వార్డుబాట కార్యక్రమంలో భాగంగా ఈదిగమిట్ట, చంద్రబాబు కాలనీలలో మంగళవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొట్టెల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం ము రుగు తొలగించి కాల్వలు, రోడ్లపై బ్లీచింగ్ చ ల్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి, శానటరీ మేస్త్రీ చెరుకూరి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు సంధాని, సికిందర్ బాషా, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు పరిఢవిల్లాలి : ఎమ్మెల్యే స్వామి

మర్రిపూడి : ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలు పరిడవిల్లాలని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా బాలవీరాంజనేస్వామి అన్నారు. మంగళవారం కెల్లంపల్లి పోలేరమ్మ జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేపటితరం యువతకు మన సాంప్రదాయాలు అంది పుచ్చుకోవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో గ్రామదేవతల జాతరులు సమాఖ్యతను పెంపొందిస్తాయని చెప్పారు. ఆచార వ్యవహారాలను గ్రామీణులు నేటికి కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. వర్గాలకు కులాలకు అతీతంగా పండుగను జరుపుకోవడం సమరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు దామచర్ల సత్య, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, కొండపి మార్కెట్ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, ఎంపీపీ ఎర్రమోతు సుశీల, జెడ్పీటీసీ సభ్యులు టి. నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చేరెడ్డి నారసరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు హనుమారెడ్డి, కాకర్ల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రేగుల వీరనారాయణ, గ్రామ టీడీపీ నాయకులు ఎ సుబ్బారావు, మండాది బాలకోటయ్య, వెంకట నారాయణ, బి. కృష్ణయ్య, శ్రీనివాసులు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

సింగరాయకొండ: కుమార్తె ఈనెల 26 నుంచి కనిపించడంలేదని తండ్రి నాగరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హజరత్తయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలి

కనిగిరి టౌన్ : సబ్సిడీ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని సీపీఐయం నాయకులు కేశవరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 16న అర్ధరాత్రి నల్లబజారుకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడినప్పటికీ, కేసు నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గంలో అమ్ముకునే వారికి వ్యతిరేకంగా సీపీఐయం పోరాటం చేస్తోందన్నారు. ఇప్పటికైనా సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిఘా వ్యవస్థ చురుగ్గా మరింత చురుగ్గా వ్యవహరించాలని సూచించారు.

పల్లె ప్రగతికి పెద్దపీట

పనులపై సర్పంచ్‌ల పర్యవేక్షణ అవసరం

బొట్లగూడూరులో కలెక్టర్ వినయ్‌చంద్


బొట్లగూడూరు గ్రామస్థులతో కలెక్టర్ వినయ్‌చంద్

పామూరు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోందని, ప్రగతి పనుల విషయంలో సర్పంచ్‌ల పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ ఓడేవు వినయ్‌చంద్ సూచించారు. బొట్లగూడూరులో సీసీరోడ్లను మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోటపాటి విశాలమ్మతో మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలపై పర్యవేక్షణ పెట్టాలని, వందశాతం మరుగుదొడ్లు,రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, నిర్మించాలని సూచించారు. వీధిలైట్లు వెలుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అయితే వాటిని ఆర్పే నాథుడే లేడని గ్రామస్థులు వాపోయారు. విద్యుత్ దుబారాను అరికట్టాలని కలెక్టర్ సూచించగా, అంతా తన మనుమడు చూసుకుంటాడని సర్పంచ్ తెలియజేశారు. దీంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ నీవు కదా... మనుమడు పెత్తనం ఏమిటని కలెక్టర్ ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు.అనంతరం మోపాడు ఎంపీయూపీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. దాతల సహకారంతో పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధించడం అభినందనీయమని పేర్కొన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసుకోవాలని సలహా ఇచ్చారు. పాఠశాలలకు తగినన్ని గదులు లేవని గ్రామస్థులు తెలియజేయగా, వాటి ప్రతిపాదనలు తనకు పంపిస్తే నిధులు మంజూరు చేస్తానన్నారు. కాగా దూబగుంట, కొత్తపల్లిలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన ఫారం పాండ్స్, ఇరిగేషన్ కాల్వల్లో పూడికతీత పనులను పరిశీలించిన అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు ఈఈ రాజన్న నాయుడు, ఏఈ సతీష్, ఏఈ శ్రీకాంత్, సర్పంచ్ కోటపాటి విశాలమ్మ, ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, వైస్‌ఎంపీపీ పువ్వాడి రాంబాబు, తహసీల్దార్ వై. మెర్సీ కుమారి,ఎంపీడీవో నాగభూషణరావు పాల్గొన్నారు.


గణేష్ లడ్డును దక్కించుకున్న యూత్ ప్రతినిధులు

గణేష్ లడ్డూ రూ.1.58 లక్షలు

పీసీపల్లి : మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. తలకొండపాడు, పీసీపల్లి, కోదండరామపురం గ్రామాల్లో వినాయక విగ్రహాలను మంగళవారం సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు. తలకొండపాడులో10 కేజీల లడ్డును ఆ గ్రామానికి చెందిన గణేష్ యూత్ ఫోర్స్ రూ. 1.58లక్షలకు వేలం పాట ద్వారా దక్కించుకుంది. రూ.4వేలు విలువ చేసే కరెన్సీ దండలను నెలకుర్తి గోవింద్ అనే యువకుడు రూ.25వేలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా నిమజ్జనోత్సవాలు

పామూరు :మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 32 విగ్రహాలను పాతచెరువులో నిమజ్జనం చేశారు. విరాట్‌నగర్ కాలనీ, అంక-లమ్మవీధి, వడ్డేపాలెం, కందుకూరురోడ్డు, ఎన్జీవో కాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన విగ్రహాలు మమ్మీడాడీ సెంటర్ నుంచి ఊరేగించారు.వినాయక నిమజ్జనోత్సవానికి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురవ్వకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున జనం తరలివచ్చారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

కూరగాయల సాగుపై అవగాహన

కనిగిరి టౌన్ : సూక్ష్మ పోషకాలతో కూడిన కాలుష్య రహిత కూరగాయల సాగును చేపట్టాలని ఇక్రిశాట్ అధికారి వీ. రామాంజనేయులు పేర్కొన్నారు. రైతుకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పునుగోడు గ్రామంలో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వంగ,బీర, టమాటా, బెండ, సొరకాయ, తోటకూర, పాలకూర లాంటి అధిక దిగుబడులను ఇచ్చే కూరగాయలను పండించాలని, ఆరునెలలు పాటు కూరగాయలు కొనుగోలు చేసే ఖర్చుభారం తగ్గించుకోవచ్చునని సూచించారు. పొదుపు సంఘాల సభ్యులు చిన్నమొత్తంలో పెట్టుబడిపెట్టి అధిక ఆదాయం సంపాదించేందుకు కూరగయల సాగుపై దృష్టిసారించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవాలని సలహా ఇచ్చారు. సర్పంచ్ జీవకళ, చేతులు మీదుగా ఇక్రిశాట్ కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామైక్యసంఘం ఉపాధ్యక్షురాలు ప్రమీళా, జీవన్, జామువ, మాధురి, పొదుపుగ్రూపు మహిళలు, ప్రోటెక్ట్ ఎన్జీవో కార్యదర్శి చంద్రారెడ్డి, ఎలిషా, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం

పామూరు : పాశ్చాత్య సంస్కృతులకు అలవాటుపడి మాతృభాషా ప్రాధాన్యాన్ని విస్మరించవద్దని ఓమిగా కళాశాల ప్రిన్సిపాల్ టీవీకే రామచంద్రరావు అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుభాషా పితామహుడు గిడుగు రామూర్తి, కె.లక్ష్మణరావు చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. తెలుగుభాషాభివృద్ధికి గిడుగు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా పండితులు బ్రహ్మానందం, రాగిపాటి రమేష్, మాధవరావు, సుబ్రమణ్యం, నర్సారెడ్డి, రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు


దరఖాస్తులు స్వీకరించిన చైర్మన్, కమిషనర్

రుణ పథకాలకు ఇంటర్వ్యూలు

కనిగిరి టౌన్ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఎస్సీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2017-18 ఏడాదికి ఎస్సీ కార్పొరేషన్ పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకు అధికారులు, కమిటీ సభ్యుల సమక్షంలో లబ్ధిదారుల ఎంపికను చేపట్టారు. వారందరికీ త్వరలోనే రుణాలు మంజూరుచేస్తామని బ్యాంకుమేనేజర్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ పద్మావతి, చైర్మన్, వైస్ చైర్మన్‌లు చినమస్తాన్, చిరంజీవి పాల్గొన్నారు.

ఒకటిన మిలీనియం మార్చ్

కనిగిరి టౌన్ : సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలీనియం మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ చేపట్టనున్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

పీసీపల్లిలో భారీ వర్షం

ఈదురు గాలుల బీభత్సం : విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఉధృతమైన కొండవాగు


వర్షపునీటితో నిండిన చెక్‌డ్యామ్

పీసీపల్లి : మండలంలో సోమవారం అర్ధరాత్రి రెండుగంటలపాటు భారీ వర్షం కురిసింది. దాదాపు 20.4 మి.మీల వర్షపాతం నమోదైంది. పగలంతా ఎండవేడిమి ఉన్నప్పటికీ, సాయంత్రం 6 గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది. దీంతో వాతావరణం చల్లబడింది. 9 గంటలకు చిరుజల్లులతో ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12.30 నుంచి రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు,మెరుపులు ఎక్కువవ్వడంతో పలువురు ఆందోళన చెందారు. కమ్మవారిపల్లి, మలినేనివారిపల్లి మధ్య ఉన్న కొండవాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ వర్షంతో కంది, జొన్న, తదితర పైర్లు వికసించాయి.

చినుకు పడితే చీకటే : చినుకు రాలితే పీసీపల్లి మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గ్రామీణులు చీకట్లోనే కాలం గడపాల్సి వస్తోంది. ఏటా ఇదే పరిస్థితి నెలకొన్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. సోమవారం నాటి వర్షం కారణంగా బట్టుపల్లి, ముద్దపాడు, వాకంవారిపల్లి, మరికుంట పల్లి, పెద్దన్నపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లైన్ బ్రేక్ డౌన్ కావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస : జయ జానకి నాయక

ఆంధ్రజ్యోతి
5
కనిగిరి
ప్రకాశం • బుధవారం 30 ఆగస్టు 2017
కనిగిరి | హనుమంతునిపాడు | వెలిగండ్ల | సీఎస్‌పురం | పామూరు | పీసీపల్లి

అటవీ సంపద తరలిస్తే చర్యలు

కనిగిరి : అటవీ సంపదను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎఫ్‌వో నాగభూషణం హెచ్చరించారు. తరలిపోతున్న అటవీ సంపద అనే శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన డీఎఫ్‌వో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అటవీ భూముల్లో జామాయిల్ కలప ఉందని, దానిని వేలం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఉన్న ప్రతి వంద చెట్ల జామాయిల్ కొలతలు తీసి ప్రభుత్వ ధరల ప్రకారం ఎంత ధరలు వస్తాయని స్కానింగ్ చేయాల్సివుందని ఇందుకు సంబంధించి జామాయిల్ చెట్లకు ముందుగా నంబర్లు వేయవల్సివుందన్నారు.


గోవిందవారిపాలెంలో వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా నిమజ్జనోత్సవం

కనిగిరి : వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం మంగళవారం వేడుకగా జరిగింది. గుడిపాడు, గోవిందవారిపాలెం, పొనుగోడు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను మాకేరు వాగులో నిమజ్జనం చేశారు. మండలంలోని గోవిందవారిపాలెం గ్రామంలో వినాయక లడ్డూను నిమజ్జనం సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండా పార్థసారధి రెడ్డి వేలం పాటలో రూ 51 వేలకు పాటపాడారు. పూజల్లో కొండా వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కనిగిరి ఎస్సై ఉప్పు శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

వెలిగండ్ల : గన్నవరం, మొగళ్ళూరుపల్లి, తాడివారిపల్లి, పందువ, హుస్సేన్‌పురం, పీఎన్‌వరం, పులికుంట్ల, రామగోపాలపురం, రామలింగాపురం గ్రామాల్లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు మండపాల్లో కొలువైన వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. తప్పెట్లు,మేళతాళాలతో ఒకరిపైఒకరు గులాములు చల్లుకుంటూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నిమజ్జనం చేశారు. రామలింగాపురం గ్రామంలో కొప్పుల కిషోర్ వినాయక చవులడ్డూను రూ 56 వేలకు వేలం పాటలో పాడారు. గత 10 ఏళ్ళుగా వినాయక ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఆటో వర్కర్ల సమావేశం

కనిగిరి : చదువుతో నిమిత్తం లేకుండా నైపుణ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైవింగ్ లైసెన్స్‌లు ఆటో డ్రైవర్లకు ఇవ్వాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి పీసి కేశవరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్యభవనంలో మంగళవారం అమరేంద్ర అధ్యక్షతన ఆటో వర్కర్ల యూనియన్ సమావేశం జరిగింది. ఆటో కార్మికులపై ఆర్టీసీ డీఎం ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో చేయాలని కోరారు. ఆటో కార్మికులకు చంద్రన్నభీమా కింద ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు బోర్రయ్య, పిచ్చయ్య, జానీ, మల్లికార్జున, శ్రీను, రోజా, కొండారెడ్డి పాల్గొన్నారు.

చురుగ్గా యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

కనిగిరి : యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. రామచంద్రారెడ్డి అన్నారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం మండలంలోని చింతలపాలెం,యేరువారిపల్లి,తాళ్ళూరు కాంప్లెక్స్‌లకు చెందిన ఉపాధ్యాయులను సభ్యులుగాచేర్చుకున్నారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చేస్తున్నసేవలను గుర్తించి ఇతర సంఘాల సభ్యులు యూటీఎఫ్‌లో చేరుతున్నారని రాష్ట్రకౌన్సిలర్ రామిరెడ్డిఅన్నారు.కార్యక్రమంలో షేక్ ఖాజారహంతుల్లా,రాము,హరికృష్ణ, రాఘవ పాల్గొన్నారు.

పామూరు ఆర్టీసీ డిపో కలేనా?

కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు : పట్టించుకోని అధికారులు

పామూరు : కనిగిరి నియోజకవర్గంలో అతి పెద్ద మండలాల్లో రెండో స్థానాన్ని ఆక్రమించిన పామూరులో ఆర్టీసీ డిపో ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ దుస్థితి నెలకొంది. డిపో ఏర్పాటుకు అప్పటి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను ప్రతిపాదించారు. స్థానిక డిపో అధికారులు కూడా ప్రతిపాదనలు తయారుచేసి ఆర్టీసీ ఉన్నతాధికారులకు పంపించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కనిగిరి ఆర్టీసీ డిపోకు పామూరు మండలం నుంచే అత్యధిక ఆదాయం సమకూరుతోంది. మండలంలో 25 గ్రామపంచాయతీల పరిధిలో 76 ఆవాస గ్రామాలు ఉన్నాయి. కాగా, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీస్సులు తిరగడం లేదు. ఈ ప్రాంతాలకు రవాణా సదుపాయం మెరుగుపడాలంటే ఆర్టీసీ డిపో ఏర్పాటు అవసరమని పలువురు సూచిస్తున్నారు. ఐదేళ్ల కిందట రెవెన్యూ అధికారులు డిపో కోసం 4.79 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డిపో ఏర్పాటుకు నోచుకోవడం లేదు. భూముల ధరలకు రెక్కలు రావడంతో గతంలో స్థలాలు ఇవ్వడానికి ముందుకొచ్చిన రైతులు నేడు ససేమిరా అంటున్నారు. ఉచిత స్థలాలు సమకూరితే తప్ప, ప్రస్తుత పరిస్థితుల్లో స్థలాలు కొనుగోలు చేసి డిపో ఏర్పాటు చేసే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని ఆర్టీసీ అధికారులు కొందరు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ డిపోఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడితే పామూరు మండలానికి రవాణా సదుపాయం మెరుగుపడుతుందని పలువురు అంటున్నారు.


పామూరులోని ఆర్టీసీ కాంప్లెక్స్

స్థల పరిశీలన చేశాం

వై. మేర్సికుమారి, తహసీల్దార్, పామూరు



పామూరులో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు మా కార్యాలయానికి దరఖాస్తు చేశారు. ఐదేళ్ళ కిందట అప్పటి రెవెన్యూ అధికారులు 4.79 స్థలాన్ని కేటాయించారు.

చొరవ చూపని అధికారులు

టీవీకే సుబ్బారావు, పామూరు.



డిపో ఏర్పాటుకు అసైన్డ్ భూములు ఇవ్వడానికి రైతులు గతంలో ఒప్పుకున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవ చూపకపోవడంతో డిపో ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం భూముల ధర పెరిగిపోవడంతో స్థలాలు ఇవ్వడం లేదు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఎస్టీ మౌలాలి, పామూరు



పామూరులో ఆర్టీసీ డిపో కోసం రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించినప్పటికీ డిపో నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. అందువల్లే డిపో ఏర్పాటు కాలేదు. రవాణా సదుపాయం మెరుగుపడడం లేదు. ఇప్పటికైనా వారు చొరవ చూపాలి.

విద్యుత్ కార్మికుల ధర్నా

కనిగిరి : కనిగిరి విద్యుత్ డివిజన్‌లో విద్యుత్ కార్మికుల సమస్యలపై తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం 1245 ఆధ్వర్యంలో మంగళవారం డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ శాఖ డిఈ సొంత ప్రయోజనాలను ఆశించి బదిలీలు చేశారని, వెంటనే ఉన్నతాధికారులు బదిలీలను నిలుపుదల చేయాలని, విద్యుత్ డీఈపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక సమస్యలపై పలు మార్లు వినతి పత్రాలు అందించినా పరిష్కరించలేదన్నారు. వెంటనే అక్రమ బదిలీలు నిలుపుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని, జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం ఖాళీలను భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని, కాంటాక్టు కార్మికులకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. ధర్నాలో యూనియన్ నాయకులు ఆర్ రామోహన్‌రావు నాయక్, సీహెచ్ హరికృష్ణ, సీహెచ్ ప్రసాదు, షేక్ నాయబ్ రసూల్, ప్రసాదు, డివిజన్‌లోని యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.



విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కలెక్టర్ దృష్టికి సీఎస్ పురం సమస్యలు

సీఎస్‌పురం(కనిగిరి) : మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఓడరేవు వినయ్‌చంద్‌కు మంగళవారం ఎంపీపీ టి. పెద అల్లూరయ్య, జడ్పీటీసీ ఎం. డేవిడ్, కదిరి పార్థసారధి కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. వీబైలు నుంచి మైలు చర్లవరకు 7 కి.మీల రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా వెంటనే ప్రతిపాదనలను పంపాలని పంచాయతీరాజ్ ఎస్ఈని ఆదేశించారు. పలు గ్రామాల్లో ఫ్లోరైడ్ నివారణకు వాటర్‌ప్లాంట్ మంజూరుచేయాలని, సీఎస్‌పురంలో శిథిలమైన పీఆర్ గెస్ట్‌హౌస్‌ను మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకొని రావాలని కోరారు. కె. అగ్రహారంలో పాఠశాల భవనం నిర్మాణం పూర్తికి నిధులు మంజూరుకాలేదని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు డీవీ సుబ్బారావు చెప్పారు. మండలంలో కౌలు అధికంగా ఉన్నందున రుణాలు అందజేయాలని బి.రమేష్, డి. జానీ, చిరంజీవు కోరారు. ఆరివేముల ఏపీజీబీ బ్యాంకు పరిధిలో కౌలు లేకపోయిన 20 రుణాలు మంజూరు చేశారని, వాటిను సీఎస్‌పురం సిండికేట్ బ్యాంకు పరిధిలోకి మార్చుచేయాలని కోరారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

కనిగిరి : స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుచేసుకున్న పేదలందరికీ రుణాలు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం డివిజన్ అధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకొని ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం డివిజన్‌లో వందలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారనిచెప్పారు.అయితే లబ్ధిదారుల ఎంపికలో అధికారులు వివక్ష కనబరుస్తున్నారని, రుణాలు ఇవ్వడానికి కొర్రీలు వేస్తున్నారని ఆక్షేపించారు. అర్హులందరికీ రుణాలు ఇవ్వాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

ఈవ్ టీజింగ్ అనాగరికం

కనిగిరి టౌన్ : ఈవ్‌టీజింగ్ అనాగరికమని, దానిని రూపుమాపవల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఎంఎస్ఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఈవ్‌టీజింగ్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులతో ఐక్యంగా వ్యవహరించాలని సూచించారు. ఈవ్‌టీజింగ్ చట్టరీత్యానేరమని, ఈ విషయాన్ని భావిపౌరులు గుర్తించుకోవాలని కోరారు. ప్రేమోన్మాదం పేరుతో తోటి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి జైలుకు వెళ్ళిన ఎంతో మంది యువకులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకున్నారని వివరించారు. ప్రస్తుత చట్టాలు మహిళలకు ఎంతో వెన్నుదన్నుగా ఉన్నాయని చెప్పారు. డిగ్రీ కళాశాల యువకులు ఒకే బైకుపై నలుగురు తిరుగుతూ కళాశాలల వద్ద చక్కర్లు కొడుతున్నారని, వారిపై తాము నిఘా ఉంచామన్నారు. చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన యువకులను అదుపులోకి తీసుకోవటమే కాకుండా వారి తల్లిదండ్రులను బాధ్యులుగా చేయాల్సివస్తుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐలు ఉప్పు శ్రీనివాసులు, హరిబాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో నేత్రదానం

మార్టూరు: మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన ముద్దన వెంకట సుబ్బమ్మ(86) మృతిచెందగా కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. పంగులూరు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సి.వి.రాఘవయ్య ఆధ్వర్యంలో గుంటూరు నేత్రాలయం వారు కార్నియాలను స్వీకరించారు. వెంకట సుబ్బమ్మ కోరిక మేరకు నేత్రాలను దానం చేసినట్లు కుమార్తె కోటేశ్మరమ్మ ఈ సందర్భంగా తెలిపారు.


సుబ్బమ్మ(ఫైల్)

చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ నజీర్ ఉల్-ఇన్

పర్చూరు: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ నజీర్ ఉల్-ఇన్ అన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్వర్యంలో నాగులపాలెం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జె.వి.మేరికళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నజీర్ ఉల్ఇన్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాన్నారు. బాలికలకు ప్రత్యేక చట్టాలను కూడా పొందుపరచటం జరిగిందని, బాలికల హక్కుకు భంగం కల్గించిన వారికి చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. మైనర్ బాలికలకు వివాహాలు చేయటం నేరమని ప్రోత్సహించిన వారు శిక్షార్హులేనన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుకూరి సుబ్బారావు, ప్రముఖ న్యాయవాది రవీంద్రనాద్ రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు బ్రహ్మయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ నజీర్ ఉల్‌ఇన్

బస్టాండును పరిశీలించిన ఆర్ఎం

ఇంకొల్లు : ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం ఒంగోలు రీజియన్ మేనేజర్ ఆదాంసాహెబ్ పరిశీలించారు. బస్టాండు ఆవరణలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులలో నాణ్యతా లోపం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీర్లకు సూచించారు. ప్లాట్‌ఫారాల మీద నీరు నిలవకుండా చూడాలన్నారు. స్టాల్స్, మురుగుదొడ్లను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చీరాల నుంచి బెంగుళూరు సర్వీసును పునర్ధరించాలని ఈ సందర్భంగా ప్రయాణికులు కోరారు. ఆయన వెంట చీరాల డిపో మేనేజరు ఎం.శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరావు, వర్కు ఇన్‌స్పెక్టరు తులసీరావు, కంట్రోలర్ వలి, ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహన్‌కృష్ణ ఉన్నారు.


చార్టును పరిశీలిస్తున్న ఆర్ఎం

ఇసుకదర్శి వద్ద ఆగిన మంత్రి అఖిలప్రియ

మార్టూరు: నంద్యాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ రాష్ట్ర మంత్రి భూమా అఖిలప్రియ, భూమా బ్రహ్మానందరెడి కృతజ్ఞతలు తెలిపారు. వారు విజయవాడ వెళుతూ మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయం వద్ద ఆగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు మండల పార్టీ నాయకులు నంద్యాల వచ్చి ప్రచారం చేసినట్లు పార్టీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తొండెపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, మిన్నెకంటి రవికుమార్, రామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న అఖిలప్రియ, బ్రహ్మానందరెడ్డి

భూ ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ, పోలీసులు

ఇంకొల్లు : భీమవరం గ్రామంలో మంగళవారం ముప్పాళ, గొనసపూడికి చెందిన దళితులు, సీపీఎం ఆధ్వర్యంలో నీరు చెట్టులో కట్టలు వేసిన భూములలోకి వెళ్లి పగులకొట్టటంతో రెవెన్యూ, పోలీసులు వారిని అడ్డుకున్నారు. భూముల్లోకి వెళ్లి న జిల్లా సీపీఎం కార్యదర్శి పెంట్యాల హనుమంతరావు, సంతనూతలపాడు డివిజన్ కార్యదర్శి షేక్ మాబు, నాగులుప్పలపాడు మండల పార్టీ కార్యదర్శి శ్రీకాంత్‌తో 10 మంది రైతులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి అనంత రం విడిచిపెట్టారు.

నేడు ఉద్యానవన పంటలను పరిశీలించనున్న కలెక్టర్

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి దండు దారి వద్ద ఉద్యానవనం పంటలను కలెక్టర్ వినయ్‌చంద్ బుధవారం మధ్యాహ్నం పరిశీలించనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. సమీపంలోని యద్దనపూడి మండల పరిధిలో షేడ్ నెట్‌లో నర్సరీ, ఫారమ్ పాండ్స్‌ను, ఎఫ్ఐఏసీ చైర్మన్ దండా వీరాంజనేయులుకు చెందిన దండా క్షేత్రంలో పంటలను పరిశీలిస్తారని చెప్పారు.

వినాయక విగ్రహం వద్ద అన్న సమారాధన

హాజరైన పలువురు ప్రముఖులు

పర్చూరు: పర్చూరులోని అద్దంకమ్మ మాన్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా గణేష్ యూత్ కమిటీ నిర్వహకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త ఆలా అనిల్ కుమార్, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణతో పాటు పలువురు పురప్రముఖులు పాల్గొని విశేష పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమానికి విద్యావేత్త, ప్రముఖ వ్యాపారవేత్త ఆలా అనిల్ సహకారం అందజేయటం జరిగిందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్, లగడపాటి శంకర్, తులసి భువనేశ్వరరావు, కోటా సతీష్, తులసి అప్పారావు, కోటా నాగరాజు, లగడపాటి అంకమ్మ గాంధీ, క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు, బావయ్య, తులసి భాస్కర్, సురేష్, భాపనపల్లి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఆలా అనిల్‌కుమార్

పత్తి రైతులకు సూచనలు

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామంలో మంగళవారం రైతు శిక్షణ కేంద్రం ఒంగోలు వారి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వ్యవసాయాధికారి కె.వెంకటకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏడీఏ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులనుద్దేశించి మాట్లాడుతూ పత్తికి గులాబి రంగు పురుగు ఎక్కువైందని, ప్రత్యామ్నాయ పంటపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి రైతు పంట నమోదు చేపట్టాలని ఏవో వెంకటకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధి రత్నాకర్, ఎంపీటీసీ తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

చినగంజాం : మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో గిడుగు వెంకటరామ్మూర్తి 154వ జయంతిని పురస్కరించుకుని హెచ్ఎం ఉలిచి చంద్రశేఖర్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు దాత అనిల్ దంపతులు అందజేసిన రాతపుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, గ్రామకాపు మున్నం శంకరరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ఆంధ్రాబ్యాంకులో రద్దీ

ఏటీఎం పనిచేయక ఖాతాదారుల అవస్థలు

ఇంకొల్లు : ఆంధ్రాబ్యాంకు పేరు వింటేనే ఖాతాదారులు హడలెత్తిపోతున్నారు. ఏ పని జరాగాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆ శాఖకు సంబంధించిన ఏటీఎంలో సేవలు అందకపోవడంతో ఖాతాదారులు నిత్యం వెనుదిరిగి వెళ్లాల్సివస్తుందని ఆందోళన చెందుతున్నారు. 20 రోజులుగా మసీదు కాంప్లెక్సులో ఏటీఎం ఎప్పుడు చూసినా తాళాలు వేసి దర్శనమిస్తోంది. మరోవైపు బ్యాంకులో సిబ్బంది కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల టేబుల్స్‌పై ఫైళ్లు పేరుకు పోతున్నాయి. నెలరోజుల క్రితం ఈ శాఖ నుంచి ఇద్దరు సిబ్బంది బదిలీ కావడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగింది. దీంతో బ్యాంకులో లావాదేవీల కోసం వచ్చిన ఖాతాదారులు గంటలు తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుంది. పొలం పనుల సమయంలో రైతులు చిన్న పనికోసం బ్యాంకులకు వస్తే బారులుతీరిన క్యూలో గంటల కొద్ది నిలబడాల్సి వస్తుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటీఎం కూడా నిత్యం మూసి ఉంటుంది.

ఈ విషయమై బ్యాంకు మేనేజర్ కమలాకర్‌రావు మాట్లాడుతూ మసీదు కాంప్లెక్సు పైన అంతస్తు నిర్మాణం పనులు చేపట్టడంతో ఏటీఎంకు సంబంధించిన గొడుగును అక్కడ నుంచి తొలగించి మరో స్థానంలో ఏర్పాటు చేయాల్సివచ్చిందని తెలిపారు. దానికి సంబంధించిన ల్యాన్ కేబుల్ కావాల్సి రావడంతో 20 రోజుల కిందటే పై అధికారులకు తెలియజేశామని, మరో నాలుగైదు రోజుల్లో కేబుల్ వస్తే ఏటీఎం సేవలు పునరుద్ధరిస్తామని తెలిపారు. సిబ్బంది కొరతతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని, అసిస్టెంట్ మేనేజరు, మరో అధికారి బదిలీ కావడంతో ఉన్న వారిపై అదనపు పనిభారం పడిందన్నారు. రాత్రి వేళలు కూడా ఉన్న సిబ్బంది పనిచేస్తూ కొంతమేరకు ఖాతాదారులు ఇబ్బందులు పడకుండా చూస్తున్నామన్నారు. త్వరలో కొత్త సిబ్బంది వస్తారని తెలిపారు.

బాలికలు విద్యావంతులైతేనే సమాజ అభివృద్ధి

రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ

పర్చూరు: బాలికలు విద్యావంతులైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ అన్నారు. పర్చూరులోని ఆమంచి నరసింహం, వెంకట సుబ్బమ్మ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు మంగళవారం రూ.50 వేల విలువ చేసే ఏకరూప దుస్తులు, నోట్‌పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లాభాపేక్ష లేకుండా దాతల సహకారంతో బాలికల పాఠశాలను నిర్వహించటం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు సహకారం అందించటానికి ముందుకు వచ్చిన గుంటూరు సీఐ ఉప్పుటూరి రవిచంద్, యద్దనపూడి హరిప్రసాద్, అడపాల మనోజ్, ముత్యాల దుర్గలు అభినందనీయులన్నారు. అనంతరం ఉప్పుటూరి మురళీకృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు, జూనియర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ భవనం శ్రీనివాసరెడ్డి, జూనియర్ కళాశాల విశ్రాంతి ప్రిన్సిపాల్ మాదిరాజు రామ్మోహన్‌రావు, బాలికల పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు క్రిష్ణంశెట్టి పార్వతి, ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం ప్రతినిధులు పాబోలు ఉధయభాస్కర్, షేక్ అహ్మద్‌బాషా, కోటా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు తులసి భువనేశ్వరరావు, సింహదాటి శ్రీనివాసరావు, కఠారి సురేంద్రబాబు, కారుమూరి శ్రీనివాసరావు, కోటగిరి ప్రసాద్, పొన్నం రమణ, పాఠశాల హెచ్ఎం ఎస్.అవని తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

పాండురంగనాథ స్వామి పవిత్ర ఉత్సవాలు

మార్టూరు: ఇసుకదర్శి సమీపంలో పాండు రంగనాథ స్వామి ఆలయంలో స్వామివారి పవిత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి మొదలైన ఉత్సవాలు ఆదివారం వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల ఆరంభం రోజున వలపర్ల గ్రామానికి చెందిన చేనేత కార్మికులు వాసు, గురుబ్రహ్మం, వీరాంజనేయు లు పట్టుతో తయారు చేసిన దండలను స్వామివారికి అలంకరించారు. మంగళవారం సాయంత్రం కూడా ఆలయంలో స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు.

అలరించిన ముగ్గుల పోటీలు

పర్చూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్చూరులోని తూర్పువారి వీధిలో చౌదరి యూత్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు అలరించాయి. మొదటి బహుమతి మల్లాది రాధిక, రెండో బహుమతి కాసా అరుణ, మూడో బహుమతి తిరుములశెట్టి నాగమల్లేశ్వరి కైవసం చేసుకున్నారు. న్యాయనిర్ధేతలుగా రావి శివనాగమల్లేశ్వరి వ్యవహరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చినగంజాం : వరిపంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ మేరమ్మ అన్నారు. మండలంలోని పెదగంజాం, మున్నంవారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొని రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భరత్, రైతులు పాల్గొన్నారు.

31న డ్యాన్స్ పోటీలు

ఒంగోలు కలెక్టరేట్ : గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 31వతేదీ సాయంత్రం ఆరుగంటలకు స్థానిక కర్నూలురోడ్డులోని శ్రీనగర్ కాలనీలో డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కే శ్రీనివాసరెడ్డి, ఎం. రామారావు, డి.సుజాతలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.2116, రూ.1116, రూ.516 అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 30వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9494088624, 9052444762 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చేపల మార్కెట్ వద్ద వినాయకుని పూజలో ఎమ్మెల్యే దామచర్ల



హౌసింగ్ బోర్డు కాలనీలో సీఐ భీమానాయక్...



రామ్‌నగర్‌లో





కుండలతో వినాయక విగ్రహం ఏర్పాటు



మంగమూరు రోడ్డులో చిన్నారుల నృత్య ప్రదర్శన



గాంధీరోడ్డులో భారీ విగ్రహం

ఓం గణనాధాయనః

నగరంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ చోట్ల వినాయకుని విగ్రహాలను అందంగా అలంకరించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వినాయకుని విగ్రహాల వద్ద పూజలు చేశారు. -ఫొటోలు(సర్వేశ్వరరావు)

ఎస్సీ, ఎస్టీ రుణాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన

ఒంగోలు కార్పొరేషన్ : నగరపాక సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల సహకారంతో అందించే సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన కనిపించింది. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, కార్పొరేషన్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. షెడ్యూలు కులాల నిరుద్యోగ యువతీ, యువకులకు 464 యూనిట్‌లు లక్ష్యం కాగా 1600 మంది దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూలు తెగలకు 55 యూనిట్‌లకు రుణాలు అందించనుండగా, 250 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, స్థాపించనున్న యూనిట్ ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల జాబితా ఆయా బ్యాంకులకు పంపుతామని కమిషనరు సంకురాత్రి వెంకటకృష్ణ తెలిపారు. రూ. 2లక్షల రుణాన్ని ప్రభుత్వం సబ్సిడీతో అందించనుండగా రుణం కోసం అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరయ్యారు.



ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేయిస్తున్న అభ్యర్థులు

ఉద్యోగ నియామక పత్రం అందజేత

ఒంగోలు కలెక్టరేట్ : రెండున్నరేళ్ల క్రితం హత్యకు గురైన దళిత విద్యార్థి సాధు కేశవ్‌కుమార్ తల్లి నాగమణికి దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు సమక్షంలో మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మీసుధ మంగళవారం కామాటి ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. గతంలో నాగమణికి రూ 2,81,250 రిలీఫ్ మంజూరు చేయగా, ప్రస్తుతం ఉద్యోగ నియామక పత్రాన్ని కూడా అందజేశారు. ఈకార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కొండమూరి ప్రకాష్, దారా అంజయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

థియేటర్ --- సినిమా

సత్యం --- అర్జున్‌రెడ్డి

రత్నమహల్---ఆనందోబ్రహ్మ

గోపి ---జయజానకి నాయక

సాయిసరోజ్ -- లై

తులసీరాం --- ఫిదా

జయరాం ---నక్షత్రం

గోరంట్ల సినిమాస్ స్క్రీన్సలలో----

గౌతమ్‌నంద, ఆన్‌బెలి, నేనే రాజు

నేనేమంత్రి, ఆనందోబ్రహ్మ, అర్జున్‌రెడ్డి

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ఒంగోలు క్రైం : విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి లక్షరూపాయల చెక్కును ఎస్పీ సత్యఏసుబాబు అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డెత్ రీలీఫ్ ఫండ్ చెక్కును మృతి చెందిన కానిస్టేబుల్ సురేష్ భార్య దేవమ్మ అందుకున్నారు. ఈ నెల ఏడున కిర్లపూడి వెళ్లి జీపు తీసుకొని ఒంగోలు తిరిగి వస్తున్న సింగ సురేష్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకొనేందుకు ఎస్పీ చర్యలు చేపట్టి డెత్ రిలీఫ్ పండు కింద లక్ష రూపాయలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ టి.శివారెడ్డి, ఎస్బీడీఎస్పీ యు.నాగరాజు, పోలీసు సంఘం అధ్యక్షుడు నర్రా వెంకటరెడ్డి, వై.రామనాథం, ఆర్ఐ మనోహర్, ఎంటి ఆర్ఎస్సై రాజరావు పాల్గొన్నారు.

మెట్ట వరిలో కలుపు తొలగించాలి

ఒంగోలు రూరల్ : జూట్, మెట్ట వరిలో కలుపును తొలగించాలని ఏవో పి.వేణుగోపాల్ చెప్పారు. కొప్పోలు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కొప్పోలు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో బీటీఎం జి.కృష్ణ, ఏటీఎం ఎన్.మేఘన, ఎంపీఈవో తెల్లమేకల జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా పేరెంట్స్ డే వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్ : అంజయ్య రోడ్డులోని నెల్లూరు వారి రవీంద్రభారతి స్కూలులో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.విద్యార్థులు వారి తల్లిదండ్రులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీన్ రెడ్డి ప్రవీఫ్, ప్రిన్సిపాల్ టి. పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భాగ్యనగర్‌లోని నెల్లూరివారి రవీంద్రభారతి స్కూలులో పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో డీన్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఐఐటి ఇన్‌చార్జ్ హబీబుల్లా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వ్యవసాయశాఖలో ఇద్దరు ఏడీఏలకు ఉద్యోగోన్నతులు

ఒంగోలు వ్యవసాయం : వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకులుగా (ఏడీఏ) పనిచేస్తున్న ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ)లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 11మంది ఏడీఏలకు ఉద్యోగోన్న తులు లభించగా, జిల్లాలో ముగ్గురున్నా రు. జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలోని ఏడీఏ (పీపీ) జి.రత్న ప్రసాద్, బయలాజికల్ కంట్రోల్ ల్యాబ్‌లో ఏడీఏగా పనిచేస్తున్న ఎం.సుబ్రమణ్యేశ్వర రావు ఉద్యోగోన్నతి పొందారు. అద్దంకి ఏడీఏగా పనిచేస్తున్న ఇ.మాలకొండారెడ్డి ఉద్యోగోన్నతి వద్దని తీసుకోవడంలేదు. రత్నప్రసాద్‌ను విజయనగరం ఆత్మ డీపీడీగా, సుబ్రమణేశ్వరరావును చిత్తూరు ఐఫ్యాడ్ డీడీఏగా పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్ : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 5వతేదీ నుంచి మూడు రోజుల పాటు చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు పిలుపుని చ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాల యంలో మంగళవారం జరిగిన ఏపీ ఆశా వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కే కోటేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిహెచ్. రమాదేవి, ఎం. పరిశుద్ధం, దేవకుమారి, కే నిర్మలమ్మ, ఎన్ దుర్గాదేవి పాల్గొన్నారు.

వచ్చే నెల 17న రైతు సమరభేరి

ఒంగోలు కలెక్టరేట్ : రైతు సమస్యలపై సెప్టెంబరు 17వ తేదీన విజయవాడలో జరిగే రైతాంగ సమరభేరిని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలు పునిచ్చారు. స్థానిక మాదాల నారాయణ స్వామి భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన సమావేశ తీర్మానాలను చిట్టిపాటి మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. రైతుల రుణాలు రద్దు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర పెంచాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ రంగంలో బహుళ జాతి సంస్థల ప్రవేశాన్ని అడ్డుకోవాలని కోరారు. మహాత్మాజ్యోతి బాపూలే సత్యశోధక్ సమాజ్ స్థాపించిన సెప్టెంబరు 24నుంచి 30వరకు దేశ వ్యాప్తంగా కులం- ఆచరణాత్మక కార్యక్రమం చేపట్టాలని రైతు కూలీ సంఘం పిలుపునిచ్చిందని తెలిపారు. పేదల ఇళ్ల స్థలాలపై అక్టోబరు 8నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు, సదస్సులు, ధర్నాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు బహిరంగ సభ

ఒంగోలు కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 31వ తేదీన అద్దంకి బస్టాండు వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కమిటీ కార్యదర్శి జి.వి. కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభలో ముఖ్యఅతిధిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు పాల్గొంటారని, అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

బ్రెయిలీ స్కూలులో నిత్యావసరాల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్ : అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భాగ్యనగర్‌లోని లూయిస్ బ్రెయిలీ స్కూలులో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ మక్కెన థామస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటీవ్ పాలుట్ల సుధాకర్, వ్యాపారవేత్తలు బొమ్మిశెట్టి సందీప్, పబ్బిశెట్టి రాజేష్, స్కూలు ప్రిన్సిపాల్ ఎం. సుకన్యలు పాల్గొన్నారు.

తెలుగుభాషకు ఎర్రన సేవలు అజరామరం



ఓపీఎస్‌లో జ్యోతిర్మయిని, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్యతో ఆధ్వర్యంలో కవులను సన్మానిస్తున్న దృశ్యం

ఒంగోలు కల్చరల్ : తెలుగు భాషకు ప్రబంధ పరమేశ్వరునిగా పేరుగాంచిన జిల్లాకు చెందిన కవి ఎర్రనామాత్యుని సేవలు అజరామరమని ఎర్రన సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ చెప్పారు. మంగళవారం తెలుగు భాష దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యా లయం వద్ద ఎర్రన విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మహాభారతాన్ని రచించి న కవిత్రయంలో జిల్లాకు చెందిన ఎర్రమాత్యుడు ఉండడం జిల్లా ప్రజలందరూ గర్వించదగిన విష యమన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కోయ కోటేశ్వరరావు, మదర్ థెరిస్సా విగ్రహ కమిటీ అధ్యక్షుడు సుద్దపల్లి శశిబాబు, పాస్టర్ కాకుమాను ఏసుపాదం, కవులు ఆవుల వెంకటరమణ, భూపతి రాజారావు, దాసరి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

వింగ్స్ ఇండియా ఆధ్వర్యంలో

గిడుగు జయంతి సందర్భంగా వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం జరిగింది. రైలుపేటలోని వింగ్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన సభలో ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉదయజానకిలక్ష్మి విద్యార్థులచే తెలుగు భాష ప్రమాణాన్ని చేయించారు. ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో నారాయణ పబ్లిక్ స్కూలులో జరిగిన సభకు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్, మద్దిరాల శ్రీనివాసులను గిడుగు సాహితీ పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో సభలో కరస్పాండెంటు కొల్లా సౌజన్య, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు, మిడసల మల్లిఖార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, డాక్టర్ మున్నంగి రాహేలు, చింత పిల్లి ఉదయజానకి, సలిగల రాధికారత్న పాల్గొ న్నారు. బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జరి గిన సభలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సివి యల్ సుబ్రహ్మణ్యం, ధేనువకొండ వెంకట సుబ్బయ్య, శనగవరపు కుమార్ పాల్గొని గిడుగు రామ్మూరి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఓపీఎస్‌లో...

ఒంగోలు కలెక్టరేట్ : స్థానిక మంగమూరు రోడ్డులోని ఒంగోలు పబ్లిక్ స్కూలులో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యానచంద్‌ల చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. ఓపిఎస్ తెలుగు అధ్యాపకురాలు, నరసం ఉపాధ్యక్షురాలిగా నియ మితులైన సింహాద్రి జ్యోతిర్మయిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నల్లూరి క్రాంతికుమార్, అకడమిక్ సభ్యులు పి. కదిరేశన్, జి. కవితాలత, ఎం. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పి జమిమా పాల్గొన్నారు.

శ్రీరామ్ స్కూలులో..

స్థానిక శ్రీనగర్ కాలనీలోని శ్రీరామ్ కాన్సెప్ట్ స్కూలులో మాతృభాష దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ వెన్నపూస శ్రీరాములు రెడ్డి, హెచ్ఎం వెన్నపూస సుజితలు మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. గిడుగు జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు ఎం. రామారావు, బి. మురళీకృష్ణను సత్కరించారు.

ఆర్కిడ్స్ టెక్నో స్కూలులో...

స్థానిక ఆర్కిడ్స్ టెక్నో స్కూలులో మాతృభాషాదినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఆధునిక కవుల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత జి. అజయ్‌కుమార్ తెలుగు బాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. శ్రావణకుమార్, రంగారావు, శిరీష, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గిడుగు, ధ్యానచంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు జి. ధనుంజయరావు, తెలుగు అధ్యాపకురాలు పి. యామిని పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ట్రెజరీ డీడీ

ఒంగోలు కలెక్టరేట్ : ట్రెజరీ శాఖ డీడీ ఆకుల లక్ష్మీకుమారి ట్రెజరీశాఖ జేడీ ఉద్యోగోన్నతి పొం దారు. ఆ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. రవిచంద్ర మంగళవారం ఆమెను విజయవాడలోని ఇబ్రహీంపట్నం సర్వశిక్షా అభియాన్ స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఇక్కడ మూడున్నరేళ్లకుపైగా పనిచేశారు. మంచి అధికారిగా గుర్తింపు పొందారు. వివిధ సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో జరిగిన అవినీతి అక్రమాల పై సమగ్రవిచారణ చేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేయడంతో పాటు సంబంధిత అధికారులు, ఉద్యోగులపై కూడావేటు వేశారు. ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగోన్నతి పొందిన ఆకుల లక్ష్మీకుమారికి ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు. అసోసియే షన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాజా రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్, వెంకటేశ్వర్లు, నారాయణ, హసీనా బేగం, ఎలీషారాణి, సుధీరా, అబ్దుల్ ఖాదర్ ఉన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఒంగోలు కలెక్టరేట్ : నగర పాలక సంస్థ పరి ధిలోని త్రోవగుంట ఐఎల్‌టీడీ కంపెనీ వద్ద ఉన్న శ్రీ శివసాయి ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వ హించారు. ఈ మేళాలలో డిజటల్ టీవీ, బ్రాడ్ బ్రాండ్, కేబుల్ టీవీ సర్వీసులు అందించే ఒర్టెల్ కమ్యూనికేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్, మెకానిక్ ట్రేడులలో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థు లకు ఈ మేళా నిర్వహించారు. 68 మంది అభ్యర్థు లు పాల్గొనగా 20 మందిని ఎంపిక చేశారు. ఎం పికైన అభ్యర్థులకు ఏడాదికి రూ 1.25 లక్షల వేత నంతో పాటు ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు బెల్లం సు బ్బారావు, బిస్మే కుమార్‌దాస్, సాహు, జిల్లా ఐటీఐ కన్వీనర్ రాజశేఖర్‌బాబు, మద్దిపాడు జయ ఐటీఐ ప్రిన్సిపాల్ మహబూబ్‌బాష, శివసాయిఐటీఐ సిబ్బంది హర్ష, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ దళిత మ హాసభ ఆధ్వర్యంలో సెప్టెంబరు 3వ తేదీన కొన కనమిట్ల మండలం యిరసంగుండంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవం తం చేయాలని మహాసభ నాయకులు కోరారు. మంగళవారం ఒంగోలులో అంబేద్కర్ విగ్రహావిష్క రణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆవిష్కరణ కా ర్యక్రమంలో దార్ల సింగయ్య, పురిపాటి రాఘ వులు, ఎంసీడీకేపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంద్రా జుపల్లి ఆంజనేయులు, పీకా ఏసురత్నం, దళిత కళా మండలి జిల్లా కన్వీనర్ దాసరి కోటేశ్వరరావు, దొడ్ల వెంకటేశ్వర్లు, చప్పిడి కోటేశ్వరరావు, నల్లూరి రమేష్, కాటూరి రమేస్, జి.రోశయ్య, కే. మరియమ్మ పాల్గొ న్నారు.

మాగుంట కార్యాలయంలో సంబరాలు

ఒంగోలు కలెక్టరేట్ : నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించడంతో స్థానిక రామనగర్‌లో ని మాగుంట కార్యాలయంలో మంగళవారం సంబ రాలు నిర్వహించారు. టీడీపీ మహిళా కార్యకర్తలు మాగుంటకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలి పారు. ఈకార్యక్రమంలో నాళం నరసమ్మ, కె. కుసు మకుమారి, పి. సునీత, రాయపాటి సీత, చెరుకూరి లక్ష్మీ,గోవిందమ్మ, సుబ్బులు, రమాదేవి పాల్గొన్నారు.

మాగుంటకు స్వీట్ తినిపిస్తున్న మహిళలు


భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన ఐఈ కోఆర్డినేటర్

ఒంగోలు విద్య : గద్దలగుంటలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో సర్వశిక్షా అభి యాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని విలీన విద్య సహాయ సమన్వయకర్త ఆర్. జగన్నా ధరావు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో జరుగుతున్న శిక్షణ విద్యార్థుల పురోగతి గురించి ఆయన సమీక్షిం చారు. ప్రతి సోమవారం జరిగే ఫిజియోథెరపీ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు నమోదు శాతం రికా ర్డులను పరిశీలించారు. విలీన విద్య ఉపాధ్యాయు లు మాలిక్ మోహిద్దీన్, నాగేంద్రం పాల్గొన్నారు.

తెగుళ్లపై అవగాహన

ఒంగోలు వ్యవసాయం : బ్యాక్టీరియా వల్ల, వైరస్, శిలీంద్రాల వల్ల వ్యాపించే తెగుళ్ల లక్షణాలు, వాటి నివారణపై ఎంపీఈవోలకు కృషి వికాస కేంద్ర దర్శి శాస్త్రవేత్త వరప్రసాద్ మంగళవారం వివరించారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవర ణలో ఒంగోలు డివిజన్ ఎంపీఈవోలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాట్ శాస్త్రవేత్త రమేష్ పలు సూచనలిచ్చారు. అనం తరం ఒంగోలు ఏడీఏ సుబాషిణి ఎంపీఈవోల సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్ర వ్యవసాయాధికారి సమరనాధ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

ఒంగోలులీగల్ : సెప్టెంబ రు 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు సివిల్‌తోపాటు రాజీప డదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించాలని దృశ్య విక్షణ ద్వారా హైకోర్టు ప్రధాన న్యా యమూర్తి రమేష్ రంగనాథన్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.జి. ప్రియదర్శిని, కార్యదర్శి టి. రాజావెంకటాద్రికి సూచించారు.

నేరం మోపబడిన ప్రతి వ్యక్తి నేరస్తుడు కాదు

ఒంగోలులీగల్ : నేరం మోపిన ప్రతి వ్యక్తి అది నిరూపితమయ్యే వరకూ అతడిని నేరస్తుడిగా పరిగణించరాదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.రాజావెంకటాద్రి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కారాగాన్ని న్యాయమూర్తి మంగళవారం ఆయన సందర్శించారు. ఖైదీలకు అందుతున్న భోజనం, వసతి, సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన ఐలు అదాలత్ ఒక కేసును ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఎం.సుధ పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కారాగార జైలర్ పి.ఎస్. రామచంద్రమూర్తి, న్యాయవాది డి.రాజేంద్రప్రసాదు, పారాలీగల్ వలంటీర్ బి.వి. సాగర్ పాల్గొన్నారు.

పేస్‌లో ఆటల పోటీలు

ఒంగోలు విద్య : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పేస్ రెండు షిఫ్టు పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థులకు ఆటపోటీలు జరిగాయి. బాలుర విభాగంలో వాలీబాల్, క్రికెట్, బాలికల విభాగంలో కారెమ్స్, చెస్, ఖోఖో, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. అధ్యాపకులకూ వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెటి శ్రీధర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి పోటీలు ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనిల్‌కుమార్, శ్రీనివాసన్, వి.మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశంభవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో పలువురు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు ఎలాంటి ఆధారం లేకుండా రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంగళరెడ్డి, ఆదినారాయణ, ఎర్రయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనంలో వారానికి మూడు గుడ్లు ఇవ్వాల్సిందే

ఒంగోలు విద్య : పాఠశాలలో విద్యార్థులకు అమలు అవుతున్న మధ్యాహ్నభోజనంలో వారానికి తప్పనిసరిగా మూడు గుడ్లు ఇవ్వాల్సిందేనని పాఠశాల విద్యాశాఖకమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.రమణారెడ్డి తెలిపారు. ఆగస్టు 1 నుంచి వంట ఖర్చును ప్రాథమిక పాఠశాలలకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 6.48, యూపీ, హైస్కూలు విద్యార్థులకు రూ. 8.53కు పెంచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వమే పాఠశాలకు కోడిగుడ్లు సరఫరా చేసున్నందున గుడ్డు ధర రూ.2.35ను వంట ఖర్చు నుంచి మినహాయించాలని తెలిపారు.

బీజేపీ మైనార్టీ మోర్చా నగర అధ్యక్షునిగా అబ్దుల్

ఒంగోలు కలెక్టరేట్ : భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా నగర అధ్యక్షునిగా సయ్యద్ అబ్దుల్ సలీం నియమితులయ్యారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం మంగళవారం జరిగిన కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖలీఫాతుల్లా బాషా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గౌస్ అహ్మద్ పాల్గొన్నారు.